సాహితీ గత వారం పుస్తకాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గుంటూరు
fb.com/vaartha Digital

భారత్, చైనాపై 100% సుంకాలు వేయండి: ట్రంప్
ఫ్రాన్స్‌లో వెల్లువెత్తిన నిరసనలు 9

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-9-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 221 పేజీలు: 12 వెల: 6.50

# సంక్షేమం సూపర్‌హిట్



## 14 నెలల్లో హామీలన్నీ నెరవేర్చాం

### 'సూపర్ సిక్స్'ను అవహేళన చేసేవారికి జవాబు చెప్పాం

ప్రజా దీవెనతో భేషుగ్గా కూటమి పాలన

దసరా గిఫ్ట్‌గా పన్నులు తగ్గించిన ప్రధాని

'ఆటో మిత్ర' కింద రూ. 15 వేలు సాయం

**అనంతపురం 'సూపర్‌సిక్స్' సభలో సీఎం చంద్రబాబు**

**అనంతపురం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 14 నెలల కాలంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాం. కూటమి పాలనలో సంక్షేమం సూపర్‌హిట్ అని, అభివృద్ధి సూపర్‌హిట్ అని మేము ప్రజల కోసమే పని చేస్తున్నామని, అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని ప్రజల సహకారం ఇంకా అవసరమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభిప్రాయ పడ్డారు. వైకుంఠపాలి వద్దని కంటిన్యూటీ గౌర్నమెంట్‌తో ఆంధ్రప్రదేశ్‌ను అన్నింటా సూపర్‌హిట్ చేద్దామని, దేశంలోనే రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా చేస్తామని, గత ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేనలు కలిసి పోటీ చేశామని, అందరూ కలిసి కట్టుగా రాష్ట్రం కోసం పని చేస్తున్నామని, ప్రజల దీవెనతో ఈ హిట్ కాంబినేషన్ ముందుకు కొనసాగుతుందని రా ష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అనంతపురం శివారులో లక్షలాది మందితో బుధవారం సాయంత్రం జరిగిన భారీ బహిరంగ సభలో సీఎం చంద్రబాబునాయుడు ప్రజలను ఉద్దేశించి దాదాపు గంటసేపు ప్రసంగించారు. సభలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, ఇతర కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు ఇతర నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సభలో సీఎం చంద్రబాబునాయుడు >>2

అనంతపురం సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

### ప్రతి పక్ష హోదా లేకపోయినా.. అసెంబ్లీకి వెళ్లాలని ప్రజలు చెప్పాలి

మెడికల్ కాలేజీలపై అసెంబ్లీలో చర్చకు రావాలని సిఎం సూచన

**అనంతపురం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మో హన్‌రెడ్డికి సవాల్ విసిరారు. >>2



కఠ్మాండులో ఆందోళనకారులను అదుపుకొంటున్న పోలీసులు

## నేపాల్‌లో తాత్కాలిక ప్రభుత్వం



### చీఫ్‌గా మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కి

**ఇంకా ఆగని హింసాకాండ.. సైన్యం ఆధీనంలోకి నేపాల్**

**ఖాట్మండు, సెప్టెంబరు 10:** నేపాల్‌లో జనరేషన్ జెడ్ విధ్వంసం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. దేశంలో సోషల్ మీడియా ద్వారా ఉద్యమ్యాన్ని ఉసిగొల్పుతున్న ఆ జెన్ జెడ్ గ్రూపుకు చెందిన నేతలు తాత్కాలిక ప్రభుత్వ చీఫ్‌ను ప్రకటించారు. తాత్కాలిక ప్రభుత్వ చీఫ్‌గా మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కి పేరును ప్రకటించారు. ప్రభుత్వాన్ని నడిపేందుకు ఆమెకు పగ్గాలు ఇవ్వాలని పేర్కొన్నారు. సోషల్ మీడియా ఉద్యమాన్ని నిర్వహిస్తున్న జనరేషన్ జెడ్ తాజాగా ఈ ప్రతిపాదన చేసింది. ప్రస్తుతం నేపాల్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియా బ్యాన్‌ను వ్యతిరేకిస్తూ జెన్ జెడ్ భారీ ఉద్యమాన్ని చేపట్టింది. జెన్ జెడ్‌లో 13 ఏళ్ల నుంచి 28 ఏళ్ల మధ్య ఉన్న యువత పాల్గొన్నది. అయితే తాము చేపట్టిన ఉద్యమాన్ని కొందరు అవకాశవాదులు తప్పుదారి పట్టించినట్లు జెన్ జెడ్ ఆరోపిస్తున్నది. ప్రధాని కేపీ శర్మ ఓలీ రాజీనామా చేసిన తర్వాత పరిస్థితులు మరీ అదుపు తప్పాయి. అధ్యక్ష కార్యాలయాన్ని, పార్లమెంట్ బిల్డింగ్‌ను, సుప్రీంకోర్టు బిల్డింగ్‌ను నిరసనకారులు దగ్ధం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం నేపాల్ ఆర్మీ దేశాన్ని ఆధీనంలోకి తీసుకున్నది. బుధవారం >>2



అనంతపురం సభలో ప్రసంగిస్తున్న డి. సిఎం పవన్

## రాష్ట్రాభివృద్ధికే 'సూపర్‌సిక్స్'

### ఆర్థిక ఇబ్బందులు అధిగమించి పథకాల అమలు: డి. సిఎం పవన్

**అనంతపురం, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** రాష్ట్ర అభివృద్ధి కోసమే సూపర్‌సిక్స్ పథకాలను రూపొందించి ఆర్థిక ఇబ్బందులను అధిగమించి పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు బుధవారం అనంతపురం నగరంలోని బైపాస్ వద్ద ఉన్న జిఎంఆర్ గ్రౌండ్స్ లో ఏర్పాటుచేసిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తో కలసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయల సీమకు ఎప్పుడూ ఒకటే సీజన్ అది కరవు సీజన్ అని దానిని రూపు మాపే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన యువత ఉద్యోగ అన్వేషణ నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్న దౌర్భాగ్య పరిస్థితుల నుండి బయటపడాలని దృఢ సంకల్పంతో సీఎం చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామికరణ జరిగే లాగా ప్రణాళికల రూపొందిస్తున్నామని తెలిపారు. పార్టీలు వేరైనా, ప్రజలశ్రేయస్సును దృష్టిలో >>2

## నేపాల్ నుంచి తెలుగువారు వెనక్కి


### వారి సమాచారం సేకరణ, భద్రతపై అధికారులకు మంత్రి లోకేష్ దిశానిర్దేశం

అక్కడివారితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పిన మంత్రి

రాష్ట్రానికి సురక్షితంగా తీసుకువస్తామని భరోసా

నేపాల్ నుంచి బీహార్ మీదుగా 22 మంది ప్రయాణం

**కఠ్మాండు నుంచి విజయవాడ, విశాఖకు ప్రత్యేక విమానాల్లో తరలింపు**



నేపాల్‌లోని తెలుగువారితో వీడియో కాల్ మాట్లాడుతున్న మంత్రి లోకేష్



కఠ్మాండు నుంచి బీహార్ మీదుగా ప్రత్యేక బస్సులో వస్తున్న 22 మంది తెలుగువారు

**విజయవాడ,సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా వెనక్కి తీసుకరావడమే ఏకైక అజెండా అని,విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. ఈ మేరకు అధికారులు సమన్వయంతో వ్యవహరించి అవసరమైన చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. నేపాల్ లో చిక్కుకున్న పలువురు తెలుగువారితో మంత్రి లోకేష్ ఫోన్, వీడియో కాల్ ద్వారా మాట్లాడి వారిలో భరోసా నింపారు. నేపాల్‌లో చిక్కుకున్న వారిని తిరిగి స్వస్థలానికి తీసుకు వచ్చేందుకు ఏపీ మంత్రి నారా లోకేశ్ అనంతపురం పర్యటన రద్దు చేసుకున్నారు.నేపాల్‌లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో అక్కడ ఉన్న ఏపీ వాసులను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడం పై మంత్రి దృష్టి సారించారు.అనంతపురంలో నేడు నిర్వహించనున్న 'సూపర్‌సిక్స్ సూపర్‌హిట్' సభకు ఆయన హాజరుకావాల్సి ఉంది.అయితే లోకేష్ తన పర్యటన రద్దు చేసుకున్నారు. హుటాహుటిన మంత్రి నారాలోకేశ్ సచివాలయానికి చేరుకున్నారు.. అక్కడ రియల్‌టైమ్ గవర్నెన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్‌రూమ్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమన్వయం >>2

## రాధాకృష్ణన్ రేపు పదవీ ప్రమాణం

### రాష్ట్రపతి భవన్‌లో వేడుక



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10:** భారత ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణ ఎన్నికైన విషయం తెలిసిందే. ఆయన ఈ నెల 12న ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నది. రాధాకృష్ణన్‌తో శుక్రవారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయిస్తారని అధికారులు తెలిపారు. పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం రాష్ట్రపతి భవన్‌లో జరుగుతుందని పేర్కొన్నారు. మంగళవారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి అయిన రాధాకృష్ణన్ ఇండి కూటమి అభ్యర్థి జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డిపై 152 ఓట్ల తేడాతో గెలుపొందారు. జులై 21న జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఉప రాష్ట్రపతికి రాజీనామా చేసిన విషయం తెలి సిందే. భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేశారు. దీంతో ఉపరా ష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఆ క్రమంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను రంగలోకి దింపారు. అలాగే ప్రతి పక్ష ఇండి కూటమి అభ్యర్థిగా >>2

## శాస్త్రవిజ్ఞానంతో వికసిత్ భారత్

### డా.నాయుడమ్మ పురస్కారం ముద్దిరాల నాగరాజుకు ప్రదానం చేసిన తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**సైన్స్‌ను గ్రామాలకు తీసుకువెళ్లిన నాయుడమ్మ అంటూ ప్రశంస**



బుధవారం తెనాలిలో నాయుడమ్మ పురస్కారాన్ని మద్దిరాల నాగరాజుకు ప్రదానం చేస్తున్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 10:** శాస్త్రవిజ్ఞానం ప్రజల పురోభివృద్ధికి తోడ్పడేందుకు డా.యలవర్తి నాయుడమ్మ తపించారనీ, ఆదిశగా జీవితకాలం పనిచేసి ఎన్నో విజయాలను సాధించారని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. బుధవారం తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం లో డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆర్థిక సేవల విభాగం సెక్రటరీ నాగరాజు మద్దిరాల, డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ అధ్యక్షుడు యడ్లపాటి రఘునాధబాబు, జాతీయ చర్మ పరిశోధనా సంస్థ ముఖ్య కార్యదర్శి డాక్టర్ స్వర్ణ వి.కాంత్ పాల్గొన్నారు. సభలో డాక్టర్ యలవర్తి నాయుడమ్మ చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆర్థిక సేవల విభాగం సెక్రటరీ నాగరాజు మద్దిరాలకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ శాస్త్రవిజ్ఞానాన్ని గ్రామీణులకు చేరువచేసిన ప్రజల శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ అవార్డును ఆర్థికరంగంలో పీపుల్స్ అడ్మినిస్ట్రేటర్‌గా >>2

## అపజయాలే విజయాలా?

### 'సూపర్ సిక్స్' విజయోత్సవాలను ఎద్దేవా చేసిన మాజీ సిఎం జగన్

ప్రభుత్వం యధేచ్ఛగా అప్పులు చేస్తోంది..

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం

రైతులను రోడ్డునపడేస్తే సహించం: జగన్



**విజయవాడ, సెప్టెంబరు 10, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆరోపించారు. అపజయాలను విజయాలుగా చెప్పుకుంటూ సూపర్‌హిట్ అంటూ సంబరాలు చేసుకోవడం చోద్యంగా ఉందన్నారు. గత ఐదేళ్లలో ఇలా ఉండేదా? మా పాలనలో రైతులు రోడ్డెక్కడం చూశారా?" అని వైఎస్.జగన్ ప్రశ్నించారు. బుధవారం వైసిపి కేంద్ర కార్యాలయంలో మీడియాతో జగన్ మాట్లాడుతూ తమ హయాంలో రైతులకు ఇబ్బంది అనేదే లేదు అని చెప్పారు. ఇలాంటి పరిస్థితికి.. చంద్రబాబు సిగ్గుతో తలదించుకోవాలి అని విమర్శించారు. రెండు నెలలుగా రైతులు ఎరువులు దొరక్క అగచాట్లు పడుతున్నారని, పగలు రాత్రి తేడా లేకుండా క్యూలైన్లలో నిలబడ్డారని అన్నారు. సిఎం సొంత జిల్లా.. ఆయన నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి నెలకొందన్నారు. సమయానికి ఎరువులు అందిస్తే రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దేనికి ? అని ప్రశ్నించారు. రైతులు యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రైతులకు అందాల్సిన ఎరువులు బ్లాక్‌మార్కెట్‌లో స్కాంలకు గురవుతున్నాయని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ.. రైతుల పక్షాన రైతులతో కలిసి ఆర్డీవోలకు అర్జీలు ఇచ్చే >>2

11-09Pg2exHMNWJQEV 2nd_11-09Pg2exHMNWJQEV.qxd 9/11/2025 12:51 AM Page 1





పాట్నాలో బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉపాధ్యాయ నియామక పరీక్ష ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

# అసెంబ్లీకి వెళ్లాలని ప్రజలు చెప్పాలి

>> మెడికల్ కాలేజీలపై అసెంబ్లీలో చర్చకు రావాలని సీఎం చంద్రబాబునాయుడు వైఎస్.జగన్‌కు, ఆ పార్టీ ఎమ్మెల్యేలను డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల వ్యవహారంపై వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలో బుధవారం ఉదయం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసిన నేపథ్యంలో అనంతపురం వేదికగా బుధవారం మధ్యాహ్నం సూపర్ సిక్స్–సూపర్‌హిట్ విజయోత్సవ సభ అనంతపురంలో జరిగింది. ఆ సభ వేదికపై నుంచి సీఎం చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వంలో తీసుకునే చర్యలను వివరిస్తూనే వైసిపి పాలన గురించి, పరోక్షంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురించి సీఎం చంద్రబాబునాయుడు విమర్శలు గుప్పించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉనికే కోల్పోతోందని, ఫేక్ ప్రచారాలకు, ఫేక్ రాజకీయాలకు దిగుతోందని వైసిపి ఆఫీసులు మూసేసి సోషియల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకుంటోందని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది ప్రజలని మేం కాదని, మీ రందరూ ఆ నాయకునికి బుద్ధి చెప్పండంటూ జనాన్ని ఉద్దేశించి సీఎం చంద్రబాబు వెల్లడించారు. వైసిపి నేతలకు అసెంబ్లీకి వచ్చి చర్చించే దమ్ము ఉందా అని ఇలాంటి వారు రాజకీయాలకు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. వైసిపి వారు అసెంబ్లీకి రాకుండా రప్పా..రప్పా అంటూ రంకెలు వేస్తున్నారని, ఇక్కడ ఉన్నది సిబిఎన్, పవన్‌కళ్యాణ్ అని మీ బెదిరింపులకు భయపడమని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఒంటిమిట్ట, పులివెందులలో జరిగిన ఉప ఎన్నికల్లో మీ బెండు తీశారని, హింస రాజకీయాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోరని ఆయన హెచ్చరించారు.

**ఎమ్మెల్యేలకు క్లాస్ పీకిన సీఎం చంద్రబాబు**

అనంతపురంలో బుధవారం మధ్యాహ్నం అశేష జనవాహిని మధ్య లక్షలాది మంది కార్యకర్తలు, నాయకులు సమక్షంలో సీఎం చంద్రబాబునాయుడు తన ప్రసంగంలో టీడీపీ ఎమ్మెల్యేలకు హెచ్చరికలు చేస్తూ క్లాస్ పీకారు. 47 ఏళ్లుగా నేను రాజకీయాల్లో ఉన్నా.. సీఎంగా నాలుగోసారి పని చేస్తున్నా, నా దృష్టిలో సీఎం అంటే చీఫ్‌మినిస్టర్ కాదు, కామన్ మ్యాన్ అంటూ సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. నేనే కామన్ మ్యాన్..మా ఎమ్మెల్యేలు కూడా కామన్ మ్యాన్‌గా ఉండాలి దర్జాలు పనికి రావు, ఆర్బాటాలు పనికిరావు, ఇష్టాను సారంగా వ్యవహరిస్తే కుదరదు అంటూ సీఎం చంద్రబాబునాయుడు ఓ రకంగా ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చినట్లు అయింది. కూటమి ప్రభుత్వంలో నేను, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, బిజెపి అధ్యక్షులు మాధవ్ ఓ కమిట్‌మెంట్‌తో ముందుకెళ్తున్నాం, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నేతలు ఇలా అందరితోనూ మేము ముగ్గురు మాట్లాడుతున్నాం. ఎన్నికల కంటే మనపరపతి పెరిగిందని, ఇది శాశ్వితంగా ఉండాలని కోరుకుంటున్నట్లు సీఎం చంద్రబాబు అభిప్రాయ పడ్డారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎంఎ పవన్‌కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, ఇతర కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# అపజయాలే విజయాలా?

>> కార్యక్రమం చేశామన్నారు. వైసిపి కార్యక్రమాన్ని అడ్డుకుంటూ.. పోలీసులు అణగదొక్కే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. వైసిపి నేతలకు ఎక్కడికక్కడే నోటీసులు ఇచ్చారని తెలిపారు. రైతులకు మద్దతు ఇవ్వడం తప్పా చంద్రబాబూ ? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా ? అని అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస బాధ్యతలు నిర్వహించడం లేదు అని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు అన్యాయం చేస్తున్నారని వైఎస్.జగన్ ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో ఇలా ఉండేదా ? మా పాలనలో రైతులు రోడ్డెక్కడం చూశారా ? అని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబుకు ఉన్న నైపుణ్యం. కళ్లార్పకుండా పచ్చి అబద్ధాలు చెప్పడమన్నారు.అది ఆయనకు మాత్రమే తెలుసు. ఒకవైపు పథకాల అమలు లేదు. మరోవైపు మోసం. అయినా సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ అంటూ వేడుక. ఇది అట్టర్‌ఫ్లాప్ అయిన సినిమాకు బలవంతంగా విజయోత్సవం చేసినట్లు ఉంది. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇచ్చావా?. ఆడబిడ్డ నిధి కింద రెండేళ్లకు రూ.36 వేలు బాకీ. ఈరోజు అనంతపురంలో సూపర్‌హిట్ పేరుతో సభ పెట్టావు. నిరుద్యోగ యువతకు ఉద్యోగం లేదా నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.36 వేలు. రెండేళ్లకు రూ.72 వేలు బాకీ.అవి ఇవ్వనప్పుడు మోసం కాదా? అది నీ సూపర్‌సిక్స్ హామీ కాదా? 50 ఏళ్లకే పెన్షన్ నెలకు రూ.4 వేలు. ఏడాదికి రూ.48 వేలు. రెండేళ్లకు రూ.96 వేలు బాకీ. ఇది మోసం కాదా? పెన్షన్ల సంఖ్య గత ఏడాది మార్చి నాటికి 66,34,742 ఉంటే, ఈనెలలో మీరు ఇచ్చిన పెన్షన్లు 61,92,864. అంటే దాదాపు 5 లక్షలు కోత. ఇది మోసం కాదా? రాష్ట్రంలో మహిళలు ఎక్కడికి పోవాలన్నా మహిళలకు ఫ్రీ అన్నావు. కానీ పరిమిత బస్సుల్లోనే అనుమతి. ఇది మోసం కాదా? ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీ అన్నావు. కానీ గత ఏడాది ఒక్కటే ఇచ్చావు. ఈ ఏడాది ఒక్కటి కూడా లేదు. అంటే 6 సిలిండర్లకు గానూ, కేవలం ఒక్కటే ఇవ్వడం మోసం కాదా? పీఎం కిసాన్ కాకుండా రూ.20 వేలు అన్నదాత సుఖీభవ కింద ఇస్తానన్నావు. అలా రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.5 వేలు మాత్రమే ఇవ్వడం మోసం కాదా? తల్లికి వందనం కింద రెండేళ్లకు రూ.30 వేలు ఇవ్వాల్సి ఉండగా, 30 లక్షల మందికి ఎగ్గొట్టి కేవలం రూ.13 వేలు మాత్రమే, ఇంకా చాలా మందికి రూ.8 వేలు మాత్రమే ఇవ్వడం మోసం కాదా? గత ప్రభుత్వంలో అమలైన పథకాలు రద్దు చేయడం మోసం కాదా? చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, తోడు, చేదోడు, ఉచిత పంటల బీమా, విద్యాదీవెన, వసతిదీవెన, పిల్లలకు ట్యాబ్‌లు రద్దు చేశావు. ఇది మోసం కాదా? చంద్రబాబు చెప్పిన అబద్ధాలు, ఆయన చేసిన మోసంతో ప్రజల జీవితాలు తగలబడుతుంటే.. ఆయన సూపర్‌హిట్ పేరుతో బలవంతపు వేడుకలు. ఇది దారుణం,ఒక్కటే అడుగుతున్నాను. 15 నెలల్లో దాదాపు రూ.2 లక్షల కోట్ల అప్పు చేశారు. ఎవరి జేబులోకి పోతోంది ఆ మొత్తం. ఇది రాష్ట్ర చరిత్రలోనే లేదు. రాష్ట్రం విభజించిన రోజు, మొత్తం అప్పులు కలిపి రూ.140,717 కోట్లు ఉంటే ఆయన దిగిపోయేనాటికి రూ,3,90,247. అంటే 22.63 శాతం సీఏజీఆర్. అది మా హయాంలో అది 13.57 శాతం మాత్రమే. ఇక మా ప్రభుత్వ హయాంలో అప్పు రూ.3,90,247 కోట్ల నుంచి రూ.7,21,918 కోట్లకు పెరిగింది. అంటే మా ప్రభుత్వం 5 ఏళ్లలో చేసిన మొత్తం అప్పు రూ.3,32,671 కోట్లు కాగా, చంద్రబాబు కేవలం 15 నెలల్లో చేసిన అప్పు ఏకంగా రూ.1,91,361 కోట్లు. మేము 5 ఏళ్లలో చేసిన అప్పులో57.5% ఈ15 నెలల్లోనే చేశారు.

# రాష్ట్రాభివృద్ధికే 'సూపర్ సిక్స్'

>> ఉంచుకుని సూపర్ సిక్స్ హామీలతో గత ఎన్నికల్లో ఘన విజయం సాధించాం. ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతీ వ్యక్తికీ 25 లక్షల ఆరోగ్య భీమా అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని దీనిని ప్రతిపక్షాలు ప్రజలకు తప్పుగా చూపుతోందని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించామని,అలాగే1005 కోట్లతో పీఎం జన్ మన్ పథకం ద్వారా 625 గిరిజన గ్రామాలను అనుసంధానించి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు.ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో డోలీ మోతలు ఉండవని హామీ ఇస్తున్నాం అని ప్రకటించారు.రాష్ట్రంలో పచ్చదనం పెంచేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.ప్రజా ప్రయోజనాల కోసం ఐక్యంగా కూటమి పార్టీలు కలిసి కొనసాగుతాయని పునరుద్ఘాటించారు. యువత అత్యుత్సాహం......పవన్ కళ్యాణ్ ప్రసంగం ప్రారంభించడానికి సన్నద్ధం అవుతుండగా జనసేన పార్టీకి చెందిన యువకులు అత్యుత్సాహం ప్రదర్శించి సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బారికేట్ స్తంభాలపై ఎక్కి జెండా ప్రదర్శిస్తుండడం గమనించి సున్నితంగా మందలించారు. సభకు హాజరైన ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

# రాధాకృష్ణన్ రేపు పదవీ ప్రమాణం

>> సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డిని బరిలో దింపారు. సెప్టెంబర్ 9వ తేదీన జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 148 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. ఇక బీఆర్ఎస్, బీజేడీ, ఎస్ఎల్‌డీలు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి.

## వారం - వర్జ్యం

**11-09-2025, గురువారం**

**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, భాద్రపద మాసం, దక్షిణాయణం వర్ష ఋతువు, కృష్ణపక్షం**

చవితి మ.12.46

అశ్వని మ.1.58

వర్జ్యం : రా.10.47-12.15

దు.ఉ.10.02-10.51, 2)మ.2.57-మ.3.46

శుభసమయం: ఉ.7.30-8.15-సా.6.30-7.30

రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** జాయింట్ ఖాతాలు, ఆర్థిక వినియోగ విషయాలలో శ్రద్ధ వహించండి.

**వృషభం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

**మిథునం:**దూర ప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. సోదరుల కలయిక.

**కర్కాటకం :** సంతానపరంగా బాధ్యతగా వ్యవహరిస్తారు. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి.

**సింహం:**పట్టుదలతో ముందుకు సాగి వ్యవహారాలు చక్కదిద్దుతారు. వాహనయోగం.

**కన్య :** ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి.

**తుల :** కీలక నిర్ణయాలలో జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు. ధనలాభం.

**వృశ్చికం:** మీ గురించి చెడుగా ప్రచారం చేసే వ్యక్తులకు దూరంగా వుండండి. దుష్టులకు దూరంగా ఉండటమే మంచిది.

**ధనుస్సు:** ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దానధర్మలు చేస్తారు. కాంట్రాక్టులు దక్కుతాయి.

**మకరం:** శుభకార్యాలను విజయవంతంగా పూర్తిచేస్తారు. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభం:**ముఖ్యమైన బరువు బాధ్యతలను దించుకోగలుగుతారు. ప్రయాణాలు.

**మీనం :** ముందస్తు జాగ్రత్తలు తీసుకొన్నిప్పటికి సహచర వర్గముతో చికాకులు తప్పవు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సూపర్ హిట్



బుధవారం అనంతపురం సభా వేదికపై సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, బిజెపి రాష్ట్ర చీఫ్ మాధవ్

>> ప్రసంగిస్తూ.. ఎన్నికల ముందు ఎంత ఉత్సాహంగా కసిగా ఉన్నారో.. నేడు సభలో కూడా తెలుగు తమ్ముళ్లు, జన సైనికులు ఉత్సాహం కనిపిస్తోందన్నారు. ఈ సభ రాజకీయాల కోసం కాదు, ఓట్ల కోసం కాదు ఇప్పుడే ఎన్నికలు కూడా లేవు. బాధ్యతలు గల ప్రభుత్వంగా కూటమి ఇచ్చిన మాట నెరవేర్చిందని చెప్పడాకే ఇక్కడికి వచ్చామన్నారు. గత ప్రభుత్వం ప్రజా వేదిక కూల్చి వేతతో పాలన మొదలు పెట్టి రాష్ట్రాన్ని అఘాదాల్లోకి నెట్టిందని, 10 లక్షల కోట్ల అప్పులు, తప్పులు, పాపాలు, ఆక్రమణలు, వేదింపులతో అంతటా అశాంతి, అభద్రత కల్పించారని ఆయన విమర్శించారు. 93 కేంద్ర ప్రయోజిత పథకాలను నిలిపివేశారని కూడా గత వైసిపి ప్రభుత్వంపై చంద్రబాబు విమర్శ చేశారు. 15 నెలలుగా అనేక సవాళ్లను అధిగమించి ఒక్కొ అడుగు వేస్తూ రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నామని, నిర్వీర్యమైన వ్యవస్థను సరిదిద్ది మాట ఇచ్చినట్లు అన్ని పథకాలు అమలు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. మేము ప్రకటించిన పథకాలపై నాడు హేళన చేశారని అన్ని అమలు చేశామన్నారు. పింఛన్ల పెంపు, మెగా డిఎస్సీ, తల్లికి వందనం, ఫ్రీ బస్సు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం–2 పథకాలను అమలు చేశామని ఆయన వివరించారు. ఫ్రీ బస్సు పథకం ద్వారా మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించే వెసులుబాటు కల్పించామన్నారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రంతో కలిసి ఏడాదికి మూడు విడతల్లో 20వేలు ఇస్తామన్నాం, తొలి విడతగా ఇప్పటికే ఏడు వేలు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్‌టి సంస్కరణల ద్వారా పన్నులు తగ్గి, నిత్యావసర వస్తువులు తగ్గనున్నాయని తద్వారా పేదల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం యూనివర్సల్ హెల్త్ స్కీంను తీసుకొచ్చిందని, పేదల వైద్య ఖర్చులు తగ్గుతాయన్నారు. అర్చకులు, ఇమామ్, మౌజంలు, పాస్టర్ల గౌరవ వేతనం పెంచాం, ఎస్సీల చిరకాల ఆకాంక్ష అయిన వర్గీకరణ ఎవరికీ నష్టం లేకుండా పూర్తి చేశామని చంద్రబాబు వెల్లడించారు.

**నాది మిత్రుడు పవన్ కళ్యాణ్ ఆలోచన ఒక్కటే**

ప్రజలకు న్యాయం చేయాలి, రాష్ట్ర పున:నిర్మాణం జరగాలన్నదే మా ఆలోచన అని మాకు ఈ ద్యాస దప్పా వేరే ద్యాసే లేదని ప్రజల భవిష్యత్తే మాకు ముఖ్యమని, నాది మిత్రుడు పవన్ కళ్యాణ్ ఆలోచన ఇదేనని, రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రానికి మంచి చేయాలని, మా సంకల్పానికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని, ప్రధాని నరేంద్ర మోదీ అన్ని విధాలుగా అండగా ఉంటున్నారని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మ ఊడు పార్టీల కార్యకర్తలు, నేతలకు ఒకే మాట చెబుతున్నా, మీ రంతా కాలర్ ఎగరేసుకుని తిరిగేలా పాలన అందిస్తున్నాం, హామీలు నెరవేరుస్తున్నాం అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. మనం పెత్తందార్లం కాదు, ప్రజల భవిష్యత్తుకోసం పని చేసే వారమని, అహంకారం, అవినీతి, అలసత్వం, అసంతృప్తి అనేది మన దరికి రానివ్వద్దని, ఏ పొరపాటు చేయవద్దని సీఎం చంద్రబాబు కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. దేవుడు ఇచ్చిన శక్తి మేరకు పేదరికం లేని సమాజం కోసం శ్రమిస్తానని ఆయన వివరించారు. రాయలసీమలో ఫ్యాక్షన్ ఇజాన్ని అంతం చేసి సాగు నీరు తెచ్చిన ఘనత మనదేనని సీఎం వెల్లడించారు.

సీమ ప్రజల జీవితాలను మార్చేందుకు సాగునీటి ప్రాజెక్టులను ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. డ్రిప్ ఇరిగేషన్, సాగునీటి ప్రాజెక్టులతో ఎంతో అభివృద్ధి చేశామని, సీమ కరువును శాశ్వితంగా దూరం చేస్తామని రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వే లైన్లు, పరిశ్రమలు, హార్టికల్చర్ సాగుతో రతనాల సీమ అవుతుందని, ఎరువు అడ్డు వచ్చినా సీమ అభివృద్ధి ఆగదని ఇది నా భరోసా అంటూ సీఎం చంద్రబాబునాయుడు ఆవేశంగా మాట్లాడారు. సభ ప్రారంభంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, సూపర్‌సిక్స్ పథకాల జెండాలతో వేదికపై తిరగాడుతూ అభివాదం చేశారు. ఈ సభలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లా మంత్రి పయ్యావుల కేశవ్ సభకు అధ్యక్షత వహించారు.

# నేపాల్ నుంచి తెలుగువారు వెనక్కి

>> అవుతున్నారు. ఆయనతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సమీక్ష నిర్వహిస్తున్నారు.నేపాల్ లో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో ఆ దేశంలో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడంపై ఆర్టీజీఎస్ కేంద్రంలో ఏపీ భవన్, వివిధ శాఖల ఉన్నతాధికారులతో విద్య, ఐటీ, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ సమీక్ష కొనసాగిస్తున్నారు. నేపాల్ లో ఇప్పటివరకు 215 మంది తెలుగువారు చిక్కుకున్నట్లు సమాచారం ఉందని ఈ సందర్భంగా అధికారులు లోకేష్‌కు వివరించారు. వీరంతా నేపాల్ లోని వివిధ ప్రదేశాల్లో సురక్షితంగా ఉన్నారని, వీరితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. నేపాల్ లోని బఫాల్, సిమిల్ కోట్, పశుపతి నగరం, పింగలస్థాన్ లో వీరంతా ఉన్నారని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని వివిధ మార్గాల ద్వారా సంప్రదించి.. కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలి. వారికి ఆహారం, భద్రతకు సంబంధించి ప్రతి రెండు గంటలకు ఒకసారి మానిటరింగ్ చేయాలి. నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారు రాష్ట్రంలోని ఏయే ప్రాంతాలకు చెందిన వారు, వారి సమగ్ర వివరాలతో కూడిన సమాచారాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రత్యేక కాల్ సెంటర్, వాట్సాప్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని, కలెక్టర్ల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ప్రత్యేక కాల్ సెంటర్, వాట్సప్ నంబర్ ఏర్పాటు చేయించి పరిస్థితిని క్షణ,క్షణంసమీక్షిస్తున్నారు.నేపాల్‌లో చిక్కుకున్న వారి వివరాలు సేకరించి కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి తీసుకునే దిశలో చర్యలు చేపట్టారు, ఇప్పటివరకు వచ్చినా అధికారిక సమాచారం ప్రకారం నేపాల్‌లో 187 మంది తెలుగువారు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. వీరంతా నేపాల్ లోని నాలుగు ప్రాంతాల్లో ఉన్నట్లుగా సమాచారం మంత్రి



నేపాల్‌లోని తెలుగువారిని ఎపికి రప్పించేందుకు బుధవారం సచివాలయంలో అధికారులతో చర్చిస్తున్న లోకేష్

లోకేష్‌కు అందించారు.బఫాల్‌లో 27 మంది చిక్కుకున్నారు. వీరు శ్రీధరాచార్యుల పర్యవేక్షణలో ఉన్నారని సమాచారం. అదే విధంగా సిమిల్ కోట్‌లో కారి అప్పారావు వద్ద 12 మంది, పశుపతి నగరంలోని మహదేవ్ హోటల్ వద్ద విజయ పర్యవేక్షణలో 55 మంది ఉన్నారు. అలాగే గౌశాలలోని పింగలస్థాన్‌లో 90 మంది తెలుగువారు చిక్కుకున్నట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. నేపాల్‌లోని ఉన్న భారత రాయబారి నవీన్ శ్రీ వాస్తవకు ఇప్పటికే పరిస్థితిని వివరించారు. ఇప్పటికే వారిని ఏపీ ప్రభుత్వం అప్రమత్తం చేయడం జరిగింది. రాష్ట్ర ప్రజల భద్రతే ప్రాధాన్యంగా మంత్రి నారా లోకేశ్ కేంద్ర ఏజెన్సీలు, భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సమన్వయం చేస్తున్నారు,చిక్కుకున్న వారి కుటుంబాలు అప్ డేట్ సమాచారం పొందడానికి, విళిగి సమన్వయ మద్దతుతో పాటు, ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను మంత్రి ప్రకటించారు. చిక్కుకుపోయిన వ్యక్తుల బంధువులు ఢిల్లీలోని ఏపీ భవన్‌ను 9818395787 నంబర్‌లో కూడా సంప్రదించవచ్చు. నేపాల్ నుండి ప్రతి తెలుగు వ్యక్తిని తిరిగి తీసుకురావడం మా బాధ్యతని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.వస్తువులు పోగొట్టుకుంటే, తాత్కాలిక పాస్‌పోర్ట్‌లను మేము సులభతరం చేస్తాము. ప్రతి వ్యక్తిని వారి సొంత జిల్లాలో సురక్షితంగా దింపాలని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఆదేశించారని వివరించారు.ఈ సాయంత్రం నాటికి ఖాట్మండు విమానాశ్రయం తిరిగి ప్రారంభమవుతుందని, ఆ తర్వాత విజయవాడ విశాఖపట్నంకు తరలింపు విమానాలను ఏర్పాటు చేస్తామని అధికారులు వివరించారు. నేపాల్ లో చిక్కుకున్న విశాఖకు చెందిన సూర్యప్రభతో వీడియో కాల్ మాట్లాడిన మంత్రి లోకేష్.. సమీక్ష సందర్భంగా నేపాల్ లో చిక్కుకున్న పలువురు తెలుగువారితో మంత్రి నారా లోకేష్ ఫోన్, వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా విశాఖకు చెందిన సూర్యప్రభతో మాట్లాడిన మంత్రి లోకేష్.. నేపాల్ లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఉన్నారు, ఎలా ఉన్నారని, అక్కడ అందబాటులో ఉన్న సౌకర్యాలపై మంత్రి వాకబు చేశారు. తాము ముక్తినాథ్ దర్శనానికి వెళ్లి నేపాల్ లో చిక్కుకుపోయామని, ప్రస్తుతం ఓ హోటల్ లో సురక్షితంగా ఉన్నామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మీరు ఎక్కడైతే ఉన్నారో అక్కడే ఉండాలని, బయటకు రావొద్దని, ప్రతి రెండు గంటలకు అధికారులు మీతో సంప్రదిస్తారని భరోసా ఇచ్చారు. కేంద్రంతో మాట్లాడి ప్రత్యేక విమానాల ద్వారా రాష్ట్రానికి సురక్షితంగా తీసుకువస్తామని వారిలో ధైర్యం నింపారు. ఏపీ భవన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు నేపాల్ పర్యటనకు వెళ్లి ప్రస్తుతం అక్కడ నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల కారణంగా చిక్కుకుపోయిన తెలుగు ప్రజలకు తక్షణ సాయం అందించడానికి ఏపీ ప్రభుత్వం దిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. నేపాల్ లో ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న తెలుగు వారు +91 98183 95787 నంబర్‌లో నోడల్ అధికారి సురేష్‌ను సంప్రదించవచ్చునని ఓ ప్రకటనలో పేర్కొంది.

సీఎం చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అక్కడి తాజా పరిస్థితులపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రితో నిరంతరం సంప్రదిస్తున్నట్లు తెలియజేసింది. అక్కడ తెలుగువారు చిక్కుకుపోయినట్లు తెలిసిన వెంటనే రెసిడెంట్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ నేపాల్‌లోని భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవతో మాట్లాడారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారి సహాయార్థం మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మానిటరింగ్ కోసం విజయవాడ కంట్రోల్ రూమ్ కు మంత్రి దుర్గేష్ రానున్నారు. ప్రారంభించింది నేపాల్ లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తెలుగువారికి అండగా నిలవాలని మంత్రి దుర్గేష్ కు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించారు.ప్యూటీ సీఎం ఆదేశాల నేపథ్యంలో అనంతపురం పర్యటనను రద్దు చేసుకొని విజయవాడకు తిరుగుప్రయాణమైన మంత్రి దుర్గేష్.. నేపాల్ లో ఇరుక్కుపోయిన తెలుగు విద్యార్థులను ఏపీకి రప్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. నేపాల్‌నుంచి తెలుగువారిని ఏపీ రప్పించేందుకు మంత్రి లోకేష్ నిర్వహించిన దౌత్యం ఫలిచింది.12 ప్రదేశాల్లో చిక్కుకున్న 217మందిని సురక్షితంగా రాష్ట్రానికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. తొలివిడతగా నేపాల్ లోని హెటౌడా నుంచి 22మంది తెలుగుపౌరులను సురక్షితంగా బీహార్ బార్డర్ కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. మిలటరీ సాయంతో హెటౌడా నుంచి 58 కి.మీ దూరంలో ఉన్న బీహార్ బోర్డర్ మోతిహారికి తెలుగుపౌరులు బయలుదేరారు. బీహార్ లోని మోతిహరి నుంచి తెలుగుపౌరులను రాష్ట్రానికి తరలించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. నేపాల్ లో చిక్కుకున్న 217మందిలో 118మంది మహిళలు కాగా, 99మంది పురుషులు ఉన్నారు. విశాఖపట్నం వాసులు 42మంది, విజయనగరం 34మంది, కర్నూలుకు చెందిన వారు 22మంది కాగా, మిగిలిన వారు ఇతర జిల్లాలకు చెందిన వారు. తమను క్షేమంగా తరలిస్తున్న మంత్రి లోకేష్ కు తెలుగు ప్రజలు తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న 217మంది పౌరుల్లో 173మంది ఖాట్మాండూ పరిసరాల్లోని హోటళ్లలో తలదాచుకున్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత, పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ లోకేష్‌తో పాటు నేపాల్‌లో చిక్కుబడిన తెలుగువారికి ధైర్యం చెప్పి భరోసాను ఇచ్చారు.

# తాత్కాలిక ప్రభుత్వం

>> రోజున నిరసనకారులతో చర్చలు నిర్వహించారు. తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరిగాయి. ఆన్‌లైన్ వర్చువల్ మీటింగ్‌లో సుమారు నాలుగువేల మంది పాల్గొన్నారు. ఆ సమయంలో కర్కి పేరు ప్రస్తావనకు వచ్చింది. ఆర్మీతో పాటు తాత్కాలిక ప్రభుత్వాధికారులతో సుశీలా చర్చల్లో పాల్గొనాలని జెన్ జెడ్ అభిప్రాయపడింది. ఇదిలా ఉంటే నేపాల్ లో రాజకీయ సంక్షోభంలో అక్కడ ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రభుత్వ అవినీతి, అడ్డగోలు నిర్ణయాలపై యువత కదం తొక్కింది. సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించారన్న ఆగ్రహంతో జన్‌జడ్ నిరసనకారులు విధ్వంసం సృష్టించారు. శాంతియుతంగా ప్రారంభమైన నిరసనలు హింసాత్మక రూపం దాల్చాయి. ప్రజాగ్రహానికి జడిసి నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీతోపాటు వివిధ శాఖల మంత్రులు కూడా వైదొలిగారు. దేశవ్యాప్తంగా అల్లర్లను కట్టడిచేసేందుకు సైన్యం రంగంలోకి దిగింది. దేశ వ్యాప్తంగా కర్ఫ్యూ విధించింది. ఎవరైనా విధ్వంసానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. దేశంలో తలెత్తిన సంక్షోభాన్ని పరిష్కరించి శాంతిని నెలకొల్పేందుకు చర్చలకు రావాలని నిరసనకారులకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో జన్ జడ్ యువత పలు డిమాండ్ల ను సైన్యం ముందుకు తీసుకొచ్చింది. ప్రస్తుత రాజ్యాంగాన్ని తిరిగి రాయాలని డిమాండ్ చేసింది. అంతేకాదు, మూడు దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు సాగించిన అవినీతిపై దర్యాప్తు జరపాలని కోరింది. తాము చేపట్టిన ఈ ఉద్యమం ఏ ఒక్క పార్టీ, వ్యక్తి కోసం కాదని స్పష్టం చేసింది. ఒక జనరేషన్, దేశ భవిష్యత్తు కోసం అని తెలిపింది. దేశంలో నిరుద్యోగం, వలసలు అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరింది. కొత్త రాజకీయ వ్యవస్థ ఆధారంగానే దేశంలో శాంతి నెలకొంటుందని పేర్కొంది. అంతేకాదు, ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అమరులుగా ప్రకటించాలని డిమాండ్ చేసింది. నేపాల్ సైన్యం తమ ప్రతిపాదనలను సానుకూలంగా అమలు చేస్తుందని భావిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు తమ డిమాండ్లను ఓ ప్రకటన రూపంలో విడుదల చేసింది.

# శాస్త్రవిజ్ఞానంతో వికసిత్ భారత్

>> గుర్తింపును పొందిన మద్దిరాల నాగరాజుకు బహూకరించటం సముచితమన్నారు. వికసిత్ భారత్‌కు వెన్నెముక అయిన ఆర్థికరంగంలో నాగరాజు, పరిపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లారని చెప్పారు. త్రిపుర రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రి /ఫైనాన్స్ మంత్రిగా ఉన్నపుడు ఆ రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శిగా ఉన్న నాగరాజుతో బడ్జెట్ రూపకల్పనలో అనుభవాన్ని ఈ సందర్భంగా గవర్నర్ గుర్తుచేసుకున్నారు. అవార్డు గ్రహీత కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆర్థిక సేవల విభాగం సెక్రటరీ నాగరాజు మద్దిరాల మాట్లాడుతూ భారతదేశం ఆధునికతను సంతరించుకుంటున్న రోజుల్లో డాక్టర్ నాయుడమ్మ తన పరిశోధనలు, ఆవిష్కరణల ప్రయోజనాలను పరిశ్రమలకే కాకుండా సమాజానికి ఉపయోగపడేలా చేశారని చెప్పారు. సైన్స్ ను గ్రామాలు, రైతులు, సామాన్యుల వద్దకు తీసుకెళ్లటం ఆయన విశిష్టతగా అన్నారు. ఇటీవలి కాలంలో మన గ్రామీణ భారతదేశం గొప్ప ప్రతిభను చాటిందన్నారు. రైతులకు వ్యవసాయ రుణాలు రూ.23 లక్షల కోట్లకు పైగా, 7 కోట్ల కిసాన్ క్రెడిట్ కార్డులతో రూ.10 లక్షల కోట్ల రుణం అందినట్టు తెలిపారు. 84 లక్షలకు పైగా ఎస్‌హెచ్ గ్రూపులకు రూ.3 లక్షల కోట్ల రుణాలు అందటం గ్రామీణ పారిశ్రామికతకు నిదర్శనంగా చెప్పారు. దేశంలోని ఎంఎస్ఎంఈలు 11 కోట్లమందికి పైగా ఉపాధిని కల్పిస్తూ వికసిత్ భారత్‌కు ఇంజిన్లుగా ఉన్నాయన్నారు. అలాగే డిజిటల్ మౌలిక వసతులు వికసిత్ భారత్‌కు పునాదిగా నాగరాజు చెప్పారు. యూపీఐ ప్రతి నెలా బిలియన్లకొద్దీ లావాదేవీలను చేస్తోందని గుర్తుచేశారు. ఈ డిజిటల్ నిర్మాణం కేవలం జాతీయ విజయం మాత్రమే కాదనీ, ప్రపంచానికి ఒక నమూనాగా వివరించారు. వీటన్నిటికీ భారతీయ వాణిజ్యబ్యాంకులు వికాసంగా ఉన్నాయని చెప్పారు. జాతీయ చర్మ పరిశోధనా సంస్థ ముఖ్య కార్యదర్శి డాక్టర్ స్వర్ణ వి.కాంత్ మాట్లాడుతూ డాక్టర్ నాయుడమ్మను నేషన్ బిల్డర్‌గా అభివర్ణించారు. దేశంలోని 37 జాతీయ పరిశోధనశాలలకు అధిపతిగా చేసిన నాయుడమ్మ తమందరికీ ఎంతో స్ఫూర్తిగా చెప్పారు. విదేశాలు టారిఫ్‌లు పెంచిన నేపథ్యంలో ఎగుమతులు ప్రధానమైన తోలు పరిశ్రమలో 2030 నాటికి 50 బిలియన్ డాలర్ల వృద్ధి నిజంగా మాకు సవాలుగా చెబుతూ నాయుడమ్మ చూపిన బాటలో అధిగమనిస్తామని ధీమావ్యక్తంచేశారు. సభలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డాక్టర్ యలవర్తి నాయుడమ్మ , కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆర్థిక సేవల విభాగం సెక్రటరీ నాగరాజు మద్దిరాల బయోగ్రఫీ పై రూపొందించిన వీడియో లఘు చిత్రాన్ని ప్రదర్శించారు.

MN 3_11-09Pg3exHMNWJQEC.qxd 9/10/2025 11:32 PM Page 1



# మరింత బాధ్యతను పెంచింది

## - భక్తుల సూచనలతో టిటిడి సేవలు మెరుగుపరుస్తా - సాంకేతికత వినియోగంపై దృష్టి : టిటిడి నూతన ఇఒ ఎకె సింఘాల్

**తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఆలయ పవిత్రతను కాపాడటంతోబాటు సాధారణ భక్తులకు మరింత మెరుగ్గా సేవలందించేందుకు సాంకేతికత వినియోగంపై దృష్టి పెడతామని టిటిడి నూతన ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ తెలిపారు. దేవుని ఆశీర్వాదబలం,తన పూర్వజన్మసుకృతంతోనే రెండవసారి ఇఒగా బాధ్యతలు చేపట్టే అవకాశం కలిగిందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ అవకాశం మరింత బాధ్యతను పెంచిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. టిటిడి ఇఒగా రెండవసారి నియమితులైన సింఘాల్ బుధవారం ఉదయం శ్రీవారి ఆలయంలో బాధ్యతలు చేపట్టారు. భక్తుల నుండి అభిప్రాయసేకరణతో సేవల నాణ్యతను పెంచేందుకు నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసిన సమయంలో మెరుగైన నాణ్యమైన సేవలకు సలహాలు తీసుకోవడం జరిగిందన్నారు. గత సంవత్సరం నుండి స్వామివారి లడ్డూప్రసాదం, అన్నప్రసాదాల నాణ్యత మెరుగుపడటంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇతర రాష్ట్రాల రాజధానుల్లో కూడా శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయాలు నిర్మించే ఆలోచన చేస్తున్నామని చెప్పారు. గతంలోనూ మూడు సంవత్సరాలు నాలుగునెలలు ఇఒగా శ్రీవారికి, భక్తులకు సేవలందించే అవకాశం కలిగిందన్నారు. టిటిడి అధికారులు ఎంతో చిత్తశుద్ధితో రాత్రింబవళ్ళు కృషి చేసి స్వామివారి ఉత్సవాలను విజయవంతం చేస్తున్నారని,అశేషసంఖ్యలో భక్తులకు సంతృప్తికరంగా సేవలందిస్తున్నారని తెలిపారు. శ్రీవారి సేవకుల సేవలు మరింత విస్తరించే దిశగా ఆలోచన చేస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల సూచనలు స్వీకరించి టిటిడి సేవలు మెరుగుపరుస్తామని చెప్పారు. త్వరలో జరగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేపట్టారని, ఇప్పటికే టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పర్యవేక్షణలో ఏర్పాట్లు బావున్నాయన్నారు. నూతన ఇఒగా బుధవారం ఉదయం ఆయన ఆలయంలోపల రంగనాయకుల మండపంలో బదిలీఅయిన ఇఒ శ్యామలరావునుండి బాధ్యతలు స్వీకరించారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం సింఘాల్‌తో ప్రమాణస్వీకారం చేయించారు.అనంతరం ఆలయంలోపల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయంలో ఇఒగా,ఎక్స్‌అఫిషియోసభ్యుడిగా ఎకె సింగాల్ బాధ్యతలు

ఈకార్యక్రమంలో టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, డిప్యూటీ ఇఒలు భాస్కర్, సోమన్నారాయణ, ప్రశాంతి, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ ఉన్నారు. టిటిడి ఇఒగా రెండవసారి నియమితులైన అనిల్‌కుమార్‌సింఘాల్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో బుధవారం ఉదయం తిరుపతి అలిపిరి నుండి కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. నడకదారిలో మధ్యమధ్యలో ఆయనను గుర్తుపట్టిన పలువురు భక్తులు పలకరించి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల అనుభవాలను, సూచనలను తీసుకున్నారు. బాధ్యతలు చేపట్టడానికి ముందు నడకదారిలో ఆయన నడచిరావడం విశేషం. గతంలోనూ 1984లో మొదట తిరుమలకు కుటుంబంతో కలసి వచ్చానని, అప్పట్లో స్వామివారి దర్శనం కోసం ఏడుగంటలు ఎదురుచూసి దర్శనం చేసుకున్నానని గుర్తుచేసుకున్నారు. సామాన్యభక్తుడిగా దర్శనం చేసుకున్నపుడు సామాన్యుల బాధలు తెలిశాయని భక్తులతో ముచ్చటించారు.

# తిరుమల సమాచారం

## మంచి నిర్ణయాలతో మెరుగైన సేవలందించాలి

### - టిటిడి ఛైర్మన్ నాయుడును కలిసిన నూతన ఇఒ సింఘాల్

**తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడిలో తిరుమలకు వస్తున్న భక్తులకు మరింత మెరుగైన సేవలందించేందుకు మంచి నిర్ణయాలతో పనిచేయాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ,నూతన ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌కు సూచించారు. సంస్థ ప్రతిష్ట ఇనుమడింపజేసేలాగా పనితీరు ఉండాలని, మంచి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. భక్తుల సేవలకు పునరంకితంకావాలని ఈ సందర్భంగా నూతన ఇఒ సింఘాల్‌కు సూచించారు. ఇఒగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఎకె సింఘాల్ ఛైర్మన్ బిఆర్‌నాయుడును క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువతో ఇఒను ఛైర్మన్ సత్కరించారు. ఈ సందర్భంగా బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, నరేశ్ ఉన్నారు.



## బ్రహ్మోత్సవాలకు బ్రహ్మండంగా ఏర్పాట్లు !

**తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు బ్రహ్మండంగా ఏర్పాట్లు పూర్తికావస్తున్నాయి. స్వామివారి వాహనసేవలను విజయవంతం చేయడం, భక్తులకు సకల సౌకర్యాలు కల్పించే దిశగా పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆలయ మాఢవీధుల్లో, ఆలయుం ముందు, వాహనమండపం ప్రాంతాల్లో రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దడం, బారికేడ్లు, గ్యాలరీలు ఏర్పాటు, బ్రహ్మరథం మరమ్మతులు, గొల్లమండపం వద్ద మలయప్పస్వామి చిత్రమాలికకు రంగులు వేయడం వంటి పనులు చేస్తున్నారు. ఆలయం ముందు భక్తులకు రోజువారీగా సేవలపై సమీక్షించుకునేందుకు వీలుగా టిటిడి, విజిలెన్స్, పోలీసుశాఖల శిబిరాలు ఏర్పాటుచేస్తున్నారు. అన్ని విభాగాలను టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఉత్తేజపరిచి పర్యవేక్షిస్తున్నారు. 24వ తేదీ నుండి మొదలుకానున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో తొలిఘట్టంగా ధ్వజారోహణం జరిగే రోజు సిఎం చంద్రబాబునాయుడు తిరుమలకు వస్తుండటం, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న నేపధ్యంలో అదనపు ఆకర్షణలుగా కటౌట్లు, సెట్టింగ్‌లు సిద్దమవుతున్నాయి.

## 16న కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం

**తిరుమల,సెప్టెంబర్10ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 24నుండి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనుండటంతో 16వతేదీ మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు.మంగళవారం ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు పరమపవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయంలోపల ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగంధద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. ఆ సమయంలో స్వామివారి మూలవిరాట్టును శ్వేత వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచుతారు. ఏడాదిలో నాలుగుదఫాలుగా కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం చేపడతారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశి ,ఆణివార ఆస్థానం ముందు మంగళవారాలు ఆలయ శుద్ధి జరుగుతుంది. 16వతేదీ మంగళవారం అష్టదళపాదపద్మారాధన సేవరద్దుచేశారు. కాగా 15వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సులేఖలు స్వీకరించరు. 16న విఐపి బ్రేక్ రద్దుచేశారు.



## 14నెలల్లో సంస్కరణలతో నాణ్యమైన సేవలు

### - బదలీ అయిన ఇఒ శ్యామలరావు ఉద్వేగం

**తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడిలో పనిచేసే అవకాశం భాగ్యం కలిగిందని, 14నెలల కాలంలో సంస్కరణలతో అనేక విషయాలపై మెరుగైన సేవలందించేదిశగా చర్యలు తీసుకున్నామని బదిలీ అయిన టిటిడి ఇఒ జె.శ్యామలరావు అన్నారు. తనకు విధి నిర్వహణలో అన్ని విధాలా సహకరించించిన అధికారులు, ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తిరుమలలో లడ్డూప్రసాదాల నాణ్యతలో, అన్నప్రసాదాల రుచినాణ్యతలో సంస్కరణలు తీసుకువచ్చామని ఉద్వేగభరితంతో తెలిపారు. వచ్చే 25ఏళ్ళపాటు స్వామివారి అన్నప్రసాదం, లడ్డూల నాణ్యతలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. చేపట్టిన సంస్కరణలతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తుండటం ఒక అనుభూతిగా మిగిలిపోతుందన్నారు. బదిలీ అయిన శ్యామలరావు బుధవారం ఉదయం కుటుంబంతో కలసి ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అందరినీ ఆప్యాయంగా పలకరించారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం శ్రీవారి చిత్రపటం బహుకరించారు.



## గడువులోపు బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పూర్తి కావాలి

### - టిటిడి నూతన ఇఒ ఎకెసింఘాల్

**తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాత వార్తప్రతినిధి:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు కేవలం రెండు వారాలు మాత్రమే సమయం ఉందని, గడువులోపు అన్ని ఏర్పాట్లు పూర్తికావాలని టిటిడి నూతన ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ ఆదేశించారు.. మెరుగైన ఏర్పాట్లు, పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో ఎక్కడా రాజీ పడవద్దని సూచించారు.భక్తులకు అందించే సేవలతో బాటు విధానపరమైన నిర్ణయాలలో టిటిడి ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమష్టిగా నిర్ణయం తీసుకుని భక్తులకు వేగంగా, నాణ్యమైన సేవలందిద్దామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనల మేరకు శ్రీవారి సేవలను మరింత విస్తృతపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. శ్రీవారి ఆలయ పవిత్రతను కాపాడుకుంటూ భక్తులకు ఇంకా ఎలాంటి మెరుగైన సేవలందించాలో అందరూ కలసి పనిచేద్దామన్నారు. టిటిడి నూతన ఇఒగా అనిల్‌కుమార్‌సింఘాల్ బుధవారం ఉదయం బాధ్యలు చేపట్టిన తరువాత మధ్యాహ్నం తొలిసారిగా అన్నమయ్యభవనంలో టిటిడిలోని విభాగాధిపతులు అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, అదనపు సివిఎస్ఒ శివకుమార్‌రెడ్డి, ఎఫ్ఎసిఎఒ బాలాజీ, డిప్యూటీ ఇఒలు లోకనాథం,భాస్కర్, ప్రశాంతి, సోమన్నారాయణ, ఓఎస్‌డి సత్రానాయక్, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఆయన పరిచయ కార్యక్రమం, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఇఒ సింఘాల్ మాట్లాడుతూ కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేసే భక్తులకు మరింత సేవా దృక్పధంతో,బాధ్యతగా సేవలందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పనులు వేగవంతం చేసి పూర్తిచేయాలన్నారు. టిటిడి ఛైర్మన్ సూచించే సూచనలు సలహాలు, బోర్డు సభ్యులు, డయల్ యువర్ ఇఒ, ఐవిఆర్ఎస్, వాట్సాప్‌ద్వారా అభిప్రాయసేకరణ,సర్వేలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. అభిప్రాయసేకరణలో మార్పులు తీసుకువచ్చి మెరుగైన సేవలందిద్దామన్నారు. వీలైనంతవరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలుచేసే అంశంపై దృష్టిపెట్టాలన్నారు. టిటిడిలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడవద్దని అధికారులకు ఇఒ స్పష్టం చేశారు. టిటిడిలో గత ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, మార్పులపై అదనపు ఇఒ వెంకయ్యచౌదరి వివరించారు.



## అంతర్జాతీయ తెలుగు లఘు చిత్రోత్సవానికి 44 చిత్రాలు ఎంపిక

### - ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డా.గజల్ శ్రీనివాస్

- గుంటూరులో 20న లఘుచిత్రాల ప్రదర్శన

**విజయవాడ,సెప్టెంబరు10,ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ తెలుగు లఘు చిత్రోత్సవానికి 44 చిత్రాలు ఎంపిక అయినట్లు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ , సంచాలకులు లోహిత్ కుమార్ తెలిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ , ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో తెలుగు భాషా సంస్కృతి పరిరక్షణ, అభివృద్ధి,విశ్వవ్యాప్తికి అంకితంగా 2026 జనవరి 3 నుండి 5వ తేదీ వరకు అంతర్జాతీయ తెలుగు మహా సభలు నిర్వహిస్తుంది.ఈ క్రమంలో మహాసభల సన్నాహాల్లో భాగంగా తెలుగు భాష వైభవం పై 20 సెప్టెంబర్ 2025 న భారతీయ విద్యా భవన్, గుంటూరు ఆడిటోరియం లో లఘుచిత్ర ప్రదర్శన జరుగుతుంది.ఎంపిక చేసిన లఘుచిత్రాలను ఈ నెల 20 ఉదయం 9 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శిస్తారు.

తెలుగుతల్లి,సుమధురం,. తెలుగుబాట, విశ్వభాషలందు తెలుగు వెలుగు,తెలుగ వైభవం, తెలుగు మీడియం, తెలుగు లోగిలి, తెలుగు లెస్స, తెలుగు గడ్డ, తప్పిపోయిన తాళం చెవి , పెద్ద బాలశిక్ష , సంపద , మాతృభాషని మరవద్దు, మన తెలుగు భాష,. మళ్ళీ తల్లి ఒళ్ళోకి , మహా ప్రస్థానం, ఆ చంద్ర తారర్కం, వాడుక భాషకు గొడుగు గిడుగు, తెలుగు వెలుగు, ఉనికి, వికటకవి, చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా. మా తెలుగు తల్లికి మల్లెపూదండ, కాసేపు తెలుగులో మాట్లాడుకుందాం, తెలుగు మాట, తెలుగు లెస్స, వెలుగు జిలుగుల తెలుగు, తెలుగు భాష వైభవం, తాతగారి తెలుగు, శ్వాస, ఊట బావి, మ్యూజియంలో తెలుగు తల్లి, మన మాతృభాష,. మళ్ళీపుట్టాలి,. శుభోదయం, మధులిక ,కృతం, .అమ్మ భాష, మహాశయులు మళ్ళీ పుట్టండి, పాడ్ కాస్ట్, అడుగు జాడలు, కనుమరుగు, తెలుగు వారం, తెలుగు మరిమళం, చిత్రాలు ప్రదర్శనకు ఎంపిక అయ్యాయి.

## రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థకు ఐదుగురు డైరెక్టర్ల నియామకం

**విజయవాడ,సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థకు ప్రభుత్వం ఐదుగురు డైరెక్టర్లను నియమించింది. ఈ సంస్థ ఛైర్మన్‌గా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన దేగల ప్రభాకర్‌ను ఇంతకు ముందే నియమించారు. తాజాగా కోనసీమ జిల్లా గన్నవరం నియోజకవర్గానికి చెందిన బాలభారతి మట్టపర్తి, విజయవాడ సెంట్రల్‌కు చెందిన జలకం రాజారావు, ఆత్మకూరు నుంచి కటారి రమణయ్య, కర్నూలుకు చెందిన మనోజ్‌కుమార్ భీమిశెట్టి, మైదుకూరు నియోజకవర్గానికి చెందిన పండిటి మల్హోత్రాలను డైరెక్టర్లను నియమిస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

## సూపర్ సిక్స్ - సూపర్ ఫ్లాప్

### -పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి

**విజయవాడ,సెప్టెంబరు10,ప్రభాతవార్తప్రతినిధి:** సూపర్ సిక్స్ - సూపర్ ఫ్లాప్ అని ఏపీసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని కూటమి ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని ఆమె అన్నారు. హామీలు అమలు చేశామని అప్పుడే సక్సెస్ సభలు జరపడం హాస్యాస్పదమన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటైనా పూర్తిగా అమలు చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 50 లక్షల మంది నిరుద్యోగ బిడ్డలు ఉంటే ఒక్కరికైనా 3 వేల నిరుద్యోగ భృతి ఇచ్చారా? అని ప్రశ్నించారు. 20 లక్షల ఉద్యోగాలు ఎక్కడ.. స్థాపించని పరిశ్రమలతో అగ్రిమెంట్లు చేసుకున్నంత మాత్రానా ఉద్యోగాలు ఇచ్చినట్లా ? అని అన్నారు. ఒక్కరికి భృతి ఇవ్వకుండా, ఒక్క ఉద్యోగం రాకుండా సూపర్ సిక్స్ సూపర్ హిట్ ఎలా అయ్యిందని ధ్వజమెత్తారు.

18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు 15 వందలు ఆర్థిక సహాయం అనేది సూపర్ సిక్స్ హామీ అని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లో ఒక్క మహిళకైనా 15 వందలు ఇచ్చారా అని ఆగ్రహించారు.

# చెరువులు.. పల్లె ప్రగతికి ఆధారాలు

## - ట్రిపుల్ ఆర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ లక్ష్మీశ



**విజయవాడ,సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** చెరువులు పల్లెల ప్రగతికి ఆధారాలని.. నీటి నిల్వ సామర్థం పెంపు, భూగర్భ జలాల వృద్ధి, పర్యావరణ ప్రయోజనాలు, వ్యవసాయ ఉత్పాదకత అన్నదాతల ఆదాయాల పెంపు వంటి బహుళ ప్రయోజనాలకు చెరువులు చిరునామా అని, ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నీటి వనరుల మరమ్మతులు, నవీకరణ, పునరుద్ధరణ (ఆర్‌ఆర్‌ఆర్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ముఖ్యమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన నీటి వనరుల మరమ్మతులు, నవీకరణ, పునరుద్ధరణ (ఆర్‌ఆర్‌ఆర్) పథకానికి సంబంధించి జిల్లాస్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగు, తాగు నీటి అవసరాలను తీర్చే చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేలా, భూగర్భ జలాల రీఛార్జ్ జరిగేలా ప్రత్యేక పనులు చేపట్టాల్సిన అవసరముందన్నారు. నీటి వనరుల సుస్థిర నిర్వహణకు సామాజిక భాగస్వామ్యంతో పాటు స్వయం సమృద్ధి వ్యవస్థల మద్దతు అవసరమన్నారు. ట్రిపుల్ ఆర్ పథకం కింద తాజాగా మైలవరం, విజయవాడ రూరల్, రెడ్డిగూడెం మండలాల పరిధిలోని ఎనిమిది చెరువుల అభివృద్ధికి సంబంధించి రూ. 14.19 కోట్లతో పనులను ప్రతిపాదించడం జరిగిందని.. తాజా సమావేశంలో నిపుణులు సూచించిన అంశాల మేరకు ట్రిపుల్ ఆర్ పథకం లక్ష్యాలు నెరవేరేలా డీపీ ఆర్‌లు ఉండే లా చూ డాల న్నారు. చెరు వు కట్టల పటిష్టీకరణ, సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటుతో పర్యాటకంగా కూడా అభి వృద్ధికి వీలుంటుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సమావేశంలో ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ ఆర్.మోహన్‌రావు, కమిటీ కన్వీనర్ పి.గంగయ్య, కేంద్ర జల సంఘం నుంచి నామినేట్ అయిన డీడీ కె.శంకర్, సైంటిఫిక్ ఆఫీసర్ టి.వెంకటగిరి,

డ్వామా పీడీ ఎ.రాము, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్.విద్యాసాగర్, గ్రౌండ్ వాటర్ డీడీ ఎం.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హస్త కళల ఉత్సవంలో కొండపల్లి మాదిరి బుట్టబొమ్మను పరిశీలిస్తున్న ఆర్.పి. సిసోడియా

## ప్రతి చేతిపని మన సంస్కృతి, సంప్రదాయాల కథను చెబుతోంది: ఆర్.పి. సిసోడియా

**విజయవాడ, సెప్టెంబర్ 10 ,ప్రభాతవార్త ప్రతినిధి:** లేపాక్షి హస్తకళా రూపకల్పన పోటీలు భారతీయ జీవన వారసత్వానికి ప్రతిబింబం. మన కళాకారుల అసాధారణ ప్రతిభను ప్రదర్శించడమే కాకుండా, వారికి గుర్తింపు, మార్కెట్లు, ఆర్థిక సాధికారతకు కొత్త మార్గాలను అందిస్తాయి," అని హస్తకళలు, జౌళి శాఖ (పరిశ్రమలు, వాణిజ్యం) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా అన్నారు. విజయవాడ మొగల్ రాజపురం అమ్మ కల్యాణ మండపంలో జరుగుతున్న హస్త కళల ఉత్సవాన్ని బుధ వారం సందర్శించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఈ తరహా వేదికలు భారతీయ హస్తకళల అందం, వైవిధ్యాన్ని మాత్రమే కాకుండా కళాకారులను వినియోగదారులు, రూపకర్తలు, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేస్తున్నాయని వివరించారు. "ప్రతి చేతిపని మన సంస్కృతి, సంప్రదాయం, సహనానికి ప్రతీక. ఈ కళలను రాబోయే తరాలకు కాపాడటం, ప్రోత్సహించడం మన అందరి బాధ్యత" అని సిసోడియా పేర్కొన్నారు. లేపాక్షి హస్తకళా రూపకల్పన పోటీ ప్రదర్శన ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నదన్నారు. కొండపల్లి బొమ్మలు, ఎటికొప్పాక బొమ్మలు, చెక్క చిత్తరువులు, తోలుబొమ్మలు, కలంకారి ముద్రణ వంటి ఐదు ప్రధాన కళల్లో పోటీ నిర్వహించామని, బంగారు, వెండి, కాంస్య పతకాలు, రెండు లక్షల యాభై వేల రూపాయల నగదు బహుమతులు అందిస్తున్నామన్నారు.

# మండుటెండలో అనంతపురం సూపర్ సిక్స్ విజయోత్సవ సభ గ్రాండ్ సక్సెస్

## - ఫలించిన అనంత నేతల కృషి - ఆకట్టుకున్న చంద్రబాబు ప్రసంగం - అభిమానులను నిరాశపరిచిన పవన్ కళ్యాణ్, మూడు పార్టీల బలోపేతానికి సభ ప్లస్ పాయింట్

**అనంతపురం, సెప్టెంబరు 10 (ప్రభాతవార్త బ్యూరో)** భగభగమనే మండుటెండలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి పార్టీలు(టిడిపి, జనసేన, బిజెపి) తొలిసారిగా బుధవారం అశేష జనవాహినితో ఉమ్మడిగా అనంతపురం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ గ్రాండ్ సక్సెస్ అయింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావడంతో సభ అదరహో అనిపించింది. ఒకవైపు మండుటెండలో ఇబ్బంది పడుతూ మరోవైపు తమ నేతల ప్రసంగాన్ని వినేందుకు పార్టీ కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలు ఎంతో ఇక్కట్ల గురయ్యారు. గత వారము, పది రోజుల నుంచి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు సభ విజయవంతం కోసం , జన సమీకరణ కోసం పడిన ప్రయత్నం ఫలించింది. మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని ప్రసాద్, రాంప్రసాద్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, నారాయణ తదితర రాష్ట్ర నాయకులు జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు వెళ్లి కార్యకర్తలు, నాయకులతో ఆయా ఎమ్మెల్యేలతో కలిసి సభ విజయవంతానికి సమాయత్తం చేశారు . అనంతపురం నగరంలో నేతల ఇళ్లకు మంత్రులు తేనీటి విందు స్వీకరిస్తూ అక్కడే సూపర్ సిక్స్ విజయోత్సవ సభలో విజయవంతం కోసం సమాలోచన చేస్తూ వచ్చారు.. ఆ విధంగా రాష్ట్ర మంత్రులు, జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకుల, మూడు పార్టీల కార్యకర్తలు, అభిమానుల ప్రయత్నం ఫలించింది. సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రసంగాలకు కార్యకర్తలు, నాయకుల నుంచి సభలో మంచి స్పందన లభించింది. సీఎం చంద్రబాబు నాయుడు దాదాపు సభలో గంటసేపు ప్రసంగించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన ప్రసంగం పదినిమిషాలు కూడా సాగలేదు. పవన్ కళ్యాణ్ క్లుప్తంగా మాట్లాడడం వల్ల జనసేన అభిమానులను నిరాశపరిచినట్లు అయ్యింది. ఎండ వేడిమి ఎక్కువగా ఉండడం వల్లే తమ నేత పవన్ కళ్యాణ్ తక్కువసేపు మాట్లాడారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ కంటే బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఎక్కువసేపు మాట్లాడారు అని చెప్పొచ్చు.. ఏది ఏమైనా సభ సక్సెస్ అయింది. సభ విజయవంతంతో కూటమ పార్టీల నేతలు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆశీర్వాదంతో తమ హిట్ కాంబినేషన్ కొనసాగుతుందని సీఎం చంద్రబాబు సభా వేదికగా ప్రకటించారు. అనంతపురంలోని ఇంద్రప్రస్తానగర్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్డీఏ కూటమి 15 నెలల పాలనా విజయాలపై ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ బంపర్ హిట్ అయ్యింది. అని చెప్పొచ్చు.ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఈ భారీ బహిరంగ సభకు హాజరయ్యారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సభా వేదికపైకి వస్తూనే కూటమి అగ్రనేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ లు సూపర్ సిక్స్ జెండాలతో ర్యాంప్ పైకి వెళ్లి పార్టీ శ్రేణులకు, ప్రజలకు అభివాదం చేశారు. జెండాలు ఊపుతూ ఉత్సాహ పరిచారు. ప్రతిగా ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి అమితమైన స్పందన కనిపించింది. ఈలలు వేస్తూ, జైసీబీఎన్, పవన్ కల్యాణ్ అంటూ నినాదాలతో విజయోత్సవ సభా ప్రాంగణం మార్మోగింది.



## ఉప రాష్ట్రపతిగా సిపి రాధాకృష్ణన్ అపూర్వ విజయం :రాష్ట్ర బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్

**విజయవాడ, సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్ డి ఎ అభ్యర్థి ఉపరాష్ట్రపతి గా సిపి రాధాకృష్ణన్ 452 ఓట్లు సాధించి అపూర్వమైన విజయం నమోదు చేశారని ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు.ఈ మేరకు ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. ఈ విజయం బిజెపి మరింత బలపడింది అని మాధవ్ అభిప్రాయపడ్డారు.రాహుల్ అబద్దాల కు చెంపపెట్టు గా మాధవ్ అభివర్ణించారు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కి ఎం పి లు బాసటగా నిలిచి ఉపరాష్ట్రపతి గా సిపి రాధాకృష్ణన్ కు అద్భుత విజయాన్ని అందించారు. ఇప్పటికైనా అబద్ధాలు మానుకోవాలని రాహుల్ కు మాధవ్ హితవు పలికారు తెలుగు భాషకు జీవం పోసిన మహోన్నత వ్యక్తి విశ్వనాథ సత్యనారాయణ ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి, శ్రీమద్రామాయణ కల్పవృక్షం ద్వారా జ్ఞానపీఠ అవార్డు అందుకున్న తొలి తెలుగు రచయితగా చరిత్ర సృష్టించిన,

పద్మభూషణ పురస్కార గ్రహీత, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి జయంతిని పురస్కరించుకొని, తెలుగు భాషకు వారు చేసిన ఎనలేని సేవలను స్మరించుకుంటూ, వారికి ఘన నివాళులు అర్పిస్తున్నాను.

వార్త

తమ కళ్ల మూలంగా పక్షులు వలలో చిక్కుకుంటాయి. అలాగే తమ మాటల మూలంగానే మనుషులు చిక్కుల్లో ఇరుక్కుంటారు.

-ట్రోయ్‌గార్డెన్

# ఈ చావులను ఆపలేరా?

యుద్ధానికి వెళ్తున్న వీరుడు విజయమో వీరస్వర్గమో అన్నట్లుగా కదనరంగంలో దూకుతాడు. అయితే యుద్ధంలో విజయం సాధించి తిరిగి రావడమో లేక పోరులో అమరులు కావడమో జరుగుతుంది. ఇలా యుద్ధంలో అసువులు బాసినా దానికో లక్ష్యం, అర్థం, పరమార్థం ఉంటుంది. వీటన్నింటిని మించి దేశం కోసం ప్రాణత్యాగం చేశామని మాటలకు అందని తృప్తి ఉంటుంది. మనదేశం కోసం పోరాటంలో అసువులు బాసిన మన వీరజవానులను ఇప్పటికీ మనం మననం చేసుకుంటూనే ఉంటాం. జోహార్లు అర్పిస్తూనే ఉంటాం. కానీ ఏ లక్ష్యం లేదు, అన్నెంపున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు రోడ్డు ప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది అంగవికలురుగా మారి కుటుంబానికి భారమై జీవితాంతం నరకం అనుభవిస్తున్నారు. ఒకరో ఇద్దరో కాదు, ఒకరోజో, రెండు రోజులో కాదు యేటా వేలాదిమంది అసువులు బాస్తున్నారు.నిత్యం రోడ్లు రక్తసిక్తం అవుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనిషి క్షేమంగా ఇంటికి వచ్చే గ్యారంటీ లేని అభద్రతాభావం రోజురోజుకు పెరిగిపోతున్నది. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే ఇరవైయేళ్లలో తొంభైఆరు లక్షలకుపైగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటే ఇరవైమూడు లక్షల ఇరవైఐదువేల మందికిపైగా మృత్యువాతపడినట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. క్షతగాత్రులైనవారి సంఖ్య కోట్లల్లో ఉండొచ్చు. రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా గత నాలుగేళ్లలో ఇరవైతొమ్మిదివేల ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందక మృత్యువుతో పోరాడి రోడ్లపైనే ప్రాణాలు వదిలినవారెందరో ఉన్నారు. అమెరికాలో రోడ్డు ప్రమాదాలకు గురైనప్రతి రెండువందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్‌లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రమాదాల వల్ల ఆర్థికంగా భారీ నష్టం జరుగుతున్నది. ఇక దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు ఈ ప్రమాదాల్లో అగ్రస్థానంలో ఉన్నాయని చెప్పొచ్చు. మితిమీరిన వేగంతోపాటు మద్యం మత్తులో కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విద్యార్థులను తరలిస్తున్న పద్నాలుగు మంది స్కూలు బస్సు డ్రైవర్లు మరో ఇరవైఆరు మంది ఆటోడ్రైవర్లు పూర్తిగా తాకిన మైకంలో ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. కేవలం మత్తుపదార్థాలు తీసుకొని వాహనాలు నడపడం వల్ల దేశవ్యాప్తంగా 2022లో పదివేల ప్రమాదాలు చోటుచేసుకోగా వాటిలో నాలుగువేల రెండువందల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఒక్క హైదరాబాద్ పరిధిలోనే గత యేడాది దాదాపు ఎనభైవేలకుపైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఈ యేడాది తొలి నాలుగు నెలల్లోనే పదిహేడువేల కేసులకుపైగా పోలీసులు గుర్తించారు. ఇక జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు అంతే లేకుండాపోతున్నది. కొన్ని సందర్భాల్లో కార్ల వేగం నూట ఇరవై కిలోమీటర్లకుపైగా ఉండడంతో బెలూన్‌లు తెరుచుకున్నా ఫలితం లేకుండాపోతున్నది. ఇలా నిత్యం రోడ్లు రక్తసిక్తం అవుతున్నాయి. అసలు పోలీసు రికార్డుల్లో రాని మరణాలు ఎన్ని ఉన్నాయో చెప్పలేం. చనిపోయినవారిలో అధికశాతం పద్దెనిమిది నుంచి ముప్పైయేళ్లలోపు వయసు ఉన్నవారే. సంపాదన చేస్తున్న భర్తో, కుమారుడినోకోల్పోయిన ఆ కుటుంబాల పరిస్థితి ఒక్కసారి మనసుపెట్టి పెద్దలు ఆలోచించాలి. ఒకటి, రెండు కుటుంబాలు కాదు దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు వీధినపడుతున్నాయి. వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఆ కుటుంబ సభ్యుల విషాద గాథవింటుంటే ద్రవించని హృదయం ఉండదు. ప్రకృతి బీభత్సంతో వందో, రెండువందల మందో చనిపోతే భూమి ఆకాశం దద్దరిల్లినట్లు కేకలు వేసే మన నాయకులు ఈ ప్రమాదాల్లో ఇంత పెద్దఎత్తున మరణించిన, మరణిస్తున్నవారి గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ప్రకృతి బీభత్సానికి గురవుతున్న వారిని ఆదుకోవద్దని చెప్పడం లేదు. ఆపన్న హస్తం అందివ్వొద్దని అనడం లేదు. యేటా వేలాదిమంది రోడ్డు ప్రమాదంలో అసువులు భాస్తుంటే పట్టించుకోకపోవడం మాత్రం క్షంతవ్యంకాదు. ఈ ప్రమాదాల గురించి పాలకులకు తెలియంది కాదు. ప్రముఖులు ఎవరైనా చనిపోయినప్పుడు, పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగినప్పుడు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకుంటున్నామని భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చూసుకుంటామని పెద్దపెద్ద ప్రకటనలు ఇవ్వడం, ఆ తర్వాత మరచిపోవడం సాధారణమైపోయింది. ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా, గత రెండు,మూడు దశాబ్దాలుగా లక్షలాది మంది అసువులు బాసినా నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేకపోతున్నారనేది కాదనలేని వాస్తవం. నామమాత్రపు జరిమానాలతో శిక్షలతో సరిపెడుతున్నారు. అప్పుడప్పుడు లైసెన్సులు రద్దు చేస్తున్నారు. అయినా పరిస్థితుల్లో మార్పురాకపోడం చట్టం లోనే లోపం ఉందేమోననిపిస్తున్నది. ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో మద్యం సేవించి వాహనాన్ని నడిపి మరణానికి కారణమైతే ఇరవైయేళ్ల వరకు కఠినకారాగార దండన విధిస్తారు. అమెరికా, జపాన్, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో పదిహేనేళ్ల దాకా జైలుశిక్ష వేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. ఈ మారణ హోమాన్ని ఆపాలి. ప్రధానంగా మద్యం సేవించో, లేక అలక్ష్యంతోనో వాహనాన్ని నడిపి ఎంత మందిని చంపినా జరిమానా చెల్లిస్తే సరిపోతుందనే భావన పోగొట్టాలి. జీవితంలో స్టీరింగ్ పట్టకుండా పటిష్టమైన చట్టానికి రూపకల్పన చేయాలి.

ఎప్పుడూ ఒకరికి ఇవ్వడం నేర్చుకో అంతేకాని తీసుకోవడం కాదు. అలాగే ఒకరికి సేవ చేయడం నేర్చుకో. అంతేకాని ఒకరిపైన పెత్తనం చేయడం కాదు.



రామకృష్ణ పరమహంస

పనిచేసేతత్త్వమూ, పని పట్ల విశ్వాసమూ విజయానికి మూల కారణాలు.



హెన్రీఫోర్డ్

## ప్రజావాక్కు



### భారత్‌ను దూరం చేసుకుంటోంది

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్‌పై చేసిన విరుద్ధ వ్యాఖ్యలు మరోసారి ఆయన అవిశ్వసనీయతను స్పష్టంచేశాయి. ఒక రోజు భారతదేశాన్ని అమెరికా కోల్పోయింది అని చెప్పి, మరుసటి రోజు తిరిగి మనం భారత్‌ను కోల్పోలేదు అని చెప్పడం ఆయన రాజకీయ అయోమయానికి నిదర్శనం.మాటల్లో ఒకటి,పనుల్లో ఇంకొకటి ఉండడం అంతర్జాతీయ సంబంధాల్ని గందరగోళానికి గురిచేస్తుంది. భారత్‌పై విధించిన అధిక సుంకాలు, రష్యా చమురు దిగుమతులపై ఒత్తిడి, పాకిస్థాన్‌తో మధ్యవర్తిత్వం చేశానన్న అనవసర వ్యాఖ్యలు ఇవి అన్నీ అంతర్జాతీయ దౌత్యవైఫల్యాలే తప్పవేరేమీ కావు.నోబెల్ శాంతి బహుమతికి మద్దతుఇవ్వలేదన్న అసంతృప్తితో ప్రతీకారం తీర్చుకోవడం ఒకఅగ్రరాజ్యనాయకుడికితగని వ్యవహారం.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### తిన్నింటి వాసాలు లెక్కించేవారు..

వ్యాపారస్థులు భాగస్వాములని తమవద్ద పని చేసేవారిని రాజకీయ పదవుల్లో ఉన్నవారు తమ సహచర మంత్రులని, మిత్రులని చివరికి రక్తసంబంధీకులని ఒక కంటకని పెడుతూ పరిస్థితులని ఎప్పటికప్పుడు గమనిస్తూ చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఈ రంగాల్లో నమ్మించి మోసం చేసే వంచకులు, వెన్నుపోటు దారులు ఎక్కువగా ఉంటారు. పైకి మంచి వారిలాగా నమ్మకస్తుల్లాగా నటిస్తారు.సమయం, అవకాశం చక్కగానే తమ కపట బుద్ధిని బయటపెట్టుకుంటారు.ఇలాంటివారి మూలంగా వ్యాపారస్తులుమోసపోతారు.వ్యాపారంలోనష్టపోతారు. రాజకీయ నాయకులు వెన్నుపోట్లకు గురై పదవులను కోల్పోతారు.

- మిథునం, హైదరాబాద్

### కూలీ డబ్బులు చెల్లించాలి

గత మూడు నెలలుగా ఉపాధి హామీకూలీలా డబ్బులు రాక పల్లెల్లో పనిస్తంభించిపోయే పరిస్థితిఉంది. పారదర్శకత పేరుతో రోజుకు రెండు సార్లు ఫోటో కొట్టాలి అని నిబంధన పెట్టిన ప్రభుత్వం పైసలు 15 రోజుల్లో అందించాలి అని చట్టంలో పేర్కొన్న విషయాన్ని మాత్రం మరిచిపోయింది.డబ్బులు 2లేదా 3నెలలకు వేస్తూ కూలీలా పనికి రావాలన్న ఆసక్తికోల్పోయేలా చేస్తుంది. ఉమ్మడి ఆస్తుల కన్నా వ్యక్తిగత ఆస్తుల సృష్టి జరగడం ముఖ్యం.

- భారత అవినాష్, జనగామ

### ఇ.సి నిజాయితీగా పని చేస్తోందా!

మహారాష్ట్ర శాసన సభఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. అదే ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి ఇందుకు పూర్తి విరుద్ధమైన ఫలితాలను చవిచూసింది. ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఎన్నికలు జరిగే సమయానికి మహాయుతి కూటమి ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత పెల్లుబికింది. ఫిరాయింపు దారులతో ఏర్పడిన మహాయుతి ప్రభుత్వం మంచి పాలన పారదర్శక పాలన అందించటంలో పూర్తిగా విఫలమై విమర్శల పాలయింది. ఓటమి ఖాయమనుకున్నారు. అలాగే పరిస్థితులన్నీ అనుకూలంగా దండి అధికారంలోకి వస్తుందనుకున్న ప్రతిపక్ష కూటమి ఘోర పరాజయం పాలైంది.అలానే 2023 మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో కూడా ఇలానే జరిగింది.

-శాస్త్రి, హైదరాబాద్

### ఇదంతా దేనికోసం..

నాటి రాచరిక రాజకీయంలో రాజు తల తీసినవాడే రాజు. నేటి రాజకీయంలో పరోక్షంగా అల్లర్లు సృష్టించినవాడే నాయకుడు. విధానం మారినా! విధులు ఒకటే.పల్లెల్లో,పట్టణాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడ చూసినా రాజకీయమే. తమ ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ చట్టాన్ని చుట్టంలాచేసుకొని మంచివారి ముసుగులో తమకనుకూల నిర్ణయాలతో రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేవారున్నారు.బయటకుమామూలుగా కనబడినా మంచి పనులు చేసిన మంచిమనుషులూ ఉన్నారు. అంతర్జాతీయంలో అల్లర్లు అరాచకాలతో నేపాల్ పార్లమెంటు దహనం.గతంలో బంగ్లాదేశ్‌లో విద్యార్థుల సమ్మెగా మొదలై ఆదేశ ప్రధానినే తరిమారు.ఇక్కడ కూడా అదేవిధానం వాడారు. రష్యా ఉక్రెయిన్‌లు యుద్ధాలతో దద్దరిల్లుతున్నాయి.

-డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### సానుకూల నిర్ణయం అవసరం

ఏపి రాష్ట్రంలో అధికారిక ప్రభుత్వం ఇస్తున్న వివిధ పెన్షన్లలో పిహెచ్ కు చెందిన వారికి ప్రభుత్వం నోటీసులు పంపారు. దానికి సంజాయిషీతో పాటు సదరం విభాగం వారు ఇచ్చిన శాతం సరైనదని వైద్యాధికార్ల ద్వారా ధ్రువపత్రం పంపవచ్చు. పింఛను ఆగిపోవడంవల్ల ప్రతిజిల్లాలో నోటీసులకు బాధ పడి, వారి అనర్హతకుకారణం తెలుసుకునేందుకు జిల్లా కార్యాలకు తరలివచ్చారు. పింఛను మంజూరుకు 40 శాతం కనిష్టం ఐతే వారుఅర్హులే.వీటినిపరిశీలనకువిభాగంద్వారారూఢి పరచవచ్చు.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అవినీతి రహిత సమాజం స్వప్నమా! సాధ్యమా?

**నిజాయితీ, బాధ్యత, పౌర ధర్మం వంటి నైతిక బీజాలను విద్యాలయంలో నాటితే, అవి భవిష్యత్తులో సమగ్ర వ్యక్తిత్వంగా వికసిస్తాయి. అలాతీర్చిదిద్ద బడిన విద్యార్థులే రేపటి సమాజాన్ని నడిపించే నిజాయితీగల పౌరులుగానూ, నిబద్ధత కలిగిన అధికారులుగానూ, దేశానికి సేవచేసే నాయకులుగానూ అవతరిస్తారు. అవినీతి రహిత సమాజం ఒక కలలా కనిపించినా,ఆ కలను నిజం చేయడం అసాధ్యం కాదు. ఈమార్పు ఒకరి కృషితో కాదు, కోట్లాది ప్రజల చైతన్యంతోనే సాధ్యం అవుతుంది. ప్రతి ఓటరులో నిజాయితీ, ప్రతి పౌరుడిలో బాధ్యత ప్రతిఫలించిన క్షణం నుంచే ఆమార్పు ప్రారంభమవుతుంది.అందరం సమైక్యంగా సంకల్పించి ముందడుగు వేసినప్పుడే అవినీతిరహిత భారతం దూరపు కలలా కాకుండా సాకారమైన వాస్తవంలా నిలుస్తుంది. ప్రతిఒక్కరూ తమ పరిధిలో చిన్నచిన్న అడుగులు వేస్తూ అవినీతిరహిత ఆలోచనతో ముందుకుసాగితే, ఆ చిన్నచిన్న అడుగులే ఒక మహా విప్లవానికి నాందిఅవుతాయి. రాబోయే తరాలకు నైతికతతో కూడిన సమాజాన్ని, సువరిపాలనను అందించగలిగితే, వారు ప్రశాంతంగా గర్వంగా జీవించే అవకాశాన్ని పొందుతారు.**

ననుబోలు రాజశేఖర్

భారత ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా గుర్తింపు పొందింది. కానీ ప్రజాస్వామ్యం అంటే కేవలం ప్రజలు స్వేచ్ఛాయుతంగా ఓటు వేసుకోవడమే కాదు. పారదర్శకత్వం, న్యాయబద్ధత, అవినీతి రాహిత్యం, ప్రజా సంక్షేమం, సమాజ అభివృద్ధి వంటి లక్ష్యాలతో ప్రభుత్వాలు పరిపాలన జరపడం అనే లోతైన అర్థం ప్రజాస్వామ్యంలో దాగి ఉంది. ప్రజా ప్రతినిధులతో పాటు ప్రభుత్వంలోని అన్ని వ్యవస్థలు నియమ నిబంధనలకు కట్టుబడి నిజాయితీతో విధులు నిర్వహించినప్పుడే ప్రజాస్వామ్యం మూల సిద్ధాంతాన్ని ప్రభుత్వాలు పాటించినట్లు అవుతుంది. అయితే, దశాబ్దాలుగా మారుతూ వస్తున్న ప్రభుత్వాలు, వాటికి అనుబంధంగా పనిచేస్తున్న వ్యవస్థలు ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధంగా పనిచేస్తున్నాయన్న వార్తలను వింటున్నాం, దృశ్యాలను కూడా చూస్తున్నాం. ఇది ఒక కఠినమైన వాస్తవం. అందుకే ఈ రాజకీయ సామాజిక పరిస్థితులను పరిశీలిస్తుంటే, దశాబ్దాలుగా ఒక ప్రశ్న మాత్రం మనసును తాకకుండా ఉండదు. అదేమిటంటే, అవినీతిరహిత పరిపాలన నిజంగా ఎప్పటికైనా సాధ్యమవుతుందా? లేక అది ప్రజాస్వామ్యపు శాశ్వత కలగానే మిగిలిపోతుందా? ఎన్నికలు జరిగే తీరే అవినీతికి మూలమా? ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ముఖ్యమైన భాగం. కానీ నేటి వాస్తవంలో, ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసే రాజకీయ నాయకులకు ఆ వందల కోట్ల డబ్బు ఎక్కడి నుండి వస్తుంది? ఆ డబ్బు వారు అవినీతిరహిత మార్గంలో సంపాదించిందేనా?, గెలిచిన తర్వాత ఆ డబ్బును తిరిగి సంపాదించుకునేందుకు అవినీతి మార్గాలను ఆశ్రయించకుండా ఉంటారా?అనేప్రశ్నలు మన ముందుకు వస్తూనే ఉంటాయి. ఈ ప్రశ్నలన్నింటికీ నిష్పక్షపాతంగా సమాధానాలు వెతికితే, అవినీతికి మూలం ఎక్కడుందో మనకు స్పష్టమవుతుంది. వందల కోట్లను ఖర్చు పెడితే గాని గెలవని పరిస్థితులు ఏర్పడుతున్న ఈ రాజకీయ వ్యవస్థలో, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కూడా ఒక విధంగా బాధితులే అని చెప్పవచ్చు. అవినీతి సంపదకి పునాది ఎన్నికల ఖర్చేనా? ఒక వ్యక్తి తన వృత్తిలో నిజాయితీగా కష్టపడి సంపాదించగలిగేది పరిమిత సంఖ్యలో లక్షలు, లేదా కోట్లు మాత్రమే. కానీ రాజకీయాల్లో మాత్రం ఐదు సంవత్సరాల పరిమిత కాలంలోనే వందల, వేల కోట్లను సంపాదించడం సాధారణ విషయం అయిపోయింది. జీవితాంతం కష్టపడినా ఒక మనిషి సంపాదించలేనన్ని కోట్లు,రాజకీయాల్లో ఐదేళ్లలో ఎలా సాధ్యం? దానికి ప్రధాన కారణం ఎన్నికల వ్యవస్థ. మళ్లీ గెలవాలంటే వందల కోట్లు ఖర్చు పెట్టాల్సిందే. ఆ ఖర్చును తిరిగి సంపాదించాలనే రాజకీయనాయకుల లక్ష్యం వలన, ప్రభుత్వ వ్యవస్థలతో పాటు అనేక ప్రైవేటు వ్యవస్థలు కూడా ఈ అవినీతిచక్రంలో భాగస్వాములు అవుతున్నాయి. అంతేకాదు, వందల కోట్ల సంపాదనకు అనేక అవినీతి పరుల, సంఘవిద్రోహశక్తుల సహకారం అవసరం అవుతుంది. అందుకే వారిని పెంచిపోషించే పరిస్థితి రాజకీయ నేతలకు తప్పనిసరి అవుతోంది. ఈ విధంగా ఎన్నికల్లో



ఖర్చు చేసిన వందల కోట్లు తిరిగి సంపాదించాలనే రాజకీయ నాయకుల కోరికే, అన్ని వ్యవస్థలు అవినీతి మయం కావడానికి అసలు మూలకారణం. కొనడానికి అమ్మడానికి ఓటు ఆట వస్తువా? ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజలే పరిపాలించే ప్రభుత్వమని అంటారు. కానీ నేటి పరిస్థితుల్లో ఎన్నికల గెలుపుకు వందల కోట్ల రూపాయల స్థూల పెట్టుబడి అవసరమవుతున్నది. ఫలితంగా ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఓట్లు కొనుగోలు చేసే రాజకీయ నాయకులకూ, ఆ డబ్బులు ఆశించి అమ్మేప్రజలకూ మధ్య ఒక ఆటవస్తువుగా మారిపోయింది. ఎన్నికల ముందు రోజు డబ్బు, మద్యం, బహుమతులు పంచడం, వాటిని స్వీకరించడం ఒక వింత సంప్రదాయ పండుగగా మారింది. ఈ అపసంప్రదాయం ఒకవైపు నైతిక విలువలను, సమాజ అభివృద్ధిని దెబ్బతీస్తే, మరోవైపు విద్యావంతులైన నిజాయితీ గల నాయకులు ఎన్నికల రంగంలోకి రావడానికి అడ్డంకిగా మారుతోంది. పారదర్శక పరిపాలన అందించవలసిన నాయకులే అవినీతి సంపదకు ఆశపడితే, సామాన్యుల నుంచి ఉన్నతాధికారుల వరకు వారిని అనుసరించడం సహజం. ప్రజలకు మార్గదర్శకులై చైతన్య పరచాల్సిన నాయకులే అవినీతి చేస్తే, సమాజం–దేశం అవినీతి రహితంగా ఎలా ఉంటుంది? అవినీతి సర్వసాధారణ భావనగా మారుతుందా? మెల్లిగా అవినీతి పెద్ద నేరం కాదులే, మనమే కాదు అందరూ చేస్తున్నారు అనే అభిప్రాయం సమాజంలో బలపడుతున్న తరుణంలో, అవినీతి రహిత సమాజం సాధ్యమా? అనే సందేహం కలుగుతుంది. ఇది పూర్తిగా అసాధ్యం కాదు, కానీ చాలా కష్టసాధ్యమైనలక్ష్యం. అవినీతి రహిత పాలన సాధించాలంటే ముందుగాప్రజల్లో డబ్బుకు ఓటు వేయకూడదనే అవగాహన పెరగాలి. అలాగే ప్రజలందరూ మేము ఓటుకు నోటుతీసుకోము అనేస్వచ్ఛంద ప్రతిజ్ఞ చేసుకోవాలి. రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ఖర్చుల లెక్కల్లో పారదర్శకత చూపాలి. అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించే న్యాయవ్యవస్థ ఉండాలి. ఈ విధానాలు ఇప్పటికే ఉన్నప్పటికీ వాటిని కఠినంగా అమలు చేసే నిబద్ధతను ఎన్నికల నిర్వహణ సంస్థలు, అవినీతిని అరికట్టే సంస్థలు, న్యాయస్థానాలు తీసుకోవాలి. అవినీతి రహిత సమాజ నిర్మాణంలో విద్యావ్యవస్థ పాత్ర ఏమిటి? అవినీతి రహిత సమాజ నిర్మాణంలో విద్యావ్యవస్థే మూల స్తంభం అని చెప్పడం అతిశయోక్తి కాదు. చిన్ననాటి నుంచే విద్యార్థుల మనసుల్లో సత్యం–అసత్యం, నీతి–అవినీతి మధ్య తేడాను బోధించినప్పుడు, వారు విలువలతో నిండిన వ్యక్తులుగా ఎదుగుతారు. నిజాయితీ, బాధ్యత, పౌర ధర్మం వంటి నైతిక బీజాలను విద్యాలయంలో నాటితే, అవి భవిష్యత్తులో సమగ్ర వ్యక్తిత్వంగా వికసిస్తాయి. అలాతీర్చిదిద్ద బడిన విద్యార్థులే రేపటి సమాజాన్ని నడిపించే నిజాయితీ గల పౌరులుగానూ, నిబద్ధత కలిగిన అధికారులుగానూ, దేశానికి సేవచేసే నాయకులుగానూ అవతరిస్తారు. అవినీతి రహిత సమాజం ఒక కలలా కనిపించినా, ఆ కలను నిజం చేయడం అసాధ్యం కాదు. ఈమార్పు ఒకరి కృషితో కాదు, కోట్లాది ప్రజల చైతన్యంతోనే సాధ్యం అవుతుంది. ప్రతి ఓటరులో నిజాయితీ, ప్రతి పౌరుడిలో బాధ్యత ప్రతిఫలించిన క్షణం నుంచే ఆ మార్పు ప్రారంభమవుతుంది.అందరం సమైక్యంగా సంకల్పించి ముందడుగు వేసినప్పుడే అవినీతి రహిత భారతం దూరపు కలలా కాకుండా సాకారమైనవాస్తవంలా నిలుస్తుంది. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో చిన్న చిన్న అడుగులు వేస్తూ అవినీతిరహిత ఆలోచనతో ముందుకు సాగితే, ఆ చిన్నచిన్న అడుగులే ఒక మహా విప్లవానికి నాంది అవుతాయి. రాబోయే తరాలకు నైతికతతో కూడిన సమాజాన్ని,సుపరిపాలనను అందించగలిగితే, వారు ప్రశాంతంగా గర్వంగా జీవించే అవకాశాన్ని పొందుతారు. అదే మనం కలిసికట్టుగా నిర్మించాల్సిన నిజమైన భవిష్యత్తు. ●

# శ్లాబ్‌ల కుదింపు మధ్యతరగతికి ఉపశమనమేనా!



డాక్టర్ తిరునహరి శేషు

పరోక్ష పన్నుల వ్యవస్థలో పారదర్శకతను పెంచటానికి, పన్నుఎగవేతదారులను నియంత్రించడానికి వస్తువులు, సేవలు, అమ్మకాలు, వినియోగంపై విధించే ఒక సమగ్రమైన ఏకీకృత అమ్మకం పన్నుని 101 వ రాజ్యాంగ సవరణ ద్వారా జూలై 1, 2015 నుండి భారత ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. జి ఎస్ టి లాంటి పన్నుల వ్యవస్థ అమలులోకి వచ్చిన తర్వాత దేశంలో పన్నుల విస్తృతి పెరగటంతో పాటు ప్రభుత్వ ఆదాయం వేల కోట్ల రూపాయల నుండి లక్షల కోట్ల రూపాయలకి పెరిగినది. ప్రస్తుతం ప్రతినెల జిఎస్‌టి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రెండు లక్షల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందనే విషయాన్ని గమనించాలి. జిఎస్‌టి లాంటి ఏకీకృత పన్నుల వ్యవస్థ అమలలోకి వచ్చిన తర్వాత దేశ ప్రజల కంటే లక్షల కోట్ల రూపాయల ఆదాయం పెంచుకోవటం ద్వారా ప్రభుత్వాలకే ఎక్కువ మేలు జరిగిందనే విమర్శలు కూడా వినపడినాయి. 5, 12, 18, 28 స్లాబ్‌లతో ప్రారంభమైన జిఎస్‌టి పన్నుల వ్యవస్థని 5,18 స్లాబ్‌లకే పరిమితం చేసి 12, 28 స్లాబ్‌లను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిఎస్‌టిని రెండు స్లాబ్‌లకే కుదించాలనే నిర్ణయం వలన సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలకి మేలు జరుగుతుందని, 175 రకాల వస్తు, సేవల ధరలు తగ్గుతాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెబుతున్నారు. చపాతి, పిజ్జా బ్రెడ్, చనా, పరోటా, పన్నీరు లాంటి నిత్యావసర వస్తువుల పైన నోట్‌బుక్స్, పెన్సిల్స్ జీవిత బీమా, వ్యక్తిగత ఆరోగ్య భీమా లాంటి వస్తువులు, సేవలపై జీరో జిఎస్‌టి వలన సామాన్య పేద మధ్యతరగతి ప్రజలకి ఉపశమనం కలుగుతుంది. వెన్న, నెయ్యి, చెప్పులు,సైకిళ్లు, కాఫీ, హ్యాండీ క్రాఫ్ట్స్, కార్పెట్స్, డయాబెటిక్ ఫుడ్, డయాగ్నస్టిక్ కిట్స్ లాంటి 99 శాతం వస్తువులను 12 శాతం స్లాబ్ నుండి ఐదు శాతం స్లాబ్‌కి మార్చటం వలన అనేక రకాల వస్తువుల ధరలు తగ్గుముఖం పడతాయి. హెయిర్ ఆయిల్, టూత్‌పేస్ట్, టూత్ బ్రష్, షాంపూ, చాక్లెట్స్, ఐస్ క్రీమ్స్, సేవింగ్ క్రీమ్, లాంటి వస్తువుల ధరలు డీజిల్




కార్లు, త్రీ వీలర్స్, మోటార్ సైకిళ్లు లాంటి వాహనాల ధరలు టీవీలు, ఏసీలు,వాషింగ్ మిషన్ లాంటి గృహోపకరణాల ధరలు ట్రాక్టర్ విడిభాగాలు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లు, సాగు యంత్రాలు లాంటి రైతాంగం ఉపయోగించే పరికరాల ధరలు కూడా తగ్గనున్నాయి. జిఎస్‌టి స్లాబ్‌ల కుదింపు వలన ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడకుండా జాగ్రత్తలు తీసుకునే క్రమంలో ప్రత్యేక వస్తువులు, లాప్ సైడెడ్ ప్రొడక్షన్, విలాస వస్తువులైన ఖరీదైన వాహనాలు, సిగరెట్స్, సిగార్, కూల్ డ్రింక్స్, టొబాకో, పాన్ మసాలా, కేఫీనేటెడ్ బివరేజస్ లాంటి వస్తువులపై 40శాతం జిఎస్‌టి పన్నుని ప్రతిపాదించారు. అన్ని రకాల వస్తు, సేవల పైన జిఎస్‌టి వేయటం వలన ఉత్పన్నమైన పన్నుల భారం నుండి ఉపశమనం కలిగించాలని గతంలో వినియోగదారులు ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోని ప్రభుత్వం వినియోగదారులపై మరింత పన్ను భారాన్ని మోపిందే కానీ ఎప్పుడూ తగ్గించలేదు. కానీ హఠాత్తుగా ప్రభుత్వం ఇప్పుడే ఎందుకు జిఎస్‌టి స్లాబ్‌లను తగ్గించింది అనే చర్చ దేశవ్యాప్తంగా జరుగుతుంది. భారతదేశ ఎగుమతులపై ట్రంప్50శాతం సుంకాలు విధించటం వలన విదేశీ ఎగుమతులు, వినియోగం తగ్గే ప్రమాదం ఏర్పడింది. కాబట్టి ఈసమస్య నుండి బయటపడటానికి స్వదేశీ వినియోగాన్ని, డిమాండ్‌ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి స్లాబ్‌లను కుదించడమే కాదు కొన్ని వస్తువులను జిఎస్‌టి పరిధి నుండి కూడా మినహాయించిందని చెప్పాలి. జిఎస్‌టి లోని రెండు స్లాబ్‌లను రద్దు చేయటం వలన దరిదాపు కేంద్ర ప్రభుత్వానికి నెలకి 48 వేల కోట్ల రూపాయల పన్ను ఆదాయం తగ్గుతుంది. అంటే వినియోగదారుల వద్ద పోగు పడిపోయిన ఆ ఆదాయంతో వినియోగం పెంచాలని ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తుంది. మారిన అభివృద్ధి వ్యూహంలో భాగంగా ఒకనాడు పొదుపులను ప్రోత్సహించిన ప్రభుత్వాలు నేడువినియోగాన్నిప్రోత్సహిస్తున్నాయి కాబట్టి ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాల వలన ఎదురయ్యే సమస్యలను అధిగమించటం దేశీయ వినియోగాన్ని పెంచడానికి ప్రభుత్వం జిఎస్‌టి స్లాబ్‌లను కుదించిందనే అభిప్రాయాలు కలుగుతున్నాయి. ఏది ఏమైనా జిఎస్‌టిస్లాబ్‌లను కుదించాలనే ప్రభుత్వ నిర్ణయం వలన వినియోగదారులపై పన్ను భారం తగ్గటమే కాదు ధరలు తగ్గి ప్రజల కొనుగోలు శక్తి పెరిగి వస్తు, సేవల డిమాండ్ కూడా పెరిగి తద్వారా పెట్టుబడులు పెరుగుతాయని ట్రంప్ ప్రతీకార సుంకాల వలన ఉత్పన్నమయ్యే సమస్యలను అధిగమించవచ్చని ప్రభుత్వం ఆశిస్తుంది. ●

# హైడ్రోజన్ రైలుకు గ్రీన్ సిగ్నల్ వచ్చేనా?

డి జె మోహన రావు

భారత రైల్వే వ్యవస్థలో త్వరలో ఒక విప్లవాత్మక మార్పు రాబోతోంది. మొదట బొగ్గుతో నడిచే ఆవిరి ఇంజిన్ల స్థానంలో డీజిల్ లోకోమోటివ్‌లు వచ్చాయి. ఆపై పెరుగుతున్న ఇంధన ఖర్చుల వల్ల విద్యుదీకరణకు ప్రాధాన్యత పెరిగింది. ఇప్పుడు, గ్రీన్ ఎనర్జీ వైపు దృష్టి సారించి హైడ్రోజన్ రైళ్ల శకానికి నాంది పలకబోతోంది. ఈమార్పు కేవలం సాంకేతిక పురోగతిని మాత్రమే కాకుండా, దేశస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను కూడా ప్రతిబింబిస్తుంది. ఈ దిశగా మన దేశం తన మొదటి హైడ్రోజన్ రైలును ప్రారంభించడానికి సిద్ధంగా ఉంది. దేశ మొదటి హైడ్రోజన్ శక్తితో నడిచే కోచ్ (డ్రైవింగ్ పవర్ కార్) చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో విజయవంతంగా పరీక్షించబడింది. ఈ రైళ్లు దేశవ్యాప్తంగా విద్యుత్ సౌకర్యం లేని కొండమార్గాల్లో నడపడానికి ఉద్దేశించబడ్డాయి. పర్యావరణ అనుకూల రవాణా దిశగా ఇది ఒక చరిత్రాత్మక అడుగు. 2030నాటికి నికర సున్నా కార్బన్ ఉద్గారాలను సాధించాలనే దేశ లక్ష్యంలో ఇది ఒక ముఖ్యమైన భాగం. ఇది కేవలం ఒక సాంకేతిక పురోగతి మాత్రమే కాదు, భవిష్యత్తుకు శక్తినిచ్చే భారత విధానంలో ఓ మౌలిక మార్పు. 'రైల్వేస్ కోసం హైడ్రోజన్' అనే పేరుతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ దేశంలో విస్తారమైన రైల్వే వ్యవస్థను మార్చడానికి సిద్ధంగా ఉంది. హర్యానాలో జరిపిన ఒక పైలట్ ప్రాజెక్ట్‌తో ప్రారంభించి, పర్యావరణ అనుకూల ప్రయాణానికి ఇది కొత్త మార్గాన్ని వేసింది. ఈ క్రమంలో హైడ్రోజన్ శక్తితో నడిచే రైళ్లను ఉపయోగించే ఐదవ దేశంగా భారతదేశం జర్మనీ, ఫ్రాన్స్, స్వీడన్, చైనాల సరసన చేరనుంది. హైడ్రోజన్ రైలు ఆధునిక ఇంజనీరింగ్ అద్భుతం. 'కొరాడియా ఐలింట్' అనేది హైడ్రోజన్ ఇంధనంతో నడిచే ప్రపంచంలోనే మొట్టమొదటి ప్రయాణీకుల రైలు. సాంప్రదాయ రైళ్లకు పూర్తిగా భిన్నంగా ఉంటుంది. డీజిల్ ఇంజిన్లు ఇంధనం మండించి శక్తిని ఉత్పత్తి చేస్తే, హైడ్రోజన్ రైళ్లు ఫ్యూయల్ సెల్‌లో జరిగే విద్యుత్ రసాయన చర్య ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్రక్రియలో హైడ్రోజన్ వాయువు, గాలిలోని ఆమ్లానితో కలిసి విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ విద్యుత్ రైలు మోటార్లను నడిపిస్తుంది. ఫలితంగా కేవలం నీరు, వేడి మాత్రమే బయటకు వెలువడుతాయి. ఇందులో వాయు కాలుష్యం లేకపోవడం వల్ల ఇది పర్యావరణానికి అత్యంత అనుకూలం. కార్బన్ డై ఆక్సైడ్‌కు బదులుగా నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తుంది. ఇది మొదట జర్మనీలో సెప్టెంబర్ 2022లో



ప్రవేశపెట్టబడింది. నేడు జపాన్, ఫ్రాన్స్ వంటి అనేక దేశాలు ఈ సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నాయి. ఇప్పుడు భారత్ కూడా ఆ జాబితాలో తన ముద్ర వేసుకోబోతోంది. మన దేశం రూపొందిస్తున్న రైలు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన హైడ్రోజన్ రైలు. 1200 హార్స్‌పవర్ శక్తితో గంటకు 110 కి.మీ వేగంతో 2,600మందికిపైగా ప్రయాణికులను తీసుకెళ్ళగలదు. యూరప్‌లో నడుస్తున్న రైళ్ల శక్తి 600 నుండి 800 హార్స్‌పవర్ వరకు మాత్రమే ఉండగా మన రైలు వాటిని మించి నిలుస్తోంది. ఈ రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, రీసెర్చ్ డిజైన్ అండ్‌స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ సహకారంతో స్వదేశంలోనే అభివృద్ధి చేస్తున్నారు. 'హైడ్రోజన్ ఫర్ హెరిటేజ్' చొరవ కింద 35 హైడ్రోజన్ శక్తితో నడిచే రైళ్లను మోహరించాలనే భారతీయ రైల్వేల విస్తృత లక్ష్యంలో ఈ హైడ్రోజన్ కోచ్ భాగం. ఒక రైలుకు సుమారు 80 కోట్లు. అలాగే ఒక్కో రూట్‌కు గ్రౌండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు అదనంగా 70 కోట్లు ఖర్చవుతాయి. ఈ ప్రాజెక్ట్ ఆధునిక తయారీలో భారతదేశ స్వావలంబనను స్పష్టంగా చూపిస్తూ మన ఇంజినీరింగ్ సామర్థ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. భారతీయ రైల్వేలు ఇప్పటికే ఉన్న డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్‌ను హైడ్రోజన్ ఇంధన సెల్‌తో తిరిగి అమర్చడానికి ఒక పైలట్‌ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభించాయి. గ్రౌండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుతో సహా ఈ ప్రాజెక్ట్ 111.83 కోట్ల వ్యయంతో అమలు చేయబడుతోంది. ఉత్తర రైల్వేలోని జింద్ సోనిపట్ విభాగంలో నడపడానికి ప్రణాళిక కూడా చేయబడింది. ఇది పర్యావరణానికి మాత్రమే కాకుండా సామాజికంగా, ఆర్థికంగా కూడా ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, ఇంధన కేంద్రాల ఏర్పాటు వంటి రంగాల్లో కొత్త ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణతో స్థానిక ఆర్థికాభివృద్ధికి ఊతమిస్తుంది. పరిశుభ్రమైన రవాణా వలన నగరాల్లో గాలికాలుష్యం తగ్గి, ప్రజా ఆరోగ్యం మెరుగవుతుంది.ఇది దీర్ఘకాలంలో వైద్యఖర్చులను కూడా తగ్గిస్తుంది. అంతేకాకుండా హైడ్రోజన్ రైళ్లు నిశ్శబ్దంగా ఉంటాయి. ఇది ప్రయాణికులకు సున్నితమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది. పర్యావరణ ప్రయోజనాలు స్పష్టంగా ఉన్నప్పటికీ హైడ్రోజన్ రైళ్ల భద్రతపై చర్చలు కొనసాగుతున్నాయి.హైడ్రోజన్ అత్యంత మండే స్వభావం కలది. కానీ, ఆధునిక ఇంజినీరింగ్ దాని ప్రమాదాలను తగ్గించడానికి అనేకభద్రతా లక్షణాలను అనుసంధానించింది. మండే ప్రక్రియకు బదులుగా ఎలక్ట్రోకెమికల్ రియాక్షన్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ఫ్యూయల్ సెల్స్ వాడకం ఒక ముఖ్యమైన భద్రతా చర్య. అయినప్పటికీ వివిధ వాతావరణాలలో పూర్తి భద్రతను నిర్ధారించడానికి మరింత పరిశోధన జరుగుతోంది. హైడ్రోజన్ రైళ్ల అతిపెద్ద ప్రతికూలత వాటి అధిక ఉత్పత్తి ఖర్చు.అలాగే హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ,ఇంధనం నింపడానికి భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడి అవసరం. ●

గుంటూరు వార్త





బుధవారం అనంతపూర్‌లో 'సూపర్ సిక్స్-సూపర్ సక్సెస్' విజయోత్సవ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్. హాజరైన ప్రజానీకం






# ఫలించిన మంత్రి నారా లోకేష్ కృషి

## తొలివిడతగా బీహార్ బార్డర్ కు 22మంది తరలింపు... నేడు నేపాల్ బాధితుల తరలింపునకు రంగం సిద్ధం
## ఖాట్మాండూ నుంచి ప్రత్యేక విమానాల ఏర్పాటునేపాల్ బాధితులకు మంత్రి నారా లోకేష్ భరోసా!
## సిఎస్, ఉన్నతాధికారులతో ఆర్టీజిఎస్ లో ఎపి భవన్ అధికారులతో మంత్రి లోకేష్ వీడియో కాన్ఫరెన్స్

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 10:** నేపాల్ లో చిక్కుకున్న తెలుగుపౌరులను తరలించేందుకు రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఉదయం నుంచి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. నేపాల్ లోని 12 ప్రదేశాల్లో చిక్కుకున్న 217మందిని సురక్షితంగా రాష్ట్రానికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. తొలివిడతగా నేపాల్ లోని హెటౌడా నుంచి 22మంది తెలుగుపౌరులను సురక్షితంగా బీహార్ బార్డర్ కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. మిలటరీ సాయంతో హెటౌడా నుంచి 58 కి.మీ దూరంలో ఉన్న బీహార్ బోర్డర్ మోతిహరికి తెలుగుపౌరులు బయలుదేరారు. బీహార్ లోని మోతిహరి నుంచి తెలుగుపౌరులను రాష్ట్రానికి తరలించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. నేపాల్ లో చిక్కుకున్న 217మందిలో 118మంది మహిళలు కాగా, 99మంది పురుషులు ఉన్నారు. విశాఖపట్నం వాసులు 42మంది, విజయనగరం 34మంది, కర్నూలుకు చెందిన వారు 22మంది కాగా, మిగిలిన వారు ఇతర జిల్లాలకు చెందిన వారు. తమను క్షేమంగా తరలిస్తున్న మంత్రి లోకేష్ కు తెలుగు ప్రజలు తెలిపారు. నేపాల్ లో చిక్కుకున్న 217మంది తెలుగు పౌరుల్లో 173మంది ఖాట్మాండూ పరిసరాల్లోని హోటళ్లలో తలదాచుకున్నారు. 22మంది హెటౌడాలో (ప్రస్తుతం వీరు మిలటరీ సాయంతో బయలుదేరారు), 10మంది ఖాట్మాండూకు సమీపంలోని పోఖ్రాలో, 12మంది సిమి కోట్ లో ఉన్నారు. రేపు ఖాట్మాండూ నుంచి ప్రత్యేక విమానంఖాట్మాండు పరిసరాల్లో ఉన్న 173మందిని తరలించేందుకు ఇండిగో360 విమానం రేపు ఉదయం 10గంటలకు డిల్లీ నుంచి ఖాట్మాండు చేరుకుంటుంది. ఖాట్మాండూలో రేపు కర్ఫ్యూ సడలించిన వెంటనే వీరందరినీ విశాఖపట్నం, విజయవాడ తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఎపి భవన్ అధికారులు ఖాట్మాండూ లోని తెలుగుపౌరులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నారు. తెలుగుపౌరుల లిస్టును తరలిచేసి బోర్డింగ్ పాసులను సిద్ధం చేస్తున్నారు. నేపాల్ సైన్యంతో సమన్వయం చేసుకొని రేపు ఉదయం హోటళ్లనుంచి తెలుగుపౌరులను విమానాశ్రయానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. సిమికోట్ లో చిక్కుకున్న 12మంది పౌరులను బుద్ధ ఎయిర్ విమానంలో రేపు ఉదయం 9గంటలకు యుపి సరిహద్దుల్లోని నేపాల్ గంజ్ కి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒకవేళ విమానంలో తరలింపు సాధ్యం కాకపోతే హెలీకాప్టర్లను కూడా సిద్ధంగా ఉంచారు. పోఖ్రాలోని 10మందిని 14సీటర్ చార్టర్డ విమానం ద్వారా నేపాల్ గంజ్ తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇందుకు నేపాల్ వైమానిక దళ అనుమతి కావాల్సి ఉంది. ఇందుకోసం సంప్రదింపులు చేస్తున్నారు. నేపాల్ గంజ్ చేరాక వారందరినీ రోడ్డుమార్గం ద్వారా లక్నోకి తరలించేందుకు ఉత్తరప్రదేశ్ అధికారులతో సమన్వయం చేస్తున్నారు. ఉదయం నుంచే నిరంతర సంప్రదింపులుబాధితులను సురక్షితంగా రాష్ట్రానికి చేర్చేందుకు మంత్రి నారా లోకేష్ శాయశక్తులా కృషిచేస్తున్నారు. నేపాల్ బాధితుల విషయం తెలుసుకున్న వెంటనే అనంతపురం పర్యటనను రద్దుచేసుకున్న లోకేష్... ఉదయం 10గంటలకే హుటాహుటిన సచివాలయానికి చేరుకున్నారు. సచివాలయం ఫస్ట్ బ్లాక్ లోని ఆర్టీజిఎస్ వార్ రూమ్ కు చేరుకున్న లోకేష్... ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తోపాటు సీనియర్ ఐఎఎస్ అధికారులు కార్తికేయ మిశ్రా, ముఖేష్ కుమార్ మీనా, కోన శశిధర్, అజయ్ జైన్, హిమాన్షు శుక్లా, జయలక్ష్మిలతో తదితరులతో సహాయ చర్యలపై చర్చించారు. ప్రస్తుతం ఖాట్మాండు విమానాశ్రయం మూసివేసి ఉన్నందున... ఎయిర్ పోర్టు ఓపెన్ చేసిన వెంటనే బాధితులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు భారత విదేశాంగశాఖ, నేపాల్ ఎంబసీ అధికారులతో నిరంతరం చర్చలు జరుపుతున్నారు. ఇప్పటివరకు 217మంది బాధితులు 12 గ్రూపులుగా వివిధ హోటళ్లలో తలదాచుకున్నట్లు గుర్తించారు. సిమిల్ కోట్ లో చిక్కుకున్న 12మంది బాధితులను పరిస్థితులు అనుకూలించిన వెంటనే లక్నో తరలించి, అక్కడినుంచి రాష్ట్రానికి రప్పించేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి లోకేష్ సూచించారు. బాధితుల్లో అత్యధికులు ఖాట్మాండు, పరిసరాల్లోని హోటళ్లలో ఉన్నందున ఖాట్మాండు నుంచి విశాఖపట్నానికి ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలవారీగా బాధితుల వివరాలను సేకరించి, వారిని సురక్షితంగా స్వస్థలాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.బాధితులకు భరసా...నేపాల్ లోని వివిధ హోటళ్లలో తలదాచుకున్న బాధితులతో మంత్రి లోకేష్ వీడియో కాల్ మాట్లాడుతూ వారికి ధైర్యం చెబుతున్నారు. ప్రతి రెండుగంటలకు ఒకసారి వివిధ ప్రాంతాల్లో ఉన్న బాధితులతో మాట్లాడుతున్నారు. నేపాల్ లోని ముక్తినాథ్ యాత్రకు వెళ్లి చిక్కుకున్న విశాఖకు చెందిన సూర్యప్రభతో మంత్రి లోకేష్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఖాట్మాండులోని పశుపతినాథ్ టెంపుల్ సమీపంలోగల రాయల్ కుసుమ్ హోటల్ లో విశాఖకు చెందిన 84మంది తలదాచుకున్నారు. రోజారాణి అనే మహిళతో మాట్లాడిన లోకేష్... అధైర్య పడొద్దు... మిమ్మల్ని క్షేమంగా తీసుకొచ్చే బాధ్యత మాది అని భరోసా ఇచ్చారు. ఖాట్మాండులోని పశుపతి ఫ్రంట్ హోటల్ లో తలదాచుకున్న మంగళగిరికి మాచర్ల హేమ సుందర్ రావు, నాగలక్ష్మిలతో మంత్రి లోకేష్ వీడియో కాల్ లో మాట్లాడారు. మంగళగిరికి చెందిన 8మందితో పాటు ఆ హోటల్ లో మొత్తం 40మంది తలదాచుకున్నట్లు వారు తెలిపారు. నిన్న తాము ప్రయాణిస్తున్న బస్సుపై ఆందోళనకారులు హఠాత్తుగా దాడిచేశారని, తాము ప్రాణాలు అరచేతబట్టుకొని హోటల్ కు చేరుకున్నట్లు వారు చెప్పారు. తాము ఖాట్మాండు ఎయిర్ పోర్టుకు కేవలం కిలోమీటరు దూరంలోనే ఉన్నామని తెలిపారు. భయపడవద్దని... క్షేమంగా రాష్ట్రానికి తీసుకువస్తామని లోకేష్ భరోసా ఇచ్చారు. ఢిల్లీలోని ఎపి భవన్ సీనియర్ అధికారి అర్జా శ్రీకాంత్ తో సిఎంఒ అధికారి కార్తికేయ మిశ్రా బాధితులకు సహాయ చర్యలపై నిరంతరం సంప్రదిస్తున్నారు. మంత్రి లోకేష్ ఆదేశాలకు అనుగుణంగా ఎపిఎన్ఆర్ టి చైర్మన్ వేమూరి రవికుమార్, సిఇఒ కృష్ణమోహన్ సహాయచర్యలను సమన్వయం చేస్తున్నారు.







## నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడంపై మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి
### సచివాలయంలోని ఆర్టీజీఎస్ వేదికగా ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు
### సంబంధిత శాఖల మంత్రులు, అధికారులతో సమన్వయం

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 10:** నేపాల్ లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆ దేశంలో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నడుంబిగించారు. ఇందుకోసం నేడు అనంతపురంలో జరగనున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమాన్ని మంత్రి రద్దు చేసుకున్నారు. నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని రక్షించడంపైనే ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకు సంబంధించి సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ ద్వారా పరిస్థితిని నిరంతరం సమీక్షించనున్నారు. ఈ మేరకు ఆర్టీజీఎస్ సెంటర్ లో ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటుచేయడం జరిగింది. ప్రత్యేక కాల్ సెంటర్, వాట్సప్ నెంబర్ ఏర్పాటుచేసి సంబంధిత మంత్రులు, శాఖల అధికారులతో మంత్రి సమన్వయం చేయనున్నారు. అధికారులు తక్షణమే ఆర్టీజీఎస్ కేంద్రానికి రావాలని ఇప్పటికే ఆదేశించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో తెలుగువారి వివరాలు సేకరించి తక్షణమే వారిని రాష్ట్రానికి తీసుకురావడంపై కార్యాచరణ ప్రారంభించనున్నారు. నేపాల్ లో చిక్కుకున్న 187 మంది తెలుగువారునేపాల్ లో ఇప్పటివరకు అందిన అధికారిక సమాచారం ప్రకారం 187 మంది తెలుగువారు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. వీరంతా నేపాల్ లోని నాలుగు ప్రాంతాల్లో ఉన్నారు. బఫాల్ లో చిక్కుకున్న 27 మంది శ్రీధరాచార్యుల పర్యవేక్షణలో ఉన్నారు. సిమిల్ కోట్ లో కారి అప్పారావు వద్ద 12 మంది, పశుపతి నగరంలోని మహదేవ్ హోటల్ వద్ద విజయ పర్యవేక్షణలో 55 మంది, గౌశాలలోని పింగలస్థాన్ లో 90 మంది తెలుగువారు చిక్కుకున్నట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. నేపాల్ లోని భారత రాయబారి నవీన్ శ్రీ వాస్తవకు పరిస్థితిని వివరించి ఇప్పటికే ఏపీ ప్రభుత్వం అప్రమత్తం చేయడం జరిగింది. తెలుగు ప్రజల భద్రతే ప్రాధాన్యంగా మంత్రి నారా లోకేష్ కేంద్ర ఏజెన్సీలు, భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సమన్వయం చేయడం జరుగుతోంది.

## జిల్లా సంయుక్త కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాస్తవ బాధ్యతల స్వీకారం

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 10:** బుధవారం ఉదయం కలెక్టరేట్ లోనిసంయుక్త కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా సంయుక్త కలెక్టర్ గా అశుతోష్‌శ్రీవాస్తవ పదవీ భాద్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించినబదలీల్లో ఆయన్ను గుంటూరు జిల్లాకు నియమించారు. పదవీ భాద్యతలు





స్వీకరించిన అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. పదవీ భాద్యతల స్వీకార కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ కె. ఖజావలి , గుంటూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె.శ్రీనివాసరావు , కలెక్టరేట్ ఎ.ఓ పూర్ణచంద్ర రావు , గుంటూరు తూర్పు, పశ్చిమ తాసీల్దార్లు, సుభానీ, వెంకటేశ్వర్లు, పొన్నూరు తాసిల్దార్ వెంకటస్వామి, తాడికొండ తాసిల్దార్ మొహర్ కుమార్, కలెక్టరేట్ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## 'కూటమి' ప్రభుత్వంపై జగన్ తప్పుడు ఆరోపణలు: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,సెప్టెంబర్10,ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక మాజీ సీఎం జగన్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ



ఆంజనేయులు మండిపడ్డారు. బుధవారం కూటమి ప్రభుత్వంపై జగన్ చేసిన విమర్శలను ఖండిస్తూ ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన జీ.వీ విడుదల చేశారు. వైకాపా ఐదేళ్ళ పాలనలో జగన్ ఒక్కసారైనా ప్రజల సమస్యలను పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్ళుగా పాలన కొనసాగుతుంటే జీర్ణించుకోలేక ప్రజలను మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వైకాపా పాలనలో ఏపీ అన్ని రంగాల్లో నష్టపోయిందని మరి ముఖ్యంగా రైతు,కౌలు రైతు ఆత్మహత్యల్లో ప్రధమ స్థానంలో ఉందని దీనికి జగన్ సమాధానం చెపా ్పలన్నారు. నాటి జగన్ నిర్ణయాల వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారన్నారు. పంట నష ్టం జరిగితే కనీసం పరిహారం కూడా చెల్లించలేదని విమర్శించారు. ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్న జగన్ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

## ఘనంగా చీఫ్‌విప్ జీవీ సతీమణి గోనుగుంట్ల లీలావతి జన్మదిన వేడుకలు

వినుకొండ,సెప్టెంబర్10,ప్రభాతవార్త: ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు సతీమణి,శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి జన్మదిన వేడుకలను పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ప్రధాన సేవకులు మాల్యాద్రి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో లీలావతి పేరు మీదుగా ప్రత్యేక పూజలు చేశారు. విఠంరాజుపల్లి బదిరుల పాఠశాల నందు కేక్ కటింగ్ చేసి విద్యార్థులకు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెదేపా నాయకులు,సీనియర్ న్యాయవాది పి. సైదారావు దంపతులు పాల్గొని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆలయ మహిళా భక్త బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## తురకపాలెంలో కార్యక్రమాలపై గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సమీక్ష: వివరాలు వెల్లడి

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 10:** గుంటూరు గ్రామీణ మండలం తురకపాలెం గ్రామంలో బుధవారం జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం(ఎన్ సీ డీ సీ) ఎన్ సీ డీ సీ సంయుక్త సంచాలకులు డా. హేమలత, డా. ప్రవీణ్ నేతృత్వంలోని నిపుణుల బృందం సందర్శన కొనసాగుతుందని, వ్యాధి కారణాలపై విశ్లేషణ జరుగుందని, నివేదికను త్వరలో ప్రభుత్వానికి అందించనున్నారని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తెలిపారు. గుంటూరు మెడికల్ కళాశాలలోని ఎస్ పీ ఎం బృందం మరియు ప్రైవేటు ఆసుపత్రులలోని ఇన్ఫెక్షన్స్ వ్యాధుల నిపుణులు రోగుల కేస్ షీట్ లను పరిశీలిస్తున్నారని, మరణాలకారణాల పై నివేదిక 2 రోజుల్లో అందుబాటులోకి రానున్నందన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు పరీక్షించిన 84 రక్త సాంస్క ృతిక (బ్లడ్ కల్చర్) నమూనాల్లో 64 (84 ) నెగటివ్‌గా తేలాయని, మిగిలినఫలితాలు 24 గంటల్లోవస్తాయన్నారు. గ్రామానికి సంబంధించిన డయాగ్నస్టిక్స్ పరీక్షా ఫలితాలను మెడికల్ కళాశాల బృందం సమీక్షిస్తోందని వివరాలు 24 గంటల్లో వెల్లడిస్తారన్నారు. గుంటూరు సమగ్ర ఆసుపత్రి నిపుణులు రక్తనమూనాల పరీక్షలలో అసాధారణ నివేదికలు ఉన్న రోగులకు సెషన్లు నిర్వహించి, మందులు సూచించటంతో పాటు మరింత స్కాన్లకు మార్గనిర్దేశం చేశారన్నారు. గ్రామంలో వైద్యారోగ్య శాఖ బృందాలు, 56 బలహీనగృహాలను (పడకగదిలోఉన్నవారు, కదలలేనివారు, మార్జినల్వర్కర్స్, సంచారజీవులు) సందర్శించి ఆరోగ్య అవగాహన కల్పించి, అసరమైన మందులు అందిస్తున్నారన్నారు. గ్రామవీధుల్లో కార్యక్రమాల ద్వారా వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత, సురక్షిత ఆహార అలవాట్లపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారన్నారు. వైద్యరోగ్య శాఖ రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ చైర్ పర్సన్ డా. ఎ. సిరి, ఆధ్వర్యంలో గ్రామ ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ అసాధారణ మరణాలపై విచారణ కొనసాగిస్తు, ఆరోగ్యపరిస్థితులపై క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ లు ఇళ్లను సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఎపిడెమిక్ కంట్రోల్ చర్యలను కొనసాగిస్తున్నారన్నారు. గ్రామంలో 21.08.2025 నుండి 07.09.2025 వరకు నమోదైన మెలియోడోసిస్ అనుమానిత కేసులలో ఇప్పటికీ ఇద్దరికి నిర్ధారణ అయ్యిందని, మిగిలిన ఐదుగురిలో మరో ఇద్దరికి నిర్వహించిన పరీక్షలలో నెగటివ్ గా ఫలితాలు రావటం వారిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయటం జరిగిందన్నారు. ప్రస్తుతం 5 మంది రోగులు ఆసుపత్రిలో చేరి ఉన్నారని . వీరి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని, నిపుణులైన వైద్యులు నిరంతర పర్యవేక్షణలో చికిత్స జరుగుతుందని, అవసరమైన మందులు అందిస్తున్నారన్నారు. జిల్లా పంచాయితీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో పది మంది మునిసిపల్ శానిటరీ కార్మికులు, ఒక శానిటరీ సూపర్వైజర్ పర్యవేక్షణలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సుమారు 2 కి.మీ. బొడ్డురాయి సెంటరు నుంచి రైతు సేవా కేంద్రం వరకు రహదారులు శుభ్రపరచి చెత్తను తొలగించరాని, బీసీ కాలనీలోని కచ్చా కాలువలలో పూడిక తీసి శుభ్రపరచారన్నారు, మలేరియ శాఖ సిబ్బంది కాల్వల్లోను, మొత్తం గ్రామంలోను ఫాగింగ్ చేస్తున్నారన్నారు. జిల్లా, డివిజన్ స్థాయి పంచాయితీ అధికారులు, ఎంపీడీవో, పంచాయితీ కార్యదర్శుల నిరంతరం పర్యవేక్షణలో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా కొనసాగుతున్నాయన్నారు.

## వేడుకగా నాయుడమ్మ అవార్డు ప్రదానోత్సవం



**తెనాలి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం వేడుకగా జరిగింది. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిధిగా హాజరై కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విభాగం కార్యదర్శి నాగరాజు మద్దిరాలకు నాయుడమ్మకు స్మారక అవార్డు ప్రధానం చేశారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ ఎందరికో స్ఫూర్తినీయులని ఈ వేడుకలో పాల్గొనడం సంతోషంగా ఉందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. తమ ప్రతిభ, నైపుణ్యాలతో ఈ వేదికను మరింత విలువైనదిగా చేసిన విద్యార్థిని, విద్యార్థులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యలవర్తి నాయుడమ్మ అభిమానులకు, దూర ప్రాంతాల నుండి ఇక్కడకు విచ్చేసిన అభిమానులకు కార్యక్రమము చేయడానికి మాకు వెన్నుదన్నుగా నిలబడిన మద్దతుదారులు అందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.


## రేపల్లె పురపాలక సంఘము
**ఇ-ప్రొక్యూర్మెంట్ షార్ట్ టెండర్ నోటీసు**

రేపల్లె పురపాలక సంఘములో 15వ ఆర్థిక సంఘ నిధుల నుండి 3 వర్క్‌లు ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ ఫ్లాట్‌ఫమ్‌పై షార్ట్ టెండర్లు ఆహ్వానించటమైనది. సదరు టెండర్లు సంబంధించిన వివరములు www.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడవచ్చును.

| | |
|---|---|
| ఎస్టిమేట్ విలువ | : రూ.24.91 లక్షలు |
| బిడ్ డాక్యూమెంట్లు డౌన్‌లోడ్ ప్రారంభం తేది | :ది.09-09-2025 సా.గం.06.00ల నుంచి |
| బిడ్ డాక్యూమెంట్లు డౌన్‌లోడ్ ముగింపు తేది | :ది.24-09-2025 సా.గం.03.00ల వరకు |
| బిడ్ దాఖలు ముగింపు తేది | :ది.24-09-2025 సా.గం.03.00ల వరకు |
| బిడ్ ఓపెన్ చేయు తేది | :ది.24-09-2025 సా.గం.03.40ల నుండి |
| **(ఆర్.ఓ.సి.నెం.156/2021/ఇ1)** | |
| ఎస్టిమేట్ విలువ | : రూ.22.00 లక్షలు |
| బిడ్ డాక్యూమెంట్లు డౌన్‌లోడ్ ప్రారంభం తేది | :ది.09-09-2025 సా.గం.06.00ల నుండి |
| బిడ్ డాక్యూమెంట్లు డౌన్ లోడ్ ముగింపు తేది | :ది.16-09-2025 సా.గం.03.00ల వరకు |
| బిడ్ దాఖలు ముగింపు తేది | :ది.16-09-2025 సా.గం.03.30ల వరకు |
| బిడ్ ఓపెన్ చేయు తేది | :ది.16-09-2025 సా.గం.03.40ల నుండి |
| **(ఆర్.ఓ.సి.నెం.416/2024/ఇ1)** | |

**కమీషనర్**
**రేపల్లె, పురపాలక సంఘము**

## వైసీపీది పోరు యాత్ర కాదు.. దగాయాత్ర: గోళ్ల సురేష్ యాదవ్

కారంపూడి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త: వైసీపీ నేతలు చేయాల్సింది అన్నదాత పోరు యాత్ర కాదని అది అన్నదాత దగా యాత్రగా మారిందని మండల టీడీపీ అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. గత అయిదేళ్లపాటు సాగునీటి కాలువలను ఆధునికీకరించకుండా అధ్వాన స్థితిలో వదిలేశారని ఆయన పేర్కొన్నారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే కాలువల ఆధునికీరణ చేపట్టి ఆయకట్టు చివరి భూములకు నీటిని అందించి పంటలను కాపాడిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించినా, వైసీపీ నేతలు కావాలని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో కేంద్ర ప్రభుత్వం కూడా పెద్దఎత్తున యూరియాను సరఫరా చేస్తుందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ అవుతూ ప్రజల్లో సంతృప్తిని కలిగిస్తున్నాయన్నారు. వైసీపీ నేతలు తమ ఉనికిని నిలుపుకోవడానికి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. వైసీపీ అనేది ముగిసిపోయిన అధ్యాయం అని, ఎంత కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

## దోమల దెబ్బకు గ్రామాలు విలవిల!

### - యంత్రాలు మూలన - పర్యవేక్షణ లోపంతో ఆరోగ్య సంక్షోభం

కారంపూడి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త: వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి కారంపూడి మండలంలోని గ్రామాలు దోమలతో విలవిల్లాడుతున్నాయి. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వేగంగా ప్రబలుతున్నాయి. ఆరోగ్యంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పారిశుద్ధ్యం, దోమల నివారణకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు వెచ్చించినా, సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు.

**నిధులు ఉన్నా ఫలితం శూన్యం:** గత ప్రభుత్వం మండలానికి సుమారు 12 ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేసింది. ఒక్కో యంత్రానికి రూ.35 వేల నుంచి 45 వేల వరకు ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఆ యంత్రాల్లో కొన్ని పూర్తిగా చెడిపోయాయి. మరికొన్ని పంచాయతీ కార్యాలయాల్లో మూలన పడ్డాయి.



సరైన నిర్వహణ, మరమ్మతులు లేకపోవడం, డీజిల్, లిక్విడ్ సరఫరాలో లోపాలతో అవి వినియోగంలో లేకపోవడం స్పష్టంగా కనిపిస్తుంది.

**అధికారుల ఆదేశాలు కాగితాలకే పరిమితం:** వర్షాకాలంలో దోమల వ్యాప్తిని నివారించేందుకు వారికి రెండుసార్లు ఫాగింగ్ చేపట్టాలని అధికారులు ఆదేశాలు ఇచ్చినా, చాలా గ్రామాల్లో నెలకు ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల వాటిని వాడుతున్నట్లుగా ఫొటోలు తీసి అధికారులకు చూపిస్తున్నారు.

**వ్యాధుల భయం:** దోమల వ్యాప్తితో చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రాణాపాయంగా మారే అవకాశాలు ఉండటంతో ప్రజలు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. గ్రామాల్లో వైద్యసదుపాయాలు పరిమితంగా ఉండటంతో ప్రాథమిక చికిత్సకే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి సరఫరా, శుభ్రతపై సరైన చర్యలు లేకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది.

**తక్షణ చర్యలు అవసరం:** గ్రామస్థులు మాట్లాడుతూ దోమల వల్ల పిల్లలు తరచుగా జ్వరాలతో బాధపడుతున్నారు. ఆసుపత్రికి వెళ్లడానికి కూడా డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్నాం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలు ఉన్నప్పటికీ వాటిని వినియోగించకుండా వదిలేయడం వల్ల నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే యంత్రాలను మరమ్మతు చేయడం, లిక్విడ్ సరఫరా, ఫాగింగ్ క్రమబద్ధంగా చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

**నిపుణుల హెచ్చరిక:** వర్షాకాలంలో దోమల నివారణ చర్యలు ఆలస్యమైతే వ్యాధులు విస్తరించడం, ముఖ్యంగా చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులు అధికంగా ప్రభావితమవుతున్నారు. తక్షణ చర్యలు చేపట్టకపోతే గ్రామాల ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**అధికారులు చర్యలకు సిద్ధమా?:** ప్రస్తుతం గ్రామాల్లో పరిస్థితిని చూసినప్పుడు పారిశుద్ధ్యంపై ఉన్నత స్థాయిలో ఉన్న శ్రద్ధ స్థానికంగా కనిపించడం లేదు. అధికారులు ఆదేశాలు ఇవ్వగానే సరిపోదు, వాటిని అమలు చేసే చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థలు బలంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. తక్షణమే ఫాగింగ్ యంత్రాలను మరమ్మతు చేసి, లిక్విడ్ సరఫరాలు అందించి, నియమితంగా ఫాగింగ్ చేపట్టేలా చర్యలు తీసుకోకపోతే దోమల వల్ల ఆరోగ్య సంక్షోభం మరింత పెరిగే ప్రమాదం ఉంది.

## పత్తిలో గులాబి రంగు పురుగు గుర్తింపునకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేయాలి

యడ్లపాడు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త : ప్రతి పంటలో గులాబి రంగు పురుగు ఉధృతి గుర్తించడం కొరకు ఎకరాకి 20చొప్పున లింగాకర్షక బుట్టలను పంట ఎత్తు మీద ఒక అడుగు పైన ఉండేటట్లుగా ఏర్పాటు చేసుకోవాలని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ఎమ్ నగేష్ తెలిపారు.



మండల పరిధిలోని చెంఫీస్కాన్‌పేట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో అయన ప్రసంగించారు. పత్తి పంటలో 30రోజులప్పుడు మరియు 60రోజులప్పుడు ఒక బస్తా యూరియా మరియు ఒక బస్తా ఎంపిపి పంటకు వేయాలని, వారంలో ఒకసారి పది శాతం కన్నా ఎక్కువ గుడ్డిపూలు గాని, కాయలు గాని ఉన్నట్లు తెలిసిన వెంటనే పురుగుమందులు పిచికారి చేసుకోవాలని, సింథటిక్ పైరిత్రాయుడు మందులను 100రోజులు పైబడిన మొక్కలపై మాత్రమే వాడవలేనని, మిరప నారు నాటే ముందు దుక్కిలో పది కిలోల వేప పిండిలో, కార్బోఫ్యూరాన్ గుళికలతో కలిపి వేయటం వలన వేరుకొల్లు మరియు వేరు తెగులు నివారించవచ్చునన్నారు. పంట మార్పిడి చేయటం వలన మిరపలో తామర పురుగుల ఉధృతిని మరియు నల్లి తీవ్రతను తగ్గించవచ్చునని, శనగ పంట వేయదలచిన రైతులు దుక్కిని ఖాళీగా ఉంచకుండా జొన్న గాని సజ్జ పంటగాని వేయటం వలన భూమి సారవంతమై శనగ పంటకు అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏవో హరిప్రసాద్, గ్రామ సర్పంచ్ అంజనేయులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాలఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

యడ్లపాడు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త : యడ్లపాడు గ్రామంలోని ఎంపిసిఎస్ నందు పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉత్పత్తిదారులు పోసిన వంద రూపాయలకు



12 రూపాయల చొప్పున మొత్తం 6,48,193రూపాయల బోనస్ పంపిణీ చేశారు. సంగం డైరీ పాల ఉత్పత్తిదారుల సంక్షేమం ప్రధానంగా బావించి వారికి కావల్సిన వసతులను కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంగం డైరీ పాలకవర్గ సభ్యులు పావులూరి శ్రీనివాసారావు, రీజినల్ మేనేజర్ పాతూరి అదినారాయణ, పల్నాడు జోనల్ మేనేజర్ కాట్రా నరేష్‌కుమార్, సూపర్‌వైజర్ పుట్టా వెంకటేష్, సొసైటీ అధ్యక్షులు పోపూరి కృష్ణారావు, పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు.

## జీవో 30 నిరుపేదలకు వరం

**-ఇళ్లపై పూర్తి హక్కులు కల్పిస్తున్నాం: --నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తున్నాం**

**--రెవెన్యూ సదస్సులో తూర్పు ఎమ్మెల్యే నసీర్**

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త : జీవో నెంబర్ 30 నిరుపేదలకు వరమని, ఎన్నో ఏళ్ళుగా నివాసం ఉంటున్న ఇళ్ళపై హక్కులు కల్పిస్తున్నామని తూరు ్ప ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక ప్రగతి నగర్‌లో జీవోనెంబర్ 30పై అవగాహన కల్పించేందుకు బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ సుభానితో కలసి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్ద కాలంపాటు నివాసం ఉంటున్న నిరుపేదలు తమ ఇళ్ళపై హక్కులు పొందబోతున్నారని, ఇదంతా సీఎం చంద్రబాబు నాయుడు మంచి మనస్సుకు నిదర్శనమని చెప్పారు. ప్రగతినగర్, యానాది కాలనీలో సుమారు 1300ఇళ్ళకు పైగా క్రమబద్దీకరణ



చేయబోతున్నామని వెల్లడించారు. దరఖాస్తు ఫీజు ఒక్కొక్కటికి రూ.50లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని, ఆ రుసుమును కూడా తానే భరిస్తానని ఈ సందర్భంగా నిరుపేదలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రగతినగర్‌ను ప్రగతి పథంలో నడిపిస్తున్నామని, ఏడాది కాలంలోనే రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. గతంలో ఈకాలనీలో అడుగు పెట్టాలంటే ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌కు ఏ ఒక్కరికి ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. పేద పిల్లలు చదువుకునేందుకు తల్లికి వందనం ద్వారా అందరి పిల్లలను చదివిస్తున్నామని, స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణం మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. కార్యక్రమంలోకార్పొరేటర్ యల్లావుల అశోక్, డివిజన్ అధ్యక్షులు బట్ల రాజా, అల్లం బాజీ, ఐల శ్రీను, మాదాసు శేఖర్, జడ సురేష్, కొండలు, కొలగాని సుబ్బారావు, బట్ట ప్రసాద్, పసుపులేటి సైదా, ఖతిజ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారంలో ఉన్నప్పుడు రికార్డెడ్ ప్రెస్‌మీట్లు - నేడు రికార్డుస్థాయిలో జగన్ అబద్ధాలు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబర్10, ప్రభాతవార్త: తాను అసెంబ్లీకి వస్తే తాను చేసిన దుర్మార్గాలు, అవినీతి భాగోతాన్ని చంద్రబాబు, కూటమి ప్రభుత్వం ఆధారాలతో సహ ప్రజలకు బహిర్గతం



చేస్తుందోమోనన్న భయంతోనే జగన్ ఆరుబయట అబద్దాలు, అసత్యాలతో కాలక్షేపం చేస్తున్నాడని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు విలేకరుల సమావేశంలో తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు రికార్డెడ్ ప్రెస్‌మీట్లతో ప్రజల చెవులకు పూలు పెట్టినవ్యక్తి, నేడు రికార్డుస్థాయిలో అబద్దాలు చెపుతూ, వారిని ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభ ఊహించని స్థాయిలో విజయవంతం కావడంతో జగన్ మైండ బ్లాంక్ అయిందని అన్నారు. సభ ప్రారంభానికి ముందే ప్రెస్‌మీట్ అంటూ మతి భ్రమించడంతో జగన్ పిచ్చిపిచ్చిగా మాట్లాడాడని అన్నారు. రైతులు, వ్యవసాయం గురించి రైతులను బలితీసుకున్న జగన మాట్లాడుతుంటే భూమిని నమ్ముకున్నవాళ్లంతా బోరుమంటున్నారని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు, ప్రజల ఆస్తులను అప్పనంగా కాజేసి, జగనన్న కాలనీల పేరుతో పేదల భూములను తక్కువ ధరకు లాక్కొని తన పార్టీ నేతలు జేబులు నింపిన జగన్, నేడు పరిశ్రమలకు భూములు ఇవ్వడాన్ని తప్పుపడుతున్నాడని అన్నారు. కాంక్రీట్ మధ్యలో కనిపిస్తున్న తుప్పుపట్టిన ఇనుపచువ్వలను చూసిన ప్రజలు నిజంగా జగన్ కట్టించిన మెడికల్ కాలేజీలు ఇవేనా అని నోరెళ్లబెట్టి చూస్తున్నారని అన్నారు. గత ఎన్నికలలో 11 సీట్లకు పరిమితం చేసినా పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నికలలో తనవాళ్లే తనను దారుణంగా ఓడించినా, బుద్ధిలేకుండా ఆ మాటలు ఏమిటి, పనిచేస్తున్న ప్రభుత్వంపై ఆ నిందలు ఏమిటి అని జగన్‌ను ప్రజలు ఛీకొడుతున్నారని అన్నారు.

**జగన్ చేసిన అవినీతి, దుర్మార్గాలు, హత్యలు ప్రజలకు చెప్పుకోలేకపోవడం జగన్ తప్పే:**

జగన్‌కు, రాష్ట్రానికి మంచి చేశానని అనుకోవడం జగన్ పిచ్చితనం, గత ఎన్నికల ఫలితాల తరువాత అక్కచెల్లెళ్లు ఏమైపోయారు, అన్నదమ్ములు ఏమయ్యారు. సిద్ధం సభలకు వచ్చిన ప్రజలు ఏమయ్యారన్న జగన్ వ్యాఖ్యలు సానుభూతి డ్రామా అనుకోవాలా, తాను చేసింది ప్రజలకు చెప్పుకోలేకపోయానన్న జగన్ వ్యాఖ్యలు నిజమే, బాబాయి హత్య, ఆస్తికోసం తల్లిని, చెల్లిని కోర్టుకు లాగటం, దళితులపై సాగించిన దమనకాండ, బిసిలపై పాల్పడిన కుట్రలు, మైనారిటీలే లక్ష్యంగా సాగించిన ప్రజలకు చెప్పలేకపోవడం జగన్, వైసిపి నేతలు తప్పేగా అని ప్రత్తిపాటి అన్నారు. అదేవిధంగా తాను చేసిన అవినీతి, దోపిడి, మద్యం, ఇసుక, భూకుంభకోణాల గురించి ప్రజలకు వివరించకపోవడం జగన్ తప్పేగా అని అన్నారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని దోచేసి ప్రజలను హింసించి, ప్రకృతి సంపద సహ సర్వం దోచేసిన తనకు భారతన్యాయ శాస్త్రంలోని ఏ చట్టం ప్రకారం శిక్షించాలో జగనే నిర్ణయించుకోవాలని అన్నారు. విషపూరిత మద్యంతో వేల కుటుంబాలను రోడ్లపాలు చేసి, వందల మంది చావులకు కారకుడైన తననున భారత న్యాయస్థానంలో ఏ శిక్షాస్మృతి ప్రకారం దండించాలో ఆయనే చెప్పాలని ప్రత్తిపాటి అన్నారు. నిత్యం చంద్రబాబు, ప్రజల చావుల గురించి ఆలోచించే జగన్‌ను ప్రపంచస్థాయి మానసిక వైద్యశాలలో చేర్పించాలని ఆయన కుటుంబానికి విజ్ఞప్తి చేశారు. జగన్‌ను పట్టి పీడిస్తున్న అవినీతి పిశాచి, అధికార పిచ్చి ఆయనను వదిలేవరకు నాలుగు గోడల మద్యే ఉంచితే ప్రజలకు, రాష్ట్రానికి క్షేమమని ప్రత్తిపాటి సూచించారు.

## గణపవరం అయ్యప్పస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు



నాదెండ్ల, సెప్టెంబర్10, ప్రభాతవార్త: మండలంలోని గణపవరం గ్రామంలో వేంచేసియున్న అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమం మరియు ప్రత్యేక పూజా కార్యక్రమాలు స్వామివారికి వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి అనిల్‌కుమార్ ఆయన సతీమణి అనంతలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్పస్వాములకు ఆయన స్వయంగా వడ్డించి అనంతరం భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని, సమాజంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, అయ్యప్పస్వామి భక్తులు, నిర్వాహకులు పాల్గొని ఎస్ఐ అనిల్‌కుమార్ దంపతులను సత్కరించారు.

## ఏఎన్‌యు కీర్తి విశ్వవ్యాప్తం

### - స్వయం సంవృద్ధి - గణనీయ వృద్ధి- 150కి పైగా ర్యాంకులు- నాక్ ఏ ప్లస్ గుర్తింపు

### - స్వర్ణోత్సవాల ముంగిట నేడు 49వ వ్యవస్థాపక దినోత్సవం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, సెప్టెంబరు10, ప్రభాతవార్త: బోదన, పరిశోధన, క్రీడా, సాంస్కృతిక రంగాలలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్వవ్యాప్త గుర్తింపును సొంతం చేసుకుంది. 1976లో ఏర్పాటైన విశ్వవిద్యాలయం అంచెలంచెలుగా ఎదుగుతూ దినదినాభివృద్ధిని సాధించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతీ ఏటా నూతన



కోర్సులు ప్రారంభించి విద్యార్థులను ఆకర్షిస్తుంది. చుట్టూ పేరు ప్రఖ్యాతులు ఉన్న విశ్వవిద్యాలయాలు ఎన్ని పుట్టుకొస్తున్నా కూడా నాగార్జున విశ్వవిద్యాలయం అభివృద్ధిని కొనసాగిస్తుంది.

**మౌలిక సదుపాయాలకు పెద్దపీట:**



విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటి నుంచి పనిచేసిన వైస్‌ఛాన్సలర్ల కృషి వల్ల మౌలిక సదుపాయాలు ఒనగూరాయి. ఆర్ట్స్, సైన్స్, ఫార్మశీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ కళాశాలల ఏర్పాటుతో బాలురు, బాలికలు, పరిశోధకులకు వేర్వేరుగా వసతిగృహాలు, 1లక్షకు పైగా పుస్తకాలతో డాక్టర్ అంబేద్కర్ పేరుతో ఆధునిక లైబ్రరీ, 24/7 ఇంటర్నేట్, సైన్స్ విద్యార్థులకు లేబొరేటరీలు, శాస్త్ర సాంకేతిక విద్యార్థులకు ఇస్రో వంటి ప్రతిష్టాత్మక సంస్థల పరిశోధన ప్రాజెక్టులు, రూసా నోడల్ సెంటర్, ఇంకుబేటర్‌లు, ఇంటర్నేషనల్ విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యాలు, ఆధునిక సింథటిక్ స్పోర్ట్ ట్రాక్ ఏర్పాటు చేయడంలో సఫలీకృతులయ్యారు. అలాగే 2003 నుంచి ప్రారంభించిన దూరవిద్యా కేంద్రం అనతికాలంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. 3ఎకరాల్లో సేంద్రీయ వ్యవసాయంతో కూరగాయలు, ఆకుకూరలు పండించి వసతిగృహాలకు అందిస్తున్నారు. అలాగే ఏ విశ్వవిద్యాలయంలో లేని కంగన్ వాటర్ సౌకర్యం వర్సిటీలో ఉంది.

నాక్ ఏ ప్లస్ ర్యాంకుల పరంపర: నాగార్జున విశ్వవిద్యాలయంకు 2024లో 3.46 అవుట్‌స్టాండింగ్ స్కోరుతో దేశంలోనే నాక్ ఏప్లస్ గ్రేడ్ సాధించిన విశ్వవిద్యాలయంగా రికార్డు సృష్టించింది. అలాగే అంతర్జాతీయ క్యూ ఎస్ ఐగేజ్, ఎన్ఐఆర్ఎఫ్, యుఐ, ఇండియా టుడే, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వంటి సంస్థలు ప్రకటించిన ర్యాంకుల్లో ఏఎన్‌యు స్థానం ప్రతీఏటా మెరుగౌతుంది. చెప్పులు లేకుండా నడిచిన విభాగంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు, ఐఎస్ఓ సర్టిఫికెట్‌లను సాధించింది.

**సమాజ అభివృద్ధికి బాటలు వేసేలా..**

వర్సిటీలో జరుగుతున్న పరిశోధనలు సమాజాభివృద్ధికి బాటలు వేసేలా ఉన్నాయని ప్రస్తుతం ఇన్‌చార్జి వీసిగా ఉన్న ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. స్వర్ణోత్సవ ఉత్సవాలకు వెళుతున్న సందర్భంగా ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. పారిశ్రామిక అవసరాలకు అనుగణంగా సిలబస్ మార్పులు, నూతన జాతీయ విద్యా విధానం అమలు, విద్యతో పాటుగా నైపుణ్య శిక్షణ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచడం, నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుని క్వాంటం టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ వంటి కోర్సులతో విద్యార్థులను ప్రగతిపథంలోకి తీసుకురావడం తమ ముందున్న లక్ష్యాలుగా పేర్కొన్నారు. రాజధాని వర్సిటీగా ఉన్న నాగార్జున వర్సిటీని విశ్వవ్యాప్త కీర్తి రెట్టింపు చేసేలా జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుని బోదన, పరిశోదనలు, ఫ్యాకల్టీ, స్టూడెంట్ ఎక్స్‌ఛేంజ్ వంటి కార్యక్రమాలు పెంచుతామని వివరించారు. వర్సిటీ కుటుంబానికి ఆయన వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి అభివృద్ధిని నిరంతరం కొనసాగేందుకు ప్రతీ ఒక్కరు భాగస్వాములుగా నిలవాలని ఆకాంక్షించారు.

**నేడు పూర్వ వీసీలకు సన్మానం:** వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పలువురు పూర్వ వీసిలను సన్మానించనున్నట్లు ఆచార్య వి.వెంకటేశ్వర్లు తెలిపారు. వ్యవస్థాపక దినోత్సవ పురస్కరించకుని మీడియా కమిటీ బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. గురువారం ఉదయం 11గం.లకు డైక్‌మన్ ఆడిటోరియంలో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇన్‌చార్జి వీసి ఆచార్య కె.గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఇతర డైరెక్టర్లు, కోఆర్డినేటర్లు, విభాగాధిపతులు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆచార్య జి.చెన్నారెడ్డి, ఆచార్య కె.ధనలక్ష్మి, డాక్టర్ కె.జ్యోతిర్మయి, అతిధి అధ్యాపకులు డాక్టర్ కె.శశిధర్, డాక్టర్ ఎన్.బాబులు పాల్గొన్నారు.

## వర్సిటీ వద్ద నక్కా ఆనంద్‌బాబు పుట్టిన రోజు వేడుకలు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, సెప్టెంబరు10, ప్రభాతవార్త: ఎంఎల్ఏ నక్కా ఆనంద్‌బాబు పుట్టిన రోజు వేడుకలు బుధవారం వర్సిటీ వద్ద జరిగాయి. మెయిన్ గేట్ వద్ద విద్యార్థులు బాణా సంచ కాల్చి, కేక్ కట్ చేశారు. ముందుగా నక్కా ఆనంద్‌బాబును కలిసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన విద్యార్థులతో సూచించారు. ఈ సందర్భంలో విద్యార్థులు మధు, భరత్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి బాధితులకు న్యాయం చేయాలి

గుంటూరు విద్య, ప్రభాతవార్త: ఎస్సీ ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తూ బాధితులకు న్యాయం జరిగే విధంగా నిందితులకు శిక్ష పడే విధంగా అధికారులు పనిచేయాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ దళితుల యొక్క రక్షణ కొరకు ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన ఒక ప్రత్యేకమైన ఆయుధం ఎస్సీ ఎస్టీ చట్టమని పేర్కొన్నారు. అటువంటి చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా కొందరు పనిచేస్తున్నారని దీని ద్వారా బాధితులకు న్యాయం జరగకపోగా నిందితులు మరలా దళితులను దూషిస్తూ దాడులకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం జరుగుతున్నాయని ఏసుబాబు మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు.

## నోయిడాలో పట్టణానికి చెందిన దివ్వెల దీపక్‌కుమార్ తోటి విద్యార్థి తుపాకీ కాల్పుల్లో మృతి

చిలకలూరిపేట, సెప్టెంబర్10, ప్రభాతవార్త: ఢిల్లీలోని నోయిడా ప్రాంతంలో ఉన్న కళాశాలలో పట్టణానికి చెందిన టిడిపి మాజీ కౌన్సిలర్ దివ్వెల రత్తయ్య కుమారుడు దివ్వెల దీపక్‌కుమార్ (22) యంబిఏ



చదువుతున్నాడు. కళాశాల ప్రాంతంలోనే ప్రైవేటు హస్టల్‌లో దీపక్‌కుమార్ తన స్నేహితులు దేవాన్ష్ చౌహన్ (23) తో కలసి ఉంటున్నారు. కాగా మంగళవారం హస్టల్‌లో దీపక్‌కుమార్‌ను దేవాన్ష్ చౌహన్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చి చంపి తాను కూడా కాల్చుకొని ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం తాళం వేసిన గదినుండి మూల్గులు వినిపించిన అనంతరం సెక్యురిటీ గార్డ్, హస్టల్ వార్డెన్ గది తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి చూడగా తలపై తుపాకి గాయంతో దీపక్ చనిపోయా పడిఉండటాన్ని వారు కనుగొన్నారు. దేవాన్ష్ కూడా ఇలాంటి గాయంతోటే తీవ్రంగా గాయపడ్డాడు. కాగా గాయపడిన దేవాన్ష్‌ను సమీపంలో ఉన్న ఆసుపత్రిలో చేర్పించారు. సంఘటనా స్థలంలో లైసెన్స్ పొందిన రివాల్వర్, నాలుగు లైవ్ కార్ట్రిడ్జ్‌లు, రెండు ఉపయోగించిన కార్ట్రిడ్జ్‌లు, మైబైల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర వస్తువులను కూడా పోలీసులు స్వాధినం చేసుకున్నారు. ప్రాథమికంగా ఇద్దరు స్నేహితుల మద్య కొంత గొడవ జరిగినట్లు తెలుస్తుంది. ఆ తరువాత వారిలో ఒకరు మరొకరిపై కాల్పులు జరిపి, ఆపై తనను తాను చంపుకోవడానికి ప్రయత్నించారు. కాగా ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే ఢిల్లీ తరలివెళ్లారు. ఈ సంఘటనతో పట్టణంలోని దివ్వెల రత్తయ్య, వారి స్నేహితుల బృందం విచారంలో మునిగిపోయారు.

## గుంతలో పడి ఒకరి మృతి





చిలకలూరిపేట, సెప్టెంబర్10, ప్రభాతవార్త: మండలంలోని మురికిపూడి గ్రామ సమీపంలో ఉన్న క్వారీల వద్ద గేదెలు కాచుకోవడానికి వెళ్లిన కొమ్మనబోయిన అంకమ్మరావు (55) క్వారి గుంటను దాటుతుండగా ప్రమాద వశాత్తు ఆ గుంతలో పడిపోయి మరణించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. కాగా సంఘటనా స్థలాన్ని బుధవారం స్థానిక తహసిల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్, రూరల్ ఎస్ఐ జి అనిల్‌కుమార్ పరిశీలించి ఎన్‌డిఆర్ఎఫ్ వారిని పిలిపించి క్వారీ గుంతలో పడిపోయాన కొమ్మనబోయిన అంకమ్మరావు భౌతిక కాయాన్ని వెలికితీసారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం భౌతికకాయాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ జి అనిల్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 17న ప్రధాని మోడీ పుట్టినరోజు సందర్బంగా చేసే కార్యక్రమాలపై సమావేశం





చిలకలూరిపేట, సెప్టెంబర్10, ప్రభాతవార్త: పట్టణంలోని బిజెపి కార్యాలయంలో బుధవారం ఈనెల 17వ తేదిన బారత ప్రధాని నరేంద్రమోడీ పుట్టినరోజు సందర్భంగా చేయవలసిన కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిధిగా ఉమ్మడి గుంటూరుజిల్లా అధ్యక్షుడు పోట్రు పూర్ణచంద్రరావు పాల్గొని ప్రసంగించారు. జిఎస్‌టిని పేద ప్రజలకు అనుకూలంగా మార్పు చేసినందుకు నియోజకవర్గ ప్రజల తరుపున ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. దీనిని పురస్కరించుకొని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న బిజెపి నాయకుడు వెల్లంపల్లి రాము షాపువద్ద ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాలలో పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కె వవన్‌కుమార్ గాంధి, ఎస్ పోలయ్య, జిల్లా ఉపాద్యక్షుడు మల్లెల శివనాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి గట్టా హేమకుమార్, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు నెల్లూరి ఈశ్వర రంజిత్, బిజెపి నాయకులు పులుగుజ్జు మహేష్, తూబాటి రాజ్యలక్ష్మి, రావికింది రామకృష్ణ, మాచర్ల శ్రీనివాసరావు, వరికూటి నాగేశ్వరరావు, ఉప్పాల బాస్కరరావు, హనుమాన్‌సింగ్, సామా వెంకటహనుమంతరావులు పాల్గొన్నారు.

## 1వ డివిజన్ శానిటరీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు

చిలకలూరిపేట, సెప్టెంబర్10, ప్రభాతవార్త: పురపాలకసంఘ పరిధిలోని ఒకటవ డివిజన్ శానిటరీ కార్యాలయాన్ని మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల రోజువారి హాజరుపట్టిని పరిశీలించారు. విధులకు వచ్చిన కార్మికులు



ఎక్కడ పనిచేస్తున్నారో, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణరావును అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం డివిజన్‌కు సంబందించి మరమ్మత్తులకు గురిఅయిన వాహనాలు, పుషకాట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టాలని, పట్టణాభివృద్దిలో శానిటేషన్ విభాగం కీలకపాత్ర పోషిస్తుందని గుర్తుచేశారు. స్వచ్ఛమైన పట్టణంగా నిలిపేందుకు వాహనాల సకాలంలో తరలింపు, సిబ్బందికి విధి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. మరమ్మత్తులకు గురైన వాహనాలను వెంటనే మరమ్మత్తులు చేయించాలని సూచించారు. పారిశుద్య నిర్వహనలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. వర్షాకాలంలో విష జ్వరాలు, వైరల్ ఫీవర్లు ప్రబలకుండా పురప్రజల ఆరోగ్యంపై దృష్టిపెట్టి నాణ్యమైన శానిటేషన్ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని తెలిపారు.

## యడవల్లి, గోపాళంవారిపాలెం గ్రామాల్లో రైతులకు యూరియా వాడకంపై అవగాహన సదస్సు

చిలకలూరిపేట, సెప్టెంబర్10, ప్రభాతవార్త: మండలంలోని యడవల్లి, గోపాళంవారిపాలెం గ్రామాలలో మండలస్థాయి కమిటీలో ఉన్న ముగ్గురు అధికారులు అయిన మండల రెవెన్యూ అధికారి షేక్ మహ్మద్ హుస్సేన్, మండల పరిషత్ అధికారి శ్రీనివాసరావు, మండల వ్యవసాయశాఖ అధికారి సిహెచ్ సరితలు బుధవారం రెండు గ్రామాల రైతులకు యూరియా వాడకంపై అవగాహనా సదస్సు నిర్వహించారు.



ఈ సందర్భంగా సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి సిహెచ్ సరిత మాట్లాడుతూ యూరియా ఎక్కువగా వాడటంవలన సాకియా దశపెరిగి పంట కాలపరిమితి కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. దీనివలన గులాబిరంగు పురుగు ఆశించేస్థాయి ఎక్కువగా ఉంటుందని, అచ్చంగా యూరియా ఎక్కువగా వాడరాదని రైతులకు వివరించారు. రైతులు యూరియానే వాడాలని అనుకుంటే నానో యూరియాను కూడా రైతులు అలవాటు చేసకోవాలని ఆమె వివరించారు. యంపిడిఓ కె శ్రీనివాసరావు మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని అప్పుడే మెరుగైన పంట దిగుబడి వస్తుందని తెలిపారు. తహసిల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ రైతులు రాబోయే రబీసిజీన్‌లో వేయబోయే పంటలకు కూడా ఎరువులను ముందస్తుగా కొనుగోలు చేయవలసిన అవసరం లేదని, అప్పుడు ఆ పంటలకు ఎరువులు అందుబాటులో ఉండేవిధంగా అధికారులం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎస్ ప్రవీణ్, రైతు సేవా కేంద్ర సిబ్బంది నాగసాయి హర్ష, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన ఆరుగురికి ఒక్కొక్కరికి రూ 10వేల జరిమానా

చిలకలూరిపేట, సెప్టెంబర్10, ప్రభాతవార్త: పట్టణంలో బాగా మద్యం తాగి ద్విచక్రవాహనాలు నడిపిన ఆరుగురుని పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకొని కోర్టుకు హాజరుపరిచారు. బుధవారం కేసు పూర్వాపరాలు విచారించిన మీదట స్థానిక ఎజిసిజె కోర్టు న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ10వేల వంతున ఆరుగురికి రూ60వేలు జరిమానా విధించారు. ఒకసారి జరిమానా కట్టినవారు మరలా మద్యం తాగి వాహనాలు నడిపి దొరికితో జైలు శిక్ష కూడా విధిస్తామని వారిని హెచ్చరించారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి :

### --శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వినోదుల నరసింహారావు




గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వాటిని నిర్మించి, నిర్వహించాలని శివసేన పార్టీ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక ్తలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వినోదుల నరసింహారావు మాట్లాడుతూ..విద ్య, వైద్యం ప్రభుత్వ రంగంలో ఉండాలన్నారు. ఇప్పటికే సాధారణ విద్యలో 50శాతానికి పైగా ప్రైవేటు పరమైందని, వైద్య విద్య పేద విద్యార్థులకు, వైద్య సేవలు పేదలకు అందుబాటులో లేవన్నారు. రాష్ట్రంలోఉన్న 10వైద్య కళాశాలలకు అదనంగా మరో 17 వైద్య కళాశాలలను కేంద్ర ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు. వీటిలో 10కళాశాలలను పిపిపి విధానంలో చేపట్టాలని ఇటీవల మంత్రివర్గం తీర్మానించడం సరైంది కాదన్నారు. దీనివల్ల వైద్య కళాశాలల్లో సీట్లు పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండవన్నారు. రాష్ట్ర యువసేన అధ్యక్షుడు జంపని వినయ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుప్రకాష్, కార్యదర్శి ఉల్లి దుర్గాప్రసాద్, పురుషోత్తమ్ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 39. 40 వార్డు సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ

గుంటూరు నగరపాలక సంస్థ , సెప్టెంబర్ 10, ప్రభాతవార్త: నగరంలోని వార్డ్ సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా సమయ పాలన పాటిస్తూ, కార్యాలయ పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీదనంతో ఉండాలని, విధుల్లో నిరక్ష ్యంగా ఉండే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ డి. శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గారి ఆదేశాల మేరకు నగరంలోని 39 మరియు 40 వార్డ్ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత సచివాలయంలోని హాజరు రిజిస్టర్లు తనిఖీ చేసి, పని వేళల్లో ఆఫీస్ పని మీద బయటకు వెళ్ళినప్పుడు కార్యదర్శులు తప్పనిసరిగా మూవ్మెంట్ రిజిస్టర్ లో నోట్ చేయాలన్నారు. సచివాలయంలో నిర్వహించాల్సిన రిజిస్టర్లను అసంపూర్తిగా నిర్వహించడం పై కార్యదర్శుల పై ఆగ్రహం వ్యక్తం చేసి, భవిష్యత్ లో సదరు రిజిస్టర్లను సరిగా నిర్వహించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 39వ సచివాలయంలో అడ్మిన్ మరియు ఎడ్యుకేషన్ కార్యదర్శులు లేకపోవుట గమనించి, సదరు సచివాలయంలో ఇంచార్జ్ అడ్మిన్ మరియు ఎడ్యుకేషన్ కార్యదర్శులను నియమించాలని మేనేజర్ ను ఆదేశించారు. సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రజల నుండి పిర్యాదులను అర్జీలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఇక నుండి వార్డ్ సచివాలయాలను ప్రతి రోజు ఆకస్మిక తనిఖీలు చేస్తామని, కార్యదర్శులు ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించకుంటే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ సర్వేలు లేదా ఇతర కార్యక్రమాలు ఉంటే తప్పనిసరిగా నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయాని ఆదేశించారు. సెలవులు తమ నోడల్ లేదా విభాగ అధికారి ద్వారా మంజూరు చేసుకోవాలన్నారు. కార్యదర్శులు స్థానిక సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికి సచివాలయం పరిధిలోనే చర్యలు తీసుకోవాలని, అప్పుడే సిబ్బంది స్థానికులకు సత్సంబంధాలు ఉంటాయన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రజల సర్వీస్ రిక్వెస్ట్ లు పెరగాలన్నారు. ప్రతి కార్యదర్శి తమ విభాగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

## స్వచ్ఛ వాయు సర్వేక్షన్లో గుంటూరు నగరానికి జాతీయస్థాయిలో 6వ ర్యాంక్

### గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు వెల్లడి

గుంటూరు నగరపాలక సంస్థ ప్రభాతవార్త : మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్.క్యాప్) చేపట్టిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ లో గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో 6వ ర్యాంక్ దక్కింది, దక్షి ణ భారతదేశంలో కేవలం




గుంటూరు నగరానికే ఈ అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మరియు కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ మాట్లాడుతూ కేంద్ర ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్ మరియు క్లైమేట్ చేంజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్.క్యాప్) చేపట్టిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ పోటీల్లో జాతీయ స్థాయిలో 130 నగరాలు పోటీ పడ్డాయని, అందులో 10 లక్షలలోపు జనాభా కేటగిరిలో గుంటూరు నగరానికి 6 వ ర్యాంక్ దక్కిందన్నారు. దక్షి ణ భారతదేశంలో ఈ అవార్డ్ ఒక్క గుంటూరు నగరానికే దక్కడం గర్వకారణమన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ మండలి 130 నగరాల్లో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అంశాల్లో పరిశీలించి, 202425 ఆర్థిక ఏడాదికి ఉత్తమ నగరాలను సిఫార్స్ చేసిందన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించుట జరిగిందని దాని వలన 6వ ర్యాంకుకు పరిమితం కావలసి వచ్చిందని, లేనిచో మరింత మంచి ర్యాంకు సాధించే వారమని తెలియజేశారు. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షన్ లో జాతీయస్థాయిలో సూపర్ సిటీగా అవార్డు సాధించడమైనదని తెలియజేశారు. గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో ర్యాంక్ రావడంలో నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల కృషి ఉందని, ఈ అవార్డ్ ద్వారా జాతీయ స్థాయిలో గుంటూరు ఖ్యాతి చాటడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి నగరపాలక సంస్థ తరుపున ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు.

## ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ నేత్రదాన దినోత్సవ కార్యక్రమం

గుంటూరు విద్య, ప్రభాతవార్త: నేత్రదానంతో అంధకారంలో ఉన్న జీవితాలకు వెలుగును ప్రసాదించవచ్చని కంటి శస్త్ర నిపుణులు డా. షఫీల పేర్కొన్నారు.స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో"అంతర్జాతీయ నేత్రదాన దినోత్సవం" సందర్భంగా కళాశాల ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు, అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యుల బృందం పాల్గొని విద్యార్థులకు నేత్ర సంబంధిత రుగ్మతలు, కంటి సంరక్షణ పద్ధతులు, ఆరోగ్యకరమైన అలవాట్లపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా డా.షఫీల మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువసేపు కంప్యూటర్లు, మొబైల్స్ వినియోగించడంతో అనేక కంటి సమస్యలు వస్తున్నాయని, ముఖ్యంగా పొల్యూషన్లను మొబైల్ స్క్రీన్ల ద్వారా కళ్ళకు కలిగే పుకుదల రూపంలో దరదవడం మందిని పేర్కొన్నారు. నేత్రదానం చేయడం ద్వారా మరణానంతరం కూడా జీవించి, ఈ లోకాన్ని రెండోసారి చూసే భాగ్యం పొందుతారని, నేత్రదానం మానవతా సేవలో గొప్పదైన దానం అని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ ,కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా: కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి.శ్రీనివాస రావు, కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్స్ కోఆర్డినేటర్లు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు

## కొల్లా వెంకయ్య 27వ వర్థంతి సందర్భంగా విద్యార్థులకు పోటీలు

పెదనందిపాడు సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త) : కొల్లా వెంకయ్య 27 వ వర్ధంతి పురస్కరించుకొని ఈనెల 12. 15. 16 తేదీలలో మూడు రోజులపాటు పెదనందిపాడు కామ్రేడ్ కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో విద్యార్థులకు పలు రకాల పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు కొల్లా రామన్ బుధవారం తెలిపారు. 12వ తేదీన వివాహాలలో మత వేడుకలలో మితిమీరిన ఖర్చులు పెట్టడం అవసరమా అనే అంశంపై వ్యాసరచన పోటీ. 15వ తేదీన 8.9. 10. తరగతుల విద్యార్థులకు టీంకు ముగ్గురు చొప్పున క్విజ్ పోటీలు. 16వ తేదీన ప్లాస్టిక్ తో ప్రమాదం ఏమిటి. ప్లాస్టిక్ వాడకం ఎలా ఆపాలి అనే అంశంపై డిబేట్. మధ్యాహ్నం మూడు గంటల నుండి శ్రీ శ్రీ గేయాల పోటీలు నిర్వహిస్తున్నామని. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు 17వ తేదీన నిర్వహించనున్న కామ్రేడ్ కొల్లా వెంకయ్య వర్థంతి సభలో బహుమతులు అందించడం జరుగుతుందని రామన్ తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలి అన్నారు.



## వరగాని. అబ్బినేనిగుంటపాలెంలో పొలం పిలుస్తోంది

పెదనందిపాడు సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త). అబ్బినేనిగుంటపాలెం వరగాని గ్రామాలలో బుధవారం మండల వ్యవసాయ అధికారి ఐ. సుబ్రహ్మణ్యం పొలం పిలుస్తుంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రత్తి వేసిన పొలాలను సందర్శించి రసం పీల్చే పురుగులను గుర్తించారు. వాటి నివారణకు మోనోక్రోటోఫాస్ లీటర్ నీటికి రెండు మిల్లీమీటర్ల వంతున లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు.రైతులు నానో యూరియాని అర లీటర్ ని ఒక ఎకరానికి స్ప్రే చేసుకున్నట్లయితే మొక్క పెరుగుదల బాగా వస్తుందని . రైతులందరూ కేవలం రసాయన ఎరువుల మీద ఆధారపడకుండా నానో డిఏపి నానో యూరియా బయో ఫెర్టిలైజర్స్ లను వాడాలన్నారు. అనంతరం వరగాని రైతులకు మినీ కిట్స్ లు అందజేశారు.

## పెదనందిపాడు కళాశాలను సందర్శించిన ఆర్.ఐ.ఓ, జి.సునీత

పెదనందిపాడు సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త): గుంటూరు రీజనల్ ఇన్స్పెక్షన్ ఆఫీసర్ జి.సునీత బుధవారం పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించిన రికార్డులను , క్లాస్ రూమ్స్, ఇంటర్మీడియట్ ల్యాబ్స్ మరియు పరీక్షల నిర్వహించే రూములలోని సీ.సీ కెమెరాలను, సీటింగ్ సామర్థ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీర రాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ కె ప్రతాప్ కుమార్, ఎన్.సి.సి ఆఫీసర్ డాక్టర్ పి. శ్రీనివాస్, అధ్యాపకులు గీతాలక్ష్మి ఆర్.ఐ.ఓ సునీతకు కళాశాలలోని వసతుల గురించి వివరించారు.



## డ్రోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బూర్ల

ప్రత్తిపాడు సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త): స్థానిక శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు కార్యాలయంలో నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు మండల పరిధిలోని కోయవారిపాలెం మరియు గొట్టిపాడు రైతులకు గ్రామానికి ఒక్కొక్కటి చొప్పున రెండు డ్రోన్లను ఎమ్మెల్యే బూర్ల చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎన్.మోహన్ రావు ఏ.డి.ఏ ప్రత్తిపాడు రైతులు గురించి మాట్లాడుతూ యూరియా గురించి ఏ రైతు ఆందోళన చెందనవసరం లేదని కావలసిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. షేక్. సుగుణ బేగం ఏ.ఓ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రత్తి పంటను ఆశించు రసం పీల్చే పురుగుల నివారణకు ఎకరానికి ఒక్క లీటర్ నీటికి 5 ఎం.ఎల్ వేప నూనెను కలిపి పిచికారి చెయ్యాలి.గులాబీ రంగు పురుగు నివారణ కోసం ఆకర్షణబుట్టలను ఎకరానికి 8 నుంచి 10 బుట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోని దాని ఉధ్రిక్తను గమనించుకుంటూ ఉండాలి.ప్రత్తి పంటలో పెనుబంక ఎక్కువ ఉంటే ఒక లీటరు లీటరు నీటిలో ఎసిఫేట్ 1.5 గ్రాము కలపాలి అని తెలియచేశారు.





# బాపట్ల జిల్లా వార్త

## డిప్యూటీసిఎం పవన్ కళ్యాణ్ జిల్లా పర్యటన నేపథ్యంలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించిన జిల్లా ఎస్పీ

బాపట్ల,సెప్టెంబర్10,ప్రభాతవార్త: ా బందోబస్తు విధుల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది సంయమనంతో వ్యవహరిస్తూ, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశించారు.గురువారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణ-అటవీ శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి కె. పవన్ కళ్యాణ్



బాపట్ల జిల్లా అడివిపాలెం పంచాయతీ పరిధిలో పర్యటించనున్న నేపథ్యంలో, బందోబస్తు విధులు నిర్వహించనున్న పోలీస్ అధికారులకు మరియు సిబ్బందికి నగరవనంలో బుధవారం జిల్లా ఎస్పీ బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బాపట్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ప్రదేశాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హెలిప్యాడ్, కాన్వాయ్, రోప్ పార్టీలు, చెకింగ్ పాయింట్లు, ట్రాఫిక్ మళ్లింపు ప్రదేశాలు, తాటి మొక్క నాటే ప్రదేశం, నగరవనంలోని అమరవీరుల స్మారక స్థూపం, అమరవీరుల కుటుంబాలతో సమావేశం జరిగే ప్రదేశం తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ాఫిక్, వాహనాల పార్కింగ్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అందరూ సమయపాలన పాటిస్తూ, కేటాయించిన ప్రదేశాల్లో సంయమనంతో, సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తినపుడు వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డీఎస్పీ ఎం.డి.మోయిన్, ఎస్.బి ఇన్స్పెక్టర్ జి.నారాయణ, బందోబస్తు విధులకు హాజరైన పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లా సమాచార శాఖ ఏ డి గా పి.వెంకరమణ



బాపట్ల,సెప్టెంబర్10,ప్రభాతవార్త: బాపట్ల జిల్లా సమాచార పౌర సంబందాల అసిస్టెంట్ డైరెక్టర్గా పి.వెంకటరమణ బుధవారం బాద్యతలు చెపట్టారు.అనంతపురం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ నందు డి పి ఆర్ ఓ గా విదులు నిర్వహిస్తున్న పి.వెంకరమణ కు అసిస్టెంట్ డైరెక్టర్ గా పదోన్నతి కల్పించి బాపట్ల జిల్లాకు నియమిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల,ఐ. ఏ.ఎస్ ఉత్తర్వులు జారీచేయడం జరిగింది.బాధత్యలు చెపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ వెంకట మురళి గారిని మర్యాద పూర్వకంగా కలసి పూల బొకె అందజేశారు.

## నూరుశాతం పంట నమోదు చేయించుకోవాలి

పొన్నూరు, సెప్టెంబరు 10,ప్రభాతవార్త: రైతులు తప్పనిసరిగా తాము వేసిన పంటను ఈ పంట యాప్లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు కోరారు. మండల పరిధిలోని ఉప్పరపాలెం, సీతారామపురం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు.



రైతులు సేంద్రియ ఎరువులపై మక్కువ ఎక్కువ చూపాలని, తద్వారా పంట దిగుబడితోపాటు నాణ్యమైన ఉత్పత్తులను పొందవచ్చన్నారు. ఈ నెలాఖరుకు పంట నమోదు కార్యక్రమం ముగుస్తున్నందున రైతులందరూ మీ దగ్గరలోని రైతు సేవా కేంద్రానికి వెళ్ళి సంబంధిత పత్రాలు అందజేసి ఈ పంట నమోదుతోపాటు ఈకెవైసీ కూడా చేయించుకోవాలన్నారు. రైతులు పంట రుణాలు పొందాలన్నా ఈ పంట ద్వారానే బ్యాంకుల ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు బి.ప్రీతి, బి.శివ, తేజస్విని, ఎంపిఈఓ ఎస్.సురేష్బాబు, రైతులు పాల్గొన్నారు.

## ఓటమి భయంతోనో రాహుల్పై బిజెపి దాడులు

పొన్నూరు, సెప్టెంబరు 10,ప్రభాతవార్త: ఓటమి భయంతోనే రాహుల్పై భారతీయ జనతాపార్టీ వరుస దాడులకు పాల్పడుతుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బీహార్ ఎన్నికల్లో బిజెపి అక్రమాలను ఎత్తిచూపి, ఎన్నికల కమిషన్, బిజెపి అనైతిక



పొత్తుపై రాజీలేని పోరాటం చేస్తుండడంతో బిజెపికి ఓటమి భయం పట్టుకొందన్నారు. దీంతో రాహుల్పై వరుస దాడులకు దెగబడుతుందన్నారు. ఉత్తరప్రదేశ్లోని రాయబరేలి పార్లమెంట్లో రాహుల్, రాహుల్ కాన్వాయ్పై బిజెపి చేసిన అప్రజాస్వామిక దాడిని ఖండిస్తున్నట్లు చెప్పారు. బీహార్లో జరిగిన ఓటరు అధికార ర్యాలీలు ఆ రాష్ట్రంలో బిజెపి కూటమి గెలుపు ఆశలపై నీళ్ళు చల్లాయని, ఓటమి భయంతోనే ప్రతిపక్ష నాయకులపై భౌతిక దాడులకు తెగబడుతున్నారని చెప్పారు.బిజెపి రాష్ట్ర మంత్రి దినేష్ ప్రతాప్సింగ్, అతని అనుచరులు రాహుల్ను అడ్డగించడం అప్రజాస్వామికమన్నారు. ఉత్తరప్రదేశ్లో బుల్డోజర్ పాలనలో ప్రజాస్వామ్యం, శాంతిభద్రతల దైన్యానికి నిదర్శనమన్నారు.

## యూరియాపై ఆందోళన వద్దు

పొన్నూరు, సెప్టెంబరు 10,ప్రభాతవార్త: యూరియా దొరుకుతుందో....దొరకదోననే ఆందోళన వద్దని.....రైతులందరికీ అవసరమైన ఎరువులు అందించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు చెప్పారు. మండల పరిధిలోని ఉప్పరపాలెం, సీతారామపురం గ్రామాల్లో యూరియా మీ చెంతకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ




సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలానికి 580మెట్రిక్ టన్నుల యూరియా కోసం ఇండెంట్ పెట్టడం జరిగిందన్నారు. రైతు సేవా కేంద్రాలకు, సొసైటీలకు, జీడీసీఎమ్మెస్ నిడుబ్రోలుకు విడతవారీగా ఎరువులు వస్తాయన్నారు. ఈ ఖరీఫ్ సీజన్కు, రాబోయే రబీ సీజన్కు కూడా ఇండెంట్లు పెట్టామన్నారు. ప్రతి రైతుకు అవసరమైన ఎరువులను అందిస్తామన్నారు. ఈ పంట నమోదులో ఎంత పొలాన్ని అయితే నమోదు చేసుకొన్నారు. అంతే పొలానికి యూరియాను సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్కు అవసరమైన యూరియాను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. రెండవ విడతగా 20-20-0-13కానీ, 10-26-26 కొనుగోలు చేసి వాడుకోవాలని రైతులకు సూచించారు. వీటిలో కూడా యూరియా ద్వారా లభించే నత్రజని ఉంటుందన్నారు. వీటిలో పొటాష్ కూడా ఉండడం వల్ల పంటకు రోగ నిరోధకశక్తి పెరిగి పురుగు, తెగుళ్ళను తట్టుకొని మంచి దిగుబడులు వస్తాయన్నారు. యూరియా మీ చెంతకు ర్యాలీలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు ప్రీతి, శివ, తేజస్విని, ఎంపిఈఓ ఎస్.సురేష్బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్


కొల్లిపర,సెప్టెంబరు 10 ప్రభాతవార్త: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ లబిస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ సునీత



అన్నారు.బుధవారం మండల పరిధిలోని మున్నంగిలో ప్రకృతి వ్యవసాయ ఆద్వర్యంలో వ్యవసాయాధికారులు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సునీత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు.ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ రైతులు ప్రకృతిపరమైన కషాయాలు తయారు చేసుకుని వాటి ద్వారా పంటలు పండిస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు.సమావేశంలో సర్పంచ్ వేమూరు దీనమ్మ,ప్రకృతి వ్యవసాయ అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సత్యన్నారాయణ,మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్డుదారుల నుండి పిర్యాదులు రాకుండా చూచుకోవాలి

కొల్లిపర,సెప్టెంబరు 10 ప్రభాతవార్త: డీలర్లు రేషన్ పంపిణీలో కార్డుదారుల నుండి ఎటువంటి పిర్యాదులు రాకుండా చూచుకోవాలని తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్ధ అన్నారు.బుధవారం మండల



కేంద్రం కొల్లిపరలో రేషన్షాపులను ఆయన తనిఖీ చేసి డీలర్లకు తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా సిద్ధార్ధ మాట్లాడుతూ బియ్యం,పంచదార వంటి నిత్యవసర సరుకులను రేషన్కార్డుదారులు డీలర్ల వద్దనే తీసుకోవాలన్నారు.తనిఖీలో ఆర్ఐ వంశీకృష్ణ,వీఆర్ఓ భాస్కరరావు,తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమం రిజిస్ట్రేషన్ చేసుకుంటే ప్రభుత్వాలు ప్రాధాన్యత



కొల్లిపర,సెప్టెంబరు 10 ప్రభాతవార్త: ఉద్యమం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు.బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యమం రిజిస్ట్రేషన్ ప్రకియను అధికారులు ప్రారంభించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాతూ ఉద్యమం రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎలాంటి రుసుము చెల్లించాల్సి న అవసరం లేదన్నారు. పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి,డిప్యూటి ఎంపిడీఓ భార్గవ్,ఏపీఎం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశాలల ఏర్పాటుకు రూ.8.65కోట్లు మంజూరు

### =ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



పొన్నూరు, సెప్టెంబరు 10,ప్రభాతవార్త: నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం నూతన వైద్యశాలల ఏర్పాటుకు, అభివృద్ధికి రూ.8.65కోట్లు నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చెప్పారు. నియోజకవర్గంలో 13నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.7.15కోట్లు, మరో ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మత్తులకు రూ.1.50కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. నిరుపేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో వైద్యం అత్యంత ఖరీదై పేద ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. గతంలో టిడిపి హయాంలో వైద్యశాల నిర్మించి పేదలకు వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ గత పాలకుల అనాలోచిత నిర్ణయాలు నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు వైద్యం అందుబాటులో లేకుండా పోయిందన్నారు.

**నియోజకవర్గంలో నూతనంగా 13ఆరోగ్య కేంద్రాలు:**

నియోజకవర్గంలో నూతనంగా 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) నిర్మాణాలు. పెదకాకాని మండలంలో పెదకాకాని-1, చేబ్రోలు మండలంలో చేబ్రోలు-2,3, మంచాల, నారాకోడూరులలో ఒక్కోటి, శ్రీరంగపురం, సుద్దపల్లి, వడ్లమూడి, పొన్నూరు మండలంలో ఆరెమండ, బ్రాహ్మణకోడూరు, నండూరు, పచ్చలతాడిపర్రుగ్రామాల్లో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణానికి రూ.7.15కోట్లు మంజూరు అయ్యాయన్నారు. నియోజకవర్గంలో పెదకాకాని మండలంలో నంబూరు,పెదకాకాని, చేబ్రోలు మండలంలో చేబ్రోలు, శలపాడు, పొన్నూరు మండలంలో దొప్పలపూడి, ములుకుదురు గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మత్తులకు, అభివృద్ధికి రూ.1.50కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ చెప్పారు.

## ప్రజల హృదయాలను గెలిచిన నాయకుడు ఆనందబాబు

పొన్నూరు, సెప్టెంబరు 10,ప్రభాతవార్త: ప్రజల హృదయాలను గెలిచిన నాయకుడు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అని జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా అన్నారు. చేబ్రోలు మండలంలోని హార్వెస్ట్ ఇండియా క్యాంపస్లో కెఎస్కెటీం ఆధ్వర్యంలో నక్కా ఆనందబాబు



జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్పర్సన్ హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడి వారి అభ్యున్నతికి, అభివృద్ధికి కృషి చేసిన ఘనత ఆనందబాబుకే దక్కుతుందన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరి అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత ఆందనబాబుదేనన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఎమ్మెల్యేగా కొనసాగుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. అనంతరం జన్మదినోత్సవ కేక్ కట్ చేసి ఆనందబాబుకు జడ్పీ ఛైర్పర్సన్ తినిపించారు. సుద్దపల్లి నాగరాజు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో నలుకుర్తి రమేష్, అత్తోట శరత్, తాడిబోయిన హరిప్రసాద్, శాఖమూరి నారాయణప్రసాద్, కుర్రా లక్ష్మీనారాయణ, ఆనే రవీంద్ర, రావూరి సతీష్, కొలకలూరి కిరణ్, అంజి, సునీల్, పాల్, చందు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## రాధాకృష్ణన్ గెలుపు పట్ల బిజెపి హర్షం వ్యక్తం

పొన్నూరు, సెప్టెంబరు 10,ప్రభాతవార్త: 17వ ఉప రాష్ట్రపతిగా ఎన్డియే అభ్యర్థి రాధాకృష్ణన్ గెలుపు పట్ల స్థానిక బిజెపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా స్థానిక జిల్లా కార్యదర్శి కలపాల శ్రీనివాసరావు వాటర్ ప్లాంట్ వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా



శ్రీనివాసరావు మాట్లాడుతూ రాధాకృష్ణన్కు 452ఓట్లు పోలవగా, ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్రెడ్డికి కేవలం 300ఓట్లు మాత్రమే వచ్చాయన్నారు. దీంతో ఎన్డియే అభ్యర్థి రాధాకృష్ణన్ 152ఓట్ల మెజార్టీతో గెలుపొందారన్నారు. ఈ గెలుపు బిజెపిపై ఉన్న నమ్మకాన్ని చాటుతుందన్నారు. ఇండియా కూటమి నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఓటమి పాలవక తప్పలదేన్నారు. రాధాకృష్ణన్ గెలుపు బిజెపిపై మరింత విశ్వాసాన్ని పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో గోవాడ వెంకటకృష్ణారావు, తోట జనార్ధనరావు, తన్నీరు హరివెంకట శివరామకృష్ణ, గుడివాడ పవన్, గురుబాలు, కె.సాంబశివరావు, దాసరి శ్రీనివాస్, అంబటి రాంబాబు, భట్టిప్రోలు రామకృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు మిశ్రమ ఎరువులపై దృష్టి సారించాలి

పొన్నూరు, సెప్టెంబరు 10,ప్రభాతవార్త: రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి మిశ్రమ ఎరువులపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని



సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని గొడవర్రు,గుండవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ మిశ్రమ ఎరువుల వాడకం ద్వారా మొక్కకి అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఒకే ఎరువులో మొక్కకి అందుతాయన్నారు. నానో యూరియా, డిఎపి కూడా వాడాలని సూచించారు. ప్రతి రైతు వేసిన పంటను ఈ పంట యాప్లో నమోదు చేయించుకోవాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా, సొసైటీల ద్వారా పొందవచ్చన్నారు. ఖరీఫ్ సీజన్కు అవసరమైన ఎరువులను మాత్రమే రైతులు తీసుకెళ్ళాలని సూచించారు. ఎరువుల కొరత లేదన్న విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు. వరిలో వచ్చే తెగుళ్ళపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె నోటీసు ఇచ్చిన సచివాలయ ఉద్యోగులు

పొన్నూరు, సెప్టెంబరు 10,ప్రభాతవార్త: గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ సచివాలయ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో బుధవారం ఇన్చార్జి ఎంపిడిఓ మల్లికార్జునరావుకు సమ్మె నోటీసు ఇచ్చారు. 15రోజుల ముందస్తుగా సమ్మె నోటీసు ఇచ్చినట్లు ఉద్యోగులు చెప్పారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రమోషన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. పి4 విధానంలో క్లస్టర్ మ్యాపింగ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెనోటీసు అందజేసినవారిలో కె.వరకుమార్, షోయబ్ఖాన్, షేక్ బాజీద్బీ, వెంకటేశ్వర్లు, ఆసిఫ్, గోపి తదితరులున్నారు.



## 13న లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోండి



పొన్నూరు, సెప్టెంబరు 10,ప్రభాతవార్త: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ను అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, స్థానిక కోర్టు (పూర్తి అదనపు బాధ్యతలు) న్యాయమూర్తి పవన్కుమార్ ఏకా కోరారు. పొన్నూరు కోర్టు పరిధిలోని కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్బౌన్స్ కేసులు, మనోవర్తి,కుటుంబ తగాదాలు, ప్రీలిటిగేషన్ కేసులు, బ్యాంకు కేసులు తదితర కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. 13వతేదీ రెండవ శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్లో కక్షిదారులు, న్యాయవాదులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, తద్వారా పరిష్కార మార్గాలను సుగమం చేసుకోవచ్చని జడ్జి పవన్కుమార్ ఏకా సూచించారు.


## వి.జె కళాశాల అధ్యాపకునికి పిహెచ్డి

మంగళగిరి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త: వి.జె కళాశాల జంతు శాస్త్ర అధ్యాపకులు బి.వి.ఎల్ ఆరాధ్య శర్మ కు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పి.హెచ్.డి పొందినట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ప్రెగడ రాజశేఖర్ తెలిపారు.బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన



అభినందన సభలో కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ రాజశేఖర్ మాట్లాడుతూ ముగిల్ సెఫాలస్ యొక్క జీవశాస్త్రం, కెమికల్ పరిశీలనలను కృష్ణా ఎస్ట్యూరీ నుంచి ముల్లెట్ ఫిషరీపై పరిశోధనలు చేసి ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని జంతు శాస్త్రం, ఆక్వాకల్చర్ విభాగం ప్రొఫెసర్ పి.వి. కృష్ణ మార్గదర్శకత్వంలో ఈ పరిశోధన పూర్తిచేసి డాక్టరేట్ పొందినట్లు తెలిపారు.హెల్త్ ఆప్టిమైజేషన్ కోసం వలస సమయంలో హిల్సాలో పోషక , ఫాటీయాసిడ్స విశ్లేషించే పద్ధతిపై పేటెంట్ పొందిన నలుగురిలో ఒకరు ఆరాధ్య శర్మ అని రాజశేఖర్ చెప్పారు.ఈ సందర్భంగా పిహెచ్డీ పొందిన డాక్టర్ ఆరాధ్య శర్మను మేనేజ్మెంట్ , సహచర అధ్యాపకులు శాలువా పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించారు.

## పెదవడ్లపూడి లో రూ.4,50,000 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత..



మంగళగిరి సెప్టెంబర్ 10, ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న పెద్ద వడ్లపూడి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ హెప్సీబా కు మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4,50,000/ విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ వో సి) చెక్కును గురువారం బాధితురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా తమకు ఎల్ఓసి చెక్కు రావడానికి కృషిచేసిన మంత్రి నారా లోకేష్ కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చెక్కును అందజేసిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు మాదల రమేష్ బాబు, జొన్నలగడ్డ రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు

నోట్ శీర్షిక:

## వివేకానంద సేవాశ్రమంలో బాలవికాస విజ్ఞాన కేంద్రం

మాచర్ల, సెప్టెంబరు 10 ప్రభాతవార్త: స్థానిక స్వామి వివేకానంద సేవాశ్రమంలో స్వామి వివేకానంద బాలవికాష్ విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించినట్లు రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాచర్ల ఎంపీడీ అల్లి సురేష్, మాజీ డిప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణలు పాల్గొని ప్రసంగించారు. స్వామి వివేకానంద, మదర్ థెరిస్సా స్ఫూర్తితో మెట్టు గోవిందరెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు సమాజానికి హితవు పలుకుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఉచితంగా ట్యూషన్, భోజనం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కష్టంగా ఉన్న సబ్జెక్టులను వారానికి ఒకసారి వచ్చి బోధిస్తామని అతిథులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అన్న స్వామి వివేకానంద స్ఫూర్తితో, నవభారత నిర్మాణానికి నాంది పలికే ఉద్దేశంతో విద్యార్థులకు ఉచిత విద్య, విద్యతోపాటు భోజన వసతులు కూడా ప్రవేశపెట్టామన్నారు. విద్యార్థులు స్కూలు అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఉచిత ట్యూషన్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440006813, 9346162835 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.



## పట్టణ పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు : మున్సిపల్ కమిషనర్

మాచర్ల, సెప్టెంబరు 10 ప్రభాతవార్త: మున్సిపల్ ఛైర్మన్ ఆదేశాల మేరకు మాచర్ల పురపాలక సంఘ పరిధిలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా 50 రోజుల్లో అన్ని వార్డుల్లో మురుగు కాలువల్లో పూడిక తొలగించేందుకు 17 మంది అదనపు సిబ్బందిని నియమించి కాలువల్లో మురుగు నిలువకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కస్తూరిబా బాలికల పాఠశాల పరిసరాల్లో ముళ్లపొదలు పెరిగి విషసర్పాలు తిరుగుతున్నాయని ప్రిన్సిపల్ వినతిపత్రం అందజేశారు. స్పందించిన మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్ తక్షణమే జేసీబీ సహాయంతో ముళ్లపొదలను తొలగించి బ్లీచింగ్ చేశారు. దీంతో పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. పాఠశాల హెచ్ఎం, టీచర్లు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.



## సచివాలయాల కమిటీ నూతన కార్యవర్గం ఎంపిక

మాచర్ల, సెప్టెంబరు 10 ప్రభాతవార్త: గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఐక్యవేదికలో భాగంగా మాచర్ల మున్సిపాలిటీ పరిధిలోని 16 సచివాలయాల సభ్యులు నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. మహమ్మద్ రఫీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిటీ ప్రెసిడెంట్‌గా బాలశౌరి, వైస్ ప్రెసిడెంట్‌గా గడ్డం వెంకట్రావు, జనరల్ కార్యదర్శిగా గంగవరపు సుభాష్ చంద్రబోస్, ట్రెజరీగా సెల్వమణి, జాయింట్ సెక్రటరీలుగా మాచర్ల నిర్మల, రామిరెడ్డి, నందిగం సునీల్, పద్మలత, రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మహేష్, మహమ్మద్ రఫీ, పవన్‌కుమార్, చంద్ర శ్రీనివాస్, లిల్లీ పుష్పం, నాగమణి, సూరిబాబులను ఎన్నుకున్నారు. నోషనల్ ఇంక్రిమెంట్‌కు, క్లస్టర్ మ్యాపింగ్ విధానాన్ని రద్దు చేయడానికి, ప్రమోషనల్ ఛానల్ ఏర్పాటుకు కృషి చేస్తామని అధ్యక్షులు బాలశౌరి, కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



## వాగ్దానఫలం కోసం ఎదురు చూడాలి: రెవరెండ్ పాల్ డేవిడ్

మాచర్ల, సెప్టెంబరు 10 ప్రభాతవార్త: దైవజనుడు పరిచర్యలో దైవిక విధానాల ఫలం కోసం ఎదురు చూడాలని అప్పుడే శ్రేష్టమైన దీవెనలు పొందగలరని రెవరెండ్ పాల్ డేవిడ్ అన్నారు. స్థానిక సుద్దగుంతల కాలనీలో ఏజీ ఇమ్మానుయేలు ప్రార్థనా మందిరం వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన పాస్టర్ల సమావేశంలో అంతర్జాతీయ సేవకుడు రెవరెండ్ పాల్‌డేవిడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పరిచర్యలో శ్రమలు వచ్చినప్పుడు నమ్మకంగా దేవుని వైపు చూస్తూ, వాగ్దానాల నెరవేర్పు కోసం కనిపెట్టాలని సేవకులకు పిలుపునిచ్చారు. మాచర్లలో రెండు దశాబ్దాలకుపైగా పరిచర్య చేస్తున్న స్థానిక సంఘ పాస్టర్ ఎన్ఆర్ ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా చర్చి ఆవరణలో రెండు రోజుల సువార్త కూటములు, నియోజకవర్గంలోని పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దైవ సేవకుల సంఘం కార్యదర్శి మోహన్ అధ్యక్షత వహించారు. సహవాసానికి చెందిన పలువురు క్రైస్తవ సంఘ నాయకులు, స్థానిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## విద్యుత్తు షాక్‌కు గురై కాంట్రాక్టు కూలీ మృతి

మాచర్ల, సెప్టెంబరు 10 ప్రభాతవార్త: మాచర్ల మండలం జమ్మలమడక గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్తు లైన్ల పనుల కోసం కాంట్రాక్టర్ తరఫున వచ్చిన కూలీ స్తంభంపై పనిచేస్తుండగా విద్యుత్తు షాక్ తగిలి స్తంభం పైనుంచి కింద పడి మృతి చెందాడు. జమ్మలమడక గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా 24 గంటల విద్యుత్తు సరఫరా కోసం నూతన లైన్లు ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. సబ్ కాంట్రాక్టర్ ఈ ప్రాంతంలో పనులు చేయిస్తున్నాడు. సబ్‌కాంట్రాక్టరు కింద కూలీ పనులకు వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన ముప్పవరపు సురేష్ (27) స్తంభంపై పనిచేస్తుండగా విద్యుత్తు షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సురేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆసుపత్రి వద్ద బాధితుల రోదనలు మిన్నంటాయి. సురేష్ కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## ఏపీఆర్‌డీసీలో జీవన ప్రమాణాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం

విజయపురిసౌత్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త: స్థానిక ఆంధ్రప్రదేశ్ గురుకుల డిగ్రీ కళాశాలలో జీవన నైపుణ్యాలపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం జరిగినట్లు ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపల్ నయీంభాను తెలిపారు. 9, 10వ తేదీన జరిగిన శిక్షణ కార్యక్రమంలో మొదటి రోజున ఏపీఎస్‌సీఆర్‌టీ కరిక్యులమ్ కమిటీ మెంబర్ డా॥ సి.ఎ.ప్రసాద్ విద్యార్థులకు జీవితంలో ఎదురయ్యే అనేక దశల్లో ఎదుర్కొనే పరిస్థితుల్లో స్థిరంగా ఉండాలని, కళాశాలల ఉన్న గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాహిత్యాభిలాషులుగా ఉండి సమాజ హితానికి పాటుపడాలని, స్ఫూర్తివంతమైన కథలతో విద్యార్థులకు తగిన సూచనలు అందించారు. రెండోరోజు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కె.ప్రభాకర్ మట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలైన సమానత్వం, సౌభ్రాతృత్వం కలిగి ఉండాలని, ఉన్నత విద్యావంతులుగా తయారవ్వాలన్నారు. చదువొక్కటే జీవితాలను మార్చగలదని విద్యార్థులకు స్ఫూర్తిసందేశాన్ని అందించారు. తెలంగాణ జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.కొండలరెడ్డి విద్యార్థులకు ప్రత్యక్షంగా కొన్ని ప్రయోగాలను చూపించి విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పించారు. కిరణ్మయి కాళోజీ కవితను వినిపించి కాళోజీ సాహిత్యాన్ని చదవాలని విద్యార్థులకు సూచించారు. పాండురంగారావు (మట్టి ప్రచురణలు) రాజ్యాంగ పీఠికను అందరిచేత చదివించారు. ఈ శిక్షణను ప్రిన్సిపల్ డా॥ నయీంభాను, ఐక్యూఏసీ ఇన్‌ఛార్జి డా॥ ఎస్‌కే మహమ్మద్ బాషా పర్యవేక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.



## ఖురాన్ షరీఫ్ గ్రంథాన్ని పూర్తి చేసిన షేక్ ముబాషీర్

కారంపూడి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త: పట్టణంలోని మర్కస్ మజీద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మదరసాలో షేక్ ముబాషిర్ విద్యార్థి మూడు సంవత్సరాల 8 నెలల 10 రోజుల సమయంలో ఖురాన్ షరీఫ్ గ్రంథాన్ని చూడకుండా చదవడం పూర్తి చేశారు. ఈ సందర్భంగా మౌలానా ఖలీల్ మాట్లాడుతూ మదరసాలోని ముబాషీర్ ఖురాన్ షరీఫ్ గ్రంథాన్ని పూర్తి చేయడం చాలా సంతోషకరమన్నారు. ఈ మదరసా అయిదుగురు విద్యార్థులతో మొదలై ఇప్పుడు 40 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. పట్టణంలోని ముస్లిం సోదరులు, పలు ప్రాంతాల ముస్లిం సోదరుల సహాయంతో ఈ మదరసా నడుస్తుందన్నారు. అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ఖురాన్ షరీఫ్ గ్రంథాన్ని పూర్తి చేసిన ముబాషీర్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ బుడేసా, ఉపాధ్యక్షులు షేక్ మోదిన్‌సా (అయ్యా) మాట్లాడుతూ మదరసా కోసం అంజుమన్ కమిటీ విద్యార్థులకు తోడుగా ఉంటామని తెలిపారు. ఖురాన్ షరీఫ్ గ్రంథాన్ని చూడకుండా చదవడం చాలా గొప్ప విషయమని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గురువులకు, మదరసాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సయ్యద్ అహ్మద్, షేక్ సాధిక్, షేక్ జానీబాషా, రుస్తుందార్ సలీం, షేక్ జానీ (కంప్యూటర్), సైదా (సీపీఐ) షేక్ భాష, హఫీజ్ షాహిద్, షేక్ బుజ్జి, షేక్ జానీ (బీరువాలు), షేక్ జిలానీ, షేక్ నసురుద్దీన్, షేక్ రసూల్‌జానీ తదితర అంజుమన్ కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## సూపర్ సిక్స్...సూపర్ హిట్ సభ విజయవంతం : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : సూపర్ సిక్స్...సూపర్ హిట్ సభ విజయవంతమైందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. అనంతపురంలో నిర్వహించిన సభ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌తో పాటు కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు వందల మంది పాల్గొన్నారని, లక్షల మంది కార్యకర్తలు, ప్రజలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగిందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలు అమలు చేయడంతో అన్నివర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.



## విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలనతో గొప్ప విజయాలు అందుతాయి : ఎస్పీ

నరసరావుపేట క్రైం, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలనతో గొప్ప విజయాలు అందుతాయని ఎస్పీ కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎస్ఎస్ఎన్ కళాశాలలో చదువులో ప్రతిభ చూపి పోలీస్‌శాఖలో 14 మంది, ఆర్మీలో ఇద్దరు ఉద్యోగాలు సాధించినందుకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా, ఎన్‌సిసి మేజర్ బి.ఎస్.రామకృష్ణరాజు, హవల్దార్ షంషేర్‌సింగ్, ప్రిన్సిపాల్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ సాయి పాల్గొన్నారు. ఎన్‌సిసి క్యాడెట్స్ గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం వృత్తి కాదని ప్రజా సేవకు అంకితమైన జీవితం అన్నారు. క్రమశిక్షణ, పారదర్శకత, నిజాయితీ ఉండాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.



## డ్రోన్ సర్వీస్, స్పేర్ పార్ట్స్ కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా వ్యవసాయ అధికారి

నరసరావుపేట, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : నరసరావుపేటలో ఇలా అగ్రి సర్వీస్ వారి దక్ష ఆథరైజ్డ్ డ్రోన్ సర్వీస్, స్పేర్ పార్ట్స్ కేంద్రాన్ని బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ కలిగిన రైతులు, డ్రోన్ ఆపరేటర్స్ ఎటువంటి ఇబ్బందులు లేకుండా మరమ్మత్తులు, స్పేర్స్ సమీపంలో ఉండటం సంతోషమన్నారు. ప్రాజెక్ట్ మేనేజర్ శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్నిరకాల డ్రోన్ల మరమ్మత్తులను 12-24 గంటల్లోపు చేయడం జరుగుతుందన్నారు. నాణ్యమైన స్పేర్స్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో గోపాలకృష్ణన్, సేవాధిపతి, బి.ఎల్.రాజు, ఏఈవో బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## సిఎం చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలను ఖండించిన కొమ్మాలపాటి

నరసరావుపేట, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖామంత్రి అచ్చెన్నాయుడుపై వైకాపా అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైకాపాను ప్రజలు భూస్థాపితం చేశారని గుర్తు చేశారు. మద్యం కుంభకోణం నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు రైతుల ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. నల్లధనం, నల్ల మార్కెట్, అక్రమాలు, వేధింపులు వైఎస్సార్‌సీపీ పేటెంట్ హక్కులు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లేకుండా పోవాలనడం దారుణమన్నారు. తన వ్యాఖ్యలను జగన్ వెనక్కి తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని కొమ్మాలపాటి శ్రీధర్ డిమాండ్ చేశారు.



## ఐడిపిఎస్‌లో విద్యార్థులకు నాయకత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం విద్యార్థుల నాయకత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఛైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. విద్యార్థులలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులను సమగ్రంగా తీర్చి దిద్దేందుకు, నాయకత్వ సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నాగోతు సబిత, ప్రిన్సిపాల్ రేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.




## పుట్టపర్తి సత్యసాయి ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ప్రత్యేక పూజలు

రొంపిచర్ల, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : పుట్టపర్తి సత్యసాయి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా ఆయన బాబాను దర్శించుకున్నారు. ఆలయ వాతావరణం పూర్తి ఆధ్యాత్మికతతో ఉందని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో బాబాను దర్శించుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రపంచ వ్యాప్తంగా పుట్టపర్తికి ఎంతో పేరు ప్రతిష్ఠలు ఉన్నాయని తెలిపారు. దేశ విదేశాల నుండి వచ్చే భక్తులకు ఇక్కడ వసతి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఆలయ దర్శనం తమకు ఆధ్యాత్మిక ప్రేరణ ఇచ్చిందన్నారు. ప్రజా సేవ చేసే వారికి పుట్టపర్తి ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.



## ఎరువులపై వైకాపా చేస్తున్న ఆందోళనలు హాస్యాస్పదం : టిడిపి

నకరికల్లు, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులపై వైకాపా చేస్తున్న ఆందోళనలు హాస్యాస్పదంగా ఉన్నాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య అన్నారు. వైఎస్సార్‌సీపీ కేవలం రాజకీయ లబ్ది కోసం అన్నదాత పోరు అనే కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిందన్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక ఇష్టానుసారంగా అన్నివర్గాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రతి రైతుకు ఆర్థిక సహాయం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలెండర్లు, అన్న క్యాంటీన్లు, ప్రతి నెల పెన్షన్లు, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, యువతకు 8 లక్షలకు పైగా ఉద్యోగాలు ఇచ్చి సిఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారన్నారు. అన్నదాతను మోసం చేసింది వైఎస్సార్‌సీపీ అన్నారు. రాష్ట్రంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉన్నాయన్నారు. ఫేక్ ప్రచారం చేస్తూ రైతులను రాజకీయాలలోకి తీసుకురావడం దుర్మార్గమన్నారు. వైకాపా తన వైఖరి మార్చుకోవాలని నాగోతు శౌరయ్య హితవు పలికారు.



## ఈశ్వర్ కళాశాలలో మొక్కల పెంపకంపై ప్రత్యేక కార్యక్రమం

నకరికల్లు, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో రోటరీక్లబ్ సహకారంతో మై బడ్డీ గ్రీన్ డ్రైవ్ 2025 నిర్వహణలో భాగంగా మొక్కల పెంపకంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు షేక్ కరీమ్ మొహిద్దీన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. రోటరీక్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ ఎస్.వి.రాంప్రసాద్, జిల్లా ఫారెస్ట్ అధికారి అశోక్‌కుమార్, కళాశాల ఛైర్మన్ షేక్.మీరావలి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అటవీశాఖ సహకారంతో 1600 మొక్కలను ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ద్వారా విద్యార్థులకు పంపిణీ చేశామని తెలిపారు. డైరెక్టర్ మస్తాన్‌షరీఫ్, షేక్.నజీమా, ప్రిన్సిపాల్ జి.నాగమల్లేశ్వరరావు, రోటరీ సభ్యులు రత్నప్రభాకర్, తాళ్ళ రాజశేఖరరెడ్డి, రాఘవయ్య, సుబ్బారావు, రాధాకృష్ణ, ఎస్.కె.జిలానీమాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు నివాళి

సత్తెనపల్లి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : చాకలి ఐలమ్మకు వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి అమరావతి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమితి అధ్యక్షులు గొల్లపల్లి వీరాంజనేయులు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ పోరాటం చేసిందని గుర్తు చేశారు. ఆమె పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగమల్లేశ్వరరావు, షారోన్‌కుమార్, బబ్బు, సోమశేఖర్ పాల్గొన్నారు.



## నిరుపేదలకు సేవా కార్యక్రమాలు



సత్తెనపల్లి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : పట్టణంలోని అబ్బూరు రోడ్డులో ఉన్న ఫణిదం సొసైటీలో బుధవారం ఎన్ఆర్ఐ జి.అనీల్‌కుమార్ ఆర్థిక సహాయంతో 75 కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అదే విధంగా రెండు సైకిళ్ళను విద్యార్థులకు అందించారు. రూ.65 వేలతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అమెరికాలో స్థిరపడిన అనీల్‌కుమార్ గత 14 సంవత్సరాలుగా స్వగ్రామంలో, పట్టణంలో పరివర్తన, ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమాలలో సేవలందిస్తున్నారు. ఆయన మిత్రులు కంచర్ల నాగేశ్వరరావు, గంగూరి కళ్యాణ్, సోమ్‌నాథ్, వీరాస్వామి సహకారం అందిస్తున్నారు.

## రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించండి

సత్తెనపల్లి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు రవిబాబు అన్నారు. ఏవో బి.సుబ్బారెడ్డి అధ్యక్షతన బుధవారం మండలంలోని ధూళిపాళ్ళ గ్రామంలో రైతులకు యూరియా వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు అవసరం ఉన్నంత మేరకే ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. ఎరువులు నిల్వ చేయవద్దని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో ఎరువుల పంపిణీ కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేశారు.



## ఓంకారేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమరావతి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : మండలంలోని ఎండ్రాయి గ్రామంలో వెంచేసియున్న ఓంకారేశ్వరి అమ్మవారికి బుధవారం ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమరావతి ఆర్యవైశ్య మహిళా మండలి వారు మణిద్వీప వర్ణన తొమ్మిది సార్లు పారాయణం చేశారు. అనంతరం కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు, అన్నదాన ప్రసాదాలను స్వీకరించారు.

## మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

పెదకూరపాడు, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక కాకతీయ కళాశాల నందు బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఆరోగ్యం, పౌష్టికాహారం గురించి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మాధవి మాట్లాడారు. కిశోరి బాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ షేక్.పెద్దఇమాంబి మాట్లాడుతూ పరిశుభ్రత అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్‌బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్స్ అందజేత



రాజుపాలెం, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : మండల కేంద్రమైన రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం క్షయ వ్యాధిగ్రస్తులకు 20 మందికి పోషకాహార కిట్స్‌ను డాక్టర్ రవితేజానాయక్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోషకాహారం తీసుకోవడం వలన వ్యాధి నిరోధకత పెరిగి వ్యాధి త్వరగా తగ్గుతుందన్నారు. ఈ కిట్స్‌ను క్యాబ్ హైవేస్ ఫౌండేషన్ సహకారంతో అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు టీబీ యూనిట్ పర్యవేక్షకులు సౌజన్య, హెల్త్ విజిటర్ ఉషారాణి, రమాదేవి, శివ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పెదకూరపాడు పిహెచ్‌సిని సందర్శించిన జిల్లా అధికారి

పెదకూరపాడు, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి 75 తాళ్ళూరు పిహెచ్‌సిని బుధవారం సందర్శించారు. ఆరోగ్యపరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సుజాతతో మాట్లాడుతూ పిహెచ్‌సికి వచ్చే జ్వరపీడితుల ఆరోగ్య వివరాలను తీసుకున్నారు. 75 తాళ్ళూరు వైద్యాధికారి డాక్టర్ వెలుగొండారెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రత్నాకరం, చట్టు శ్రీను, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

అమరావతి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : అమరావతి మండలంలోని సామాజిక వైద్య ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో ఉన్న ఇన్ పేషెంట్‌ల వార్డును సందర్శించి వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జ్వర పీడితుల వివరాలను సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చేవారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. అదే విధంగా అమరావతి-1 సచివాలయ పరిధిలోని గృహాలను సందర్శించి పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు, నీటిలో లార్వా లేకుండా చూసుకోవాలని సూచించారు. పిహెచ్‌సి వైద్యాధికారులకు ప్రతి గ్రామంలో ప్రతి రోజు తప్పకుండా ఫీవర్ సర్వేలు చేయాలని, జ్వర పీడితులు అధికంగా ఉన్న గ్రామాలలో వెంటనే మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివరత్నకుమార్, డాక్టర్ మౌనిక, మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణ అధికారి కె.లక్ష్మి, మనోహర్, హెచ్.ఎస్. జె.కృష్ణ, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## అన్నదాత పోరుబాట వైసీపీ తలపెట్టడం హాస్యాస్పదం

గురజాల, డిసెంబరు 10 ప్రభాతవార్తః అన్నదాత పోరుబాట కార్యక్రమాన్ని వైసీపీ తలపెట్టడం హాస్యాస్పదంగా ఉందని జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్నదాతలే వైసీపీపై పోరుబాట పట్టి 151 సీట్లు నుంచి 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. రైతు శ్రేయస్సు కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. రైతులపై చిత్తశుద్ధి ఉంటే నీటి సంఘాలను ఎద్దుకు రద్దు చేశారని ప్రశ్నించారు. అలాగే సీఆర్‌సీసీ చట్టాన్ని రద్దు చేసి కౌలు రైతుల ఆత్మహత్యలకు కారణమయ్యారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్నదాతలకు చేయూతనందిస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ. 2342 కోట్లు విడుదల చేసిందన్నారు. గురజాల నియోజకవర్గంలో 35,595 మందికి రూ. 25 కోట్లు రైతుల ఖాతాల జమ చేశామన్నారు. శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యాన నియోజకవర్గ వ్యాప్తంగా మేజర్, మైనర్ కాలువల ఆధునీకరణ పనులు చేసి పంట కాలువల దిగువున్న ఉన్న రైతులకు నీరు అందేలా చేస్తామన్నారు.




## రైతులకు ఎరువులు ఖచ్చితంగా అందించండి : ఎంఐఎం

రొంపిచర్ల, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : రైతులకు ఎరువులను ఖచ్చితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎంఐఎం నాయకులు మౌలాలి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నెముక రైతు అని చెప్తున్న ప్రభుత్వం ఆచరణలో సక్రమంగా చేయి అందించడం లేదన్నారు. యూరియా సంక్షోభాన్ని సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు కూటమి నాయకులు తరలిస్తున్నారని తెలిపారు. మహిళలు, వృద్ధులు క్యూలైన్లలో యూరియా కోసం అవస్థలు పడుతున్నారని తెలిపారు. టన్నుల కొద్ది యూరియాను సరిహద్దులు దాటిస్తున్నారని ఎంఐఎం నాయకులు మౌలాలి విమర్శించారు.


## విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

నరసరావుపేట, సెప్టెంబరు 10 ప్రభాతవార్త : గురజాల నియోజకవర్గంలోని పల్లెగుంత ఏపిఎంఎస్ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రీడ్స్ స్వచ్ఛంధ సంస్థ, ఔట్‌రీచ్ వర్కర్లు రమాదేవి, మౌలాబి, ఎడ్యుకేటర్ కనకారమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ ఉషశ్రీ మాట్లాడారు. హెచ్ఐవి ఎలా వ్యాప్తిచెందుతుందో వివరించారు. రెండు నెలల పాటు జరుగుతున్న ఐఈసి ప్రచార కార్యక్రమం గురించి తెలియజేశారు. సమాజంలో ఈ వ్యాధిపై ఉన్న అపోహలను తెలియజేశారు. చేతులు కలపడం, కలిసి భోజనం చేయడం, దోమకాటు వలన హెచ్ఐవి వ్యాప్తిచెందదన్నారు. ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు నిర్వహించి వైద్య సేవలను అందిస్తుందని తెలియజేశారు.

# నేపాల్ హింసలో చిక్కుకున్న భారత్ వాలీబాల్ క్రీడాకారిణి



**ఖాట్మండు, సెప్టెంబరు 10:** నేపాల్‌లో జెన్‌జడ్ నిరసనలు హింసకు దారితీశాయి. పొఖారా ప్రాంతంలోని ఓ హోటల్‌పై కూడా నిరసనకారులు దాడి చేశారు. దాంతో ఆ హోటల్‌లో బస చేస్తున్న భారత పర్యాటకురాలు ఉపాసన గిల్ సాయం కోసం అర్థించారు. భారత ప్రభుత్వం తనకు సాయం చేయాలని ఓ వీడియోలో మొరపెట్టుకున్నారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'నా పేరు ఉపాసన గిల్. వాలీబాల్ లీగ్ కోసం నేపాల్‌కు వచ్చాను. నిరసనలతో పొఖారా ప్రాంతంలో ఉన్న హోటల్‌లో చిక్కుకుపోయాను. తొలుత నేను బస చేసిన హోటల్‌కు నిప్పంటించారు. నా వస్తువులన్నీ అందులోనే ఉండిపోయాయి. దాడి సమయంలో నేను స్పాలో ఉన్నాను. కొందరు నిరసనకారులు పెద్దపెద్ద కర్రలతో నా వెంట పడ్డారు. ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగా లేవు. రోడ్డుపై ఎక్కడ చూసినా మంటలే కనిపిస్తు న్నాయి. వారు పర్యాటకులను కూడా వదలడం లేదు. ఎలాంటి ఆలోచన లేకుండా ప్రతిదీ తగల బెడుతున్నారు. పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదు. నాతోపాటు చాలామంది సాయం కోసం ఎదురుచూస్తున్నారు' అని గిల్ ఆ వీడియోలో ఆవేదనచెందారు. ఇప్పటికే నేపాల్‌లో ఉన్న భారతీ యులను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అక్కడి రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించింది. అలాగే పరిస్థితులు చక్కబడేవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఉన్నచోటే ఉండాలని, వీధుల్లోకి రావొద్దని హెచ్చరించింది. ఎప్పటికప్పుడు స్థానిక యంత్రాంగం ఇచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. కాగా నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొనౌలీ ప్రాంతం మీదుగా భారతీయ పర్యాటకులు తిరిగి స్వదేశానికి వస్తున్నారు.




# డెంగ్యూ కేసులు 76% పెరిగే ముప్పు

## ఎన్.పినాస్ అధ్యయన వేదిక వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10:** ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మానవాళి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని తాజా అధ్యయనం హెచ్చరించింది. వాతావరణ మార్పుల కారణంగా 2050 నాటికి ఆసియా, అమెరికా ఖండాల్లోని అనేక దేశాల్లో డెంగీ కేసుల సంఖ్య ఏకంగా 76 శాతం వరకు పెరిగే ప్రమాదం ఉందని అమెరికా శాస్త్రవేత్తలు తేల్చారు. వాతావరణ మార్పులకూ, డెంగీ వ్యాప్తికీ మధ్య ఉన్న ప్రత్యక్ష సంబంధాన్ని ఈ అధ్యయనం స్పష్టంగా చెప్పింది. వాషింగ్టన్, స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాలతో పాటు అమెరికా జాతీయ ఆర్థిక పరిశోధన బ్యూరోకు చెందిన శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేపట్టారు. వారి విశ్లేషణ ప్రకారం, ఇది కేవలం భవిష్యత్తు ముప్పు మాత్రమే కాదు. ఇప్పటికే 1995 నుంచి 2014 మధ్యకాలంలో నమోదైన డెంగీ కేసుల్లో 18 శాతం పెరుగుదలకు వాతావరణ మార్పులే కారణమని తేలింది. దీనివల్ల ఏటా సగటున 46 లక్షల మంది అదనంగా డెంగీ బారిన పడుతున్నారని అంచనా వేశారు. డెంగీ వైరస్‌ను వ్యాపింపజేసే దోమలు వృద్ధి చెందడానికి, వ్యాధి వ్యాప్తికి సుమారు 27.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అత్యంత అనుకూలంగా ఉంటుందని పరిశోధకులు గుర్తించారు. ప్రస్తుతం చల్లగా ఉన్న ప్రాంతాలు వేడెక్కుతున్న కొద్దీ అక్కడ డెంగీ వ్యాప్తి ఒక్కసారిగా పెరిగే ప్రమాదం ఉంది. మెక్సికో, పెరూ, బ్రెజిల్ వంటి దేశాల్లోని అధిక జనాభా కలిగిన చల్లని ప్రాంతాల్లో కేసుల సంఖ్య భారీగా పెరగవచ్చని అంచనా వేశారు. ఉష్ణోగ్రత ప్రభావం మేం ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా ఉంది. ఉష్ణోగ్రతలో చిన్న మార్పు కూడా డెంగీ వ్యాప్తిపై పెద్ద ప్రభావాన్ని చూపుతుంది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని మనం ఇప్పటికే చూస్తున్నామని శాస్త్రవేత్తల బృందానికి నేతృత్వం వహించిన వాషింగ్టన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మరిస్సా చైల్డ్స్ తెలిపారు. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల స్థాయిని బట్టి 2050 నాటికి డెంగీ కేసులు 49 నుంచి 76 శాతం వరకు పెరగవచ్చని ఈ అధ్యయనం హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో కేసుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం కూడా ఉందని, దీనివల్ల దాదాపు 26 కోట్ల మంది ప్రజలు ప్రమాదంలో పడతారని పేర్కొంది. వాతావరణ మార్పులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవడం, దోమల నియంత్రణ, ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడం, కొత్త డెంగీ వ్యాక్సిన్లను అందుబాటులోకి తేవడం వంటి చర్యల ద్వారా ఈ ముప్పును తగ్గించవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. ఈ అధ్యయన వివరాలు ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



# విశ్రాంతి లేకుండా ఎన్నికల కోసం పనిచేయాలి

## పార్టీ కేడర్‌తో సిఎం స్టాలిన్

**చెన్నై, సెప్టెంబరు 10:** అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యేవరకూ 'విశ్రాంతి' అనే మాట మరిచి, పార్టీ కోసం ముమ్మరంగా ప్రచారం చేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని జిల్లా కార్యదర్శులకు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన పిలుపునిచ్చారు. తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కార్యదర్శులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ పదేళ్ల అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పాతాళానికి చేరుకున్న ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో ద్రావిడ తరహా డీఎంకే ప్రభుత్వం విజయం సాధించిందని, గడిచిన నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి 11.19 శాతానికి పెరిగిందని, రాష్ట్రాన్ని పారిశ్రామికపరంగా అభివృద్ధి చేసే దిశగా ఇటీవల తాను జరిపిన జర్మనీ, ఇంగ్లండ్ దేశాల పర్యటలో భారీగా పారిశ్రామిక పెట్టుబడులను సమీకరించానని చెప్పారు. విదేశీ పర్యటనలో రూ.15,516 కోట్ల పెట్టుబడులు సమీకరించడంతో పర్యటన 'సూపర్ హిట్' అయ్యిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ట్రిలియన్ డాలర్లకు పెంచాలన్న లక్ష్యాన్ని త్వరగా చేరుకోవాలంటే పెట్టుబడుల సమీకరణ, విదేశీ పర్యటనలు చాలవని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగానే జూలై 3న 'ఏకతాటిపై తమిళనాడు' అనే ఉద్యమాన్ని ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ఈ పరిస్థితుల్లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ జిల్లా కార్యదర్శులు, నగర, పట్టణ శాఖ కార్యదర్శులే కాకుండా పార్టీ కార్యకర్తలు, బూత్ కమిటీ ఇన్‌ఛార్జులు 'విశ్రాంతి' అనే మాటే మరచిపోవాలని, నిద్రాహారాలు కూడా పట్టించుకోకుండా పార్టీ అభ్యర్థులు, కూటమి అభ్యర్థుల విజయం కోసం తీవ్రంగా శ్రమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 15న అన్నాదురై జయంతి సందర్భంగా 68 వేల పోలింగ్ కేంద్రాల ఇన్‌ఛార్జులు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, కూటమి అభ్యర్థుల విజయానికి పాటుపడతామని శపథం చేయాలన్నారు. అన్నాదురై జయంతి వేడుకలు తర్వాత సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

# మీడియా మీట్‌లోనే కుప్పకూలిన ఆరోగ్యమంత్రి



**స్టాక్‌హోమ్, సెప్టెంబరు 10:** స్వీడన్ కొత్త ఆరోగ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఎలిసబెత్ లాన్ ఆ పదవిలో చేరిన కొద్ది గంటల్లోనే అనారోగ్యానికి గురయ్యారు. ముఖ్యంగా మీడియా సమావేశంలో స్టేజ్ మీదే కుప్పకూలిపోయారు. 48 ఏళ్ల వయస్సు కల్గిన ఆమె స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్, క్రిస్టియన్ డెమోక్రాట్స్ పార్టీ నాయకురాలు ఎబ్బా బుష్‌తో కలిసి పాత్రికేయుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. ముఖ్యంగా ఆ వీడియోల్లో లాన్ ఒక అధికారి మాట్లాడుతున్న మాటలను శ్రద్ధగా వింటూ ఒక్కసారిగా ముందుకు పడిపోయారు. తన ముందుకు మైక్ స్టాండ్ ఉండగా దాని మీద నుంచే కింద పడ్డారు. ఈ విషయం గుర్తించిన ఎబ్బా బుష్ వెంటనే లాన్ వద్దకు పరుగెత్తి ఆమెను వెనక్కి తిప్పడానికి సహాయం చేశారు. ఆలోపే ఇతర అధికారులు, పాత్రికేయులు ఆమె చుట్టూ చేరి సహాయం అందించడానికి ప్రయత్నించారు. కానీ అప్పటికే లాన్ స్పృహ కోల్పోయి ఉండగా వెంటనే సిబ్బంది ఆమె ముఖంపై నీళ్లు చల్లారు. ఆ తర్వాత కాసేపటికే ఆమెకు స్పృహ రాగా తనకేమీ కాలేదని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా ఘటన జరిగిన కాసేపటికే ఎలిసబెత్ లాన్ తిరిగి మీడియా సమావేశానికి వచ్చారు. తనకేమీ కాలేదని, రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గినప్పుడు తనకిలా అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే కళ్లు తిరిగి పడిపోవడం వల్ల తనకు ఎలాంటి గాయాలు కూడా కాలేదని ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నాని స్పష్టం చేశారు. ప్రశ్నలుసమాధానాల సెషన్‌ను కూడా రద్దు చేశారు. మాజీ మంత్రి అక్కో అంకర్‌బెర్గ్ జోహాన్సన్ రాజీనామా చేయగా లాన్ ఆరోగ్య మంత్రిగా నియమితులు అయ్యారు. జోహాన్సన్ మూడు సంవత్సరాలు ఈ పదవిలో పనిచేశారు. 1986లో స్వీడిష్ క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీతో తన వృత్తిని ప్రారంభించారు. ఎలిసబెత్ లాన్ క్రిస్టియన్ డెమోక్రాట్స్ పార్టీలో చాలా కాలం నుంచి సభ్యురాలిగా ఉన్నారు. ఆమె ఇంతకు ముందు 2019 నుంచి గోటెన్‌బర్గ్‌లో మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేశారు. అలాగే ఆమె శాంతి, అభివృద్ధి అధ్యయనాలు, రాజకీయ శాస్త్రంలో మాస్టర్ డిగ్రీ చేశారు. అంతేకాకుండా ఆమె క్యాబినెట్ ఆఫీస్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా కూడా పని చేసి..ఆరోగ్య సంరక్షణ బాధ్యత విచారణలో పాల్గొన్నారు. ఈ సంఘటనలు ప్రజారోగ్య సంరక్షణపై, అలాగే ప్రజా నాయకుల ఒత్తిడితో కూడిన పని వాతావరణంపై చర్చకు దారితీస్తున్నాయి.

ఇలాంటి ఘటనలు జరగకుండా నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు, విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ప్రజా నాయకులకు పని ఒత్తిడి తగ్గించడానికి, వారి ఆరోగ్యాన్ని కాపాడటానికి ప్రభుత్వాలు మరింత శ్రద్ధ వహించాలని అంటున్నారు.

# భారత్, చైనాలపై 100% సుంకాలు వేయండి

## ఇయూ దేశాలపై ట్రంప్ ఒత్తిడి



**వాషింగ్టన్, సెప్టెంబరు 10:** భారత్,చైనాలపై నూరుశాతంసుంకాలు విధించాలని అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ యూరోపియన్ కూటమి దేశాలను డిమాండ్‌చేస్తున్నారు. దీనివల్ల రష్యా ఉక్రెన్‌పై చేస్తున్న యుద్ధాన్ని నివారించగలుగుతామని చెపుతున్నారు. ఈ రెండుదేశాల దిగుమతులపై 100శాతం సుంకాలు వేయాలని ఈయూను కోరారు. రష్యాపై ఆంక్షలు విధించే అంశానికి సంబంధించి సీనియర్ అమెరికన్ ఈయూ అధికారులు వాషింగ్టన్‌లో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఈయూ అధికారులతో ట్రంప్ కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడి రష్యాపై ఆర్థిక ఒత్తిడి తెచ్చేందుకు భారత్, రష్యాలపై 100శాతం సుంకాలు వేయాలని కోరారు. చమురు కొనుగోలు చేయడం నిలిపివేస్తామనేవరకూ ఈ ట్యారిఫ్‌లను కొనసాగించాలన్నారు. మేం ఇలాచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ యూరోపియన్ భాగస్వాములతోకలిసి ముందుకు వస్తేనే దీన్ని అమలుచేయగలుగుతామని యుఎస్ అధికారి ఒకరు అన్నారు. అమెరికా సూచనలు అమలుచేసేందుకు తాము సిద్ధమేనని ఈయూ అధికారులు చెప్పినట్లు అమెరికా అధికారులు ప్రస్తావిస్తున్నారు. ఉక్రెయిన్‌లో సత్వరమే శాంతిని నెలకొల్పాలనిఈయూ కూడా భావిస్తోందని, ఈక్రమంలో రష్యాపై ఒత్తిడి అనివార్యమని ట్రంప్ అన్నారు. అయితే భారత్ చైనాలపై ఆంక్షలు విధిస్తే ఎదురయ్యే పరిణామాలపై వారు చర్చలుజరుపుతూన్నారు. రష్యానుంచి చమురు కొనుగోలుచేస్తుండటంపై భారత్,చైనాలపై ట్రంప్ కొన్నిరోజులుగా గుర్రుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌పై 50శాతం సుంకాలు విధించారు. ఎస్సీఓ సదస్సుకు భారత ప్రధానిమోడీచైనాలోపర్యటించిన సందర్భంగా చైనా, రష్యా, భారత్ అగ్రనేతల ముచ్చట్లు ట్రంప్‌తో పాటు అమెరికన్లను కూడా కలవరపరిచాయి. భారత్‌తో నెలకొన్న వాణిజ్య అడ్డంకులు తొలగించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ తన ట్రూత్ సోషల్‌మీడియాలో పోస్టుపెట్టారు. ప్రధానిమోడీతో చర్చించేందుకు తాను ఎదురుచూస్తున్నానని ఆ పోస్టులో పేర్కొన్నారు.

# ఫ్రాన్స్‌లో వెల్లువెత్తిన నిరసనలు

## బడ్జెట్ ప్రతిపాదనలపై ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహం





**ప్యారిస్,సెప్టెంబరు 10:** రాజకీయ అనిశ్చితి నెలకొన్న ఫ్రాన్స్‌లో తాజాగా భారీ ఎత్తున నిరసనలు చెల రేగాయి. ఫ్రాన్స్ ప్రభుత్వం తెచ్చిన బడ్జెట్ ప్రతిపాదనలను వ్యతిరేకంగా వేలాది మంది నిరసనకారులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. బ్లాక్ ఎవ్రీథింగ్ పేరుతో పెద్ద ఎత్తున వీధుల్లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆర్థిక, రాజకీయ సంక్షోభం, సమాజంలో నెలకొన్న అశాంతి కారణంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా లక్షలాది మంది స్థానికులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. పారిస్ సహా ప్రధాన నగరాల్లో నిరసనకారులు రోడ్లను దిగ్బంధించారు. వాహనాలకు నిప్పు పెట్టారు. పశ్చిమ నగరమైన రెన్నెస్‌లో నిరసనకారులు ఓ బస్సును తగలబెట్టారు. రంగంలోకి దిగిన అధికారులు ఆందోళనకారులను అడ్డుకునేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఇప్పటి వరకూ దాదాపు 200 మందిని అరెస్ట్ చేసినట్లు అంతర్గత మంత్రి బ్రూనో రిటైల్లో ప్రకటించారు. అంతేకాదు దేశ వ్యాప్తంగా భద్రతా దళాలను మోహరించినట్లు చెప్పారు. శాంతి భద్రతలు కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మరోవైపు ఫ్రాన్స్ నూతన ప్రధానిగా సెబాస్టియన్ లెకోర్నూ నియమితులైన విషయం తెలిసిందే. విశ్వాసపరీక్షలో ప్రధాని బేరో ఓటమిపాలవటంతో రక్షణమంత్రిని కొత్త ప్రధానిగా ఎంపికచేశారు. ఏడాది వ్యవధిలో ఫ్రాన్స్‌లో ప్రధానిగా బాధ్యత చేపట్టిన నాలుగో వ్యక్తిగా లెకోర్నూ నిలిచారు. అంతకుముందు బేరో ప్రతిపాదించిన విశ్వాస పరీక్షలో ఆయనకు వ్యతిరేకంగా 364 ఓట్లు, అనుకూలంగా 194 ఓట్లు వచ్చాయి.

# సహస్ర సీమాదళ్ భద్రతలో నేపాల్ సరిహద్దులు

**డెహ్రాడూన్, సెప్టెంబరు 10:** నేపాల్‌లో చెలరేగుతున్న జన్‌జడ్ నిరసనలను నిశితంగా పరిశీలిస్తున్న భారత్ అప్రమత్తమైంది నేపాల్‌లోని అశాంతిని ఆసరాగా చేసుకుని సంఘ విద్రోహ శక్తులు భారత భూభాగంలోకి ప్రవేశించి, సరిహద్దు రాష్ట్రాల్లో హింసను ప్రేరేపించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. నేపాల్ సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల పోలీసులతో పాటు సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) బలగాలను అప్రమత్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులను నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరి జిల్లాలోని గౌరిఫంటా సరిహద్దు వద్ద భద్రతా దళాలు పోలీసు పోర్టును ఏర్పాటు చేశారు. నేపాలీ పౌరులను భారత భూభాగంలోకి అనుమ తించడం లేదు. అయితే, పొరుగు దేశంలోని భారతీయుల్ని మాత్రం స్వదేశంలోకి అనుమతిస్తున్నారు. అదేవిధంగా నేపాల్ కూడా భారతీయుల్ని తమ భూభాగంలోకి అనుమతించడం లేదు. సరిహద్దు జిల్లాల్లో మార్కెట్లు మూగబోయాయి.

# సంక్షిప్తంగా..

## సంవత్సరంలో 15 రోజులు మాత్రమే పనిచేసే రైల్వేస్టేషన్



**పాట్నా, సెప్టెంబర్ 10:** భారత్‌లో దాదాపు 7,500 రైల్వే స్టేషన్లు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వీటిలో బీహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో అనుగ్రహ నారాయణ్‌రోడ్ ఘాట్ స్టేషన్ మాత్రం చాలా ప్రత్యేకం. ఎందుకంటే ఇది సంవత్సరంలో 15 రోజులే పని చేస్తుంది. అది కూడా పితృపక్షంలో ప్రజలు తమ పితృదేవతలను పూజించుకోవడానికి కావడం విశేషం. ఈ ఏడాది పితృపక్షం సెప్టెంబర్7న మొదలైంది. దీంతో అనుగ్రహ నారాయణ్‌రోడ్ ఘాట్‌స్టేషన్ సమీపంలోని పున్‌పున్ నదీ తీరంలో రెండు వారాలపాటు పిండ ప్రదానాలు జరగనున్నాయి. పున్‌పున్ నదికి ఆదిగంగ పున్‌పున్ అనే పేరు కూడా ఉంది. ఇది గంగా నది కంటే ప్రాచీనమైందని భావిస్తారు. ఈ 15 రోజులు ఈ ప్రాంతానికి దేశంలోని ప్రజలే కాకుండా విదేశాల నుంచి కూడా తరలివస్తారు. అందుకే ఇక్కడ ఈ నెల 21 వరకు రైళ్లు ఆగుతాయని అధికారులు తెలిపారు.

## పోలెండ్ ఎయిర్‌స్పేస్‌లోకి రష్యా డ్రోన్లు

**వార్సా,సెప్టెంబరు 10:** తమ వైమానిక క్షేత్రంలోకి ఎంటర్ అయిన రష్యా డ్రోన్లను కూల్చివేసినట్లు పోలాండ్ ప్రకటించింది. మంగళవారం రాత్రి సుమారు 19 రష్యా డ్రోన్లు పోలాండ్ ఎయిర్‌స్పేస్‌లోకి ప్రవేశించాయి. అయితే దాంట్లో నాలుగు డ్రోన్లను పోలాండ్ కూల్చినట్లు స్పష్టం అవుతున్నది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మళ్లీ యుద్ధం చేసేందుకు పోలాండ్‌ను ప్రోత్సహిస్తున్నట్లుగా ఉందని ఆ దేశ ప్రధాని డోనాల్డ్ టస్క్ తెలిపారు. పోలాండ్, నాటోకు చెందిన విమానం ద్వారా ఆ డ్రోన్లను కూల్చివేశారు. ఓ నాటో దేశం వైమానిక క్షేత్రంలో రష్యా డ్రోన్లను కూల్చడం ఇదే తొలిసారి. ఏడు డ్రోన్ల శకలాలు, గుర్తు తెలియని వస్తువులను పసికట్టామని పోలాండ్ హోంశాఖ మంత్రి వెల్లడించారు. అయితే నాటో దేశంలోకి కావాలనే డ్రోన్లను ఎంటర్ చేయించారేమో అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పోలాండ్ ఎయిర్‌స్పేస్‌లోకి డ్రోన్లు వెళ్లినట్లు వచ్చిన వార్తలను రష్యా దౌత్యవేత్త ఖండించారు. పోలాండ్‌లోని వార్సాకు రావాల్సిన విమానాలను ఆలస్యం చేశారు.

## ఆప్ ఎమ్మెల్యే అరెస్టుపై వెల్లువెత్తిన నిరసన



**శ్రీనగర్, సెప్టెంబరు 10:** దోడాకు చెందిన ఏకైక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్ ఆ జిల్లా మేజిస్ట్రేట్ హర్విందర్ సింగ్ మధ్య వివాదం తలెత్తింది. గ్రామస్తుడికి అద్దె చెల్లించని ఆ ఎమ్మెల్యే ప్రజా దుర్వినియోగానికి పాల్పడ్డారని, అన్‌పార్లమెంటరీ భాష ఉపయోగించారని మేజిస్ట్రేట్ ఆరోపించారు. ఆప్ ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్‌పై కఠినమైన ప్రజా భద్రతా చట్టం (పీఎస్ఏ) కింద కేసు నమోదుకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ఈ చట్టం కింద విచారణ లేదా ప్రాసిక్యూషన్ లేకుండా ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి రెండేళ్లపాటు జైలులో ఉంచవచ్చు. కాగా, ఆప్ ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్ అరెస్ట్‌పై దోడా జిల్లాలో నిరసనలు వెల్లువెత్తాయి. ఆయనను విడుదల చేయాలంటూ ప్రజలు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. జనాన్ని చెదరగొట్టేందుకు లాఠీ ఛార్జ్ చేశారు. ఈ ఘర్షణల్లో ఒక పోలీసు అధికారితో సహా పలువురు గాయపడ్డారు. నిరసనలు మరిన్ని ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో దోడా జిల్లాలో కర్ఫ్యూ వంటి ఆంక్షలు విధించారు.

## సుప్రీంను ఆశ్రయించిన ఉమర్ ఖలీద్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10:** దేశ రాజధాని ఢిల్లీ లో 2020లో చోటుచేసుకున్న అల్లర్ల కేసు లో నిందితుడిగా ఉన్న ఉమర్ ఖలీద్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఢిల్లీ హైకోర్టు తనకు బెయిల్ నిరాకరించడాన్ని అతను సుప్రీంకోర్టు లో ఛాలెంజ్ చేశాడు. ఢిల్లీ హైకోర్టు ఈ నెల 2న ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితులుగా ఉన్న ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ సహా 9 మంది బెయిల్ పిటిషన్‌లను తోసిపుచ్చింది. బెయిల్ పిటిషన్‌లు తిరస్కరణకు గురైన వారిలో ఖలీద్, షర్జీల్‌తోపాటు మహ్మద్ సలీమ్ ఖాన్, షిఫా ఉర్ రెహ్మన్, అథర్ ఖాన్, మీరన్ హైదర్, అబ్దుల్ ఖాలిద్ సైఫీ, గుల్ఫిషా ఫాతిమా, షాదాబ్ అహ్మద్ ఉన్నారు. వారిలో షర్జీల్ ఇమామ్, ఫాతిమా గత వారమే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇప్పుడు ఉమర్ ఖలీద్ సుప్రీంకు వెళ్లాడు. ఢిల్లీ హైకోర్టు తన బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చడాన్ని సవాల్ చేశాడు. 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో సీఏఏ వ్యతిరేక నిరసనలు హింసాత్మకంగా మారిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ ఘటనలో దాదాపు 53 మంది దుర్మరణం పాలయ్యారు.

# కెనడాకంటే జర్మనీ వైపు ఫోకస్ పెంచిన భారతీయ విద్యార్థులు

## వీసా నిబంధనలు కఠినతరం కావడమే కారణం

**టొరంటో, సెప్టెంబరు 10:** దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధమైన అత్యంత నిర్బంధ వీసా విధానాలను కెనడా ప్రస్తుతం అమలు చేస్తోంది. దీంతో 2025 విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు దాదాపు 80 శాతం మంది భారతీయ విద్యార్థుల దరఖాస్తులను తిరస్కరించింది. కెనడా తిరస్కరణలతో ప్రధానంగా ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని దేశాల విద్యార్థులపై ప్రభావం పడింది. దీంతో వారు ఇతర దేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీలు, కాలేజీల్లో చేరడం మొదలుపెట్టారు. అక్కడ విదేశీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వ్యక్తిగత భద్రత లభిస్తుంది. 2023 నుంచి కెనడా ప్రభుత్వం కఠినమైన స్టూడెంట్ వీసా నిబంధనలు, అడ్మిషన్ విధి విధానాలను అమల్లోకి తెచ్చింది. అయినప్పటికీ ఏటా ఎంతోమంది భారతీయ విద్యార్థులు కెనడా వీసాల కోసం అప్లై చేస్తున్నారు. అక్కడి యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందాలనే లక్ష్యంతో భాషా పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. ఇందుకోసం వివిధ ప్రిపరేషన్ కోర్సులు చేస్తున్నారు. ఈక్రమంలో ఎంతో డబ్బును ఖర్చు చేస్తున్నారు. అయినా కెనడా విద్యాసంస్థల్లో ప్రవేశాలు రాకపోవడంతో ఎంతోమంది భారతీయ విద్యార్థులు ఇతర దేశాల విద్యాసంస్థలను అన్వేషిస్తున్నారు. కెనడా యూనివర్సిటీల్లో చేరాలని భావించే విదేశీ విద్యార్థులు చూపించాల్సిన బ్యాంకు బ్యాలెన్స్ మొత్తాన్ని పెంచారు. ఇప్పుడు భారతీయ విద్యార్థులు ఇందుకోసం ఏకంగా రూ.12.73 లక్షలు చూపించాల్సి వస్తోంది. కఠినమైన భాషా పరీక్షలను సైతం రాయాల్సి వస్తోంది. భారతీయ విద్యార్థులు చదువుకుంటూ, పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకునే మార్గాలపైనా పరిమితులను విధించారు. భారత్, చైనా వంటి దేశాల విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసే 'స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్' వ్యవస్థను సైతం కెనడా మూసివేసింది. 2024లో ఉన్నత విద్య కోసం భారతీయ విద్యార్థులు ఆసక్తి చూపిన గమ్యస్థానంగా జర్మనీనిలుస్తోంది. భారతీయ విద్యార్థుల్లో 31శాతం మంది జర్మనీలో ఉన్నత విద్యను అభ్యసించడానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. కెనడాలో చదవాలని కోరుకునే మనదేశ స్టూడెంట్స్ సంఖ్య రెండేళ్ల వ్యవధిలో 18 శాతం నుంచి 9 శాతానికి తగ్గిపోయింది విదేశీ విద్యార్థుల ట్యూషన్ ఫీజులపైనే ఆధారపడి నడుస్తున్న కెనడాలోని విశ్వవిద్యాలయాలు, కాలేజీల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. కొన్నింటిని పెద్ద యూనివర్సిటీల్లో విలీనం చేస్తున్నారు. ఇంకొన్ని మూసివేత ముప్పును ఎదుర్కొంటున్నాయి. అక్కడి ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. జర్మనీ యూనివర్సిటీలు, కాలేజీలకు సరిపడా ప్రభుత్వ నిధులు అందుతున్నాయి. విదేశీ విద్యార్థుల అడ్మిషన్లను జర్మనీ సర్కారు ప్రోత్సహిస్తోంది. ఆంగ్ల భాష వచ్చిన భారతీయ విద్యార్థులకు సులభంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు.



# 'పిండ ప్రదానం'పైనా బీహార్ ఎన్నికల రాజకీయాలు!

**గయా, సెప్టెంబర్ 10 :** బీహార్‌లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ పితృదేవతలకి సమర్పించే పిండ ప్రదానం మీద కూడా రాజకీయాలు నడుస్తున్నాయి. ఇదే అంశాన్ని విమర్శనాస్త్రంగా చేసుకుని బీహార్‌లోని రాష్ట్రీయ జనతా దళ్ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలకు దిగారు. ప్రధాని మోదీ గయాలో తన మాతృమూర్తికి చేయదల్చిన 'పిండ ప్రదానం' కార్యక్రమం మీద లాలూ యాదవ్ విమర్శలు గుప్పించారు. జనతా దళ్‌యునైటెడ్ అధ్యక్షుడు నీతీష్ కుమార్ రాజకీయ జీవితానికి 'పిండ ప్రదానం' చేయడానికి ఉద్దేశించిందంటూ లాలూ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు బీహార్ రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి. కాగా, ప్రధాని నరేంద్రమోదీ తన పుట్టిన రోజైన సెప్టెంబర్ 17వ తేదీన తల్లి దివంగత మీరాబెన్‌కి గయాలో పిండప్రదానం చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే లాలూ యాదవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. లాలూ ప్రసాద్ యాదవ్ సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో ఒక వీడియో షేర్ చేస్తూ, మోదీపై ఓట్ చోరీ ఆరోపణలు చేశారు. గయాలో మోదీ 13,000 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, రెండు రైళ్లను జెండా ఊపి ప్రారంభించండం ఓట్ చోరీలో భాగమేనని లాలూ యాదవ్ ఆరోపించారు. మోదీ రాష్ట్రంలో ఎన్నికల ముందు రాజకీయ లబ్ధి పొందేందుకు పలు రకాలుగా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తల్లికి గయాలో పిండ ప్రదానం కూడా ఇలాంటిదేనన్నారు.

పిండ ప్రదానం అనే హిందూ సంప్రదాయాన్ని రాజకీయ కోణంలో ఉపయోగించడం ద్వారా మోదీ, బీహార్ లో కొత్త రాజకీయాలు చేస్తున్నారని లాలూ ప్రసాద్ యాదవ్ ఎద్దేవా చేశారు. నితీష్ కుమార్‌ను బీజేపీ, తన నీడలోకి లాగేసుకుందని కూడా లాలూ యాదవ్ అన్నారు.

11-9Pg6exHMNWJQE 10_11-9Pg6exHMNWJQE.qxd 9/11/2025 12:53 AM Page 1



# 15 నెలలు -15 వైఫల్యాలు!

## జగన్ చేసిన తప్పులు పునరావృతం : బిసివై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్

**ప్రభాతవార్త ప్రతినిధి,పుంగనూరు,సెప్టెంబర్ 10** కూటమి అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో 15 అతిపెద్ద వైఫల్యాలు ఉన్నాయని.. వాటిని కప్పిపుచ్చుకోడానికి సూపర్ సిక్స్ సూపర్ హిట్ అబద్ధపు సభ నిర్వహించారని బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ దుయ్యబట్టారు. బుధవారం ఆయన పుంగనూరులో విలేకరులతో మాట్లాడుతూ అనంతపురంలో కూటమి నిర్వహించిన సభపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ 15 నెలల కూటమి పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేరని, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని జగన్ పెనంపై పెడితే, ఈ కూటమి పెనం నుండి పొయ్యిలో పడేసిందని విమర్శించారు. ఈ సభ అబద్ధాలతో కూడిన సెన్స్ డబ్బా సభ అంటూ ఆయన ఘాటుగా విమర్శించారు. నిరుద్యోగం తీవ్రమైందని, జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదనీ, అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు లెక్కన ఈ 15 నెలల్లో కనీసం 5 లక్షల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది, కానీ కనీసం 50 వేల ఉద్యోగాలు కూడా కల్పించలేదని ఆరోపించారు. వ్యవసాయ సంక్షోభం ముదిరిపోయిందని, వ్యవసాయం చేసే ఏ రైతు సంతోషముగా లేరని, గడిచిన 15 నెలల్లో అనేక పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మామిడి, కోకో, ఉల్లి, టమాటా రైతులు రోడ్డెక్కిన సంగతి మార్చి పోయారా..? అని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ చట్టం తెస్తామని హామీ ఇచ్చారని, లోకేష్ చేసిన యువగళం పాదయాత్ర సహా, ఎన్నికల ప్రచార సభల్లో కూడా హామీలిచ్చారని, కానీ ఈ 15 నెలల కాలంలో ఎక్కడా ఆ ప్రస్తావన లేక పోగా, బీసీలపై దాడులు జరుగుతున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కూటమి 15 నెలల పాలనలో 150 మందికి పైగా మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరిగాయని, కర్నూలు జిల్లా మచ్చుమర్రి మొదలుఎన్నో ఘటనల్లో ఇంకా బాధితులకు న్యాయం జరగలేదని, సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఆడబిడ్డ నిధి కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ అంటే మీరు హామీ ఇచ్చినట్టు ఆరు పథకాలు అమలు చేయాలనీ, నాలుగు మాత్రమే అసంపూర్తిగానే చేశారని, మరి సూపర్ హిట్టు అని ఎలా అంటారనిప్రశ్నించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 10 లక్షల కోట్లు అప్పులు చేసారంటూ విస్తృతంగా ప్రచారం చేసిన కూటమి, ఈ 15 నెలల కాలంలో లక్షన్నర కోట్లకు పైగా అప్పులు చేశారని, ఇది ఘోరమైన వైఫల్యం కాదాని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో ఇదిగో పరిశ్రమలు, అదిగో పరిశ్రమలు అంటున్నారనీ, కానీ ఈ 15 నెలల్లో ఒక్కటి కూడా సరైన పరిశ్రమ రాలేదు, పరిశ్రమలు, పెట్టుబడులు కాగితాలకే పరిమితమయ్యాయన్నారు.

### ప్రభుత్వ కార్యాలయాల్లో డిసిఎం పవన్ ఫోటోను తొలగించాలంటూ

## హైకోర్టులో పిల్ కొట్టేసిన న్యాయస్థానం

**విజయవాడ,సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** చట్టబద్ధమైన అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలతో హైకోర్టులో పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ (పిల్) దాఖలైంది. చట్టబద్ధమైన అనుమతి లేకుండా ఇటువంటి చర్యలు జరుగుతున్నాయని ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)లో పేర్కొన్నారు. ఈ పిల్‌ను విజయవాడకు చెందినవ్రైల్వే విశ్రాంత ఉద్యోగి, వై. కొండలరావు దాఖలు చేశారు. ఆయన తన పిటిషన్‌లో ప్రభుత్వ కార్యాలయాల్లో చిత్రపటాలను ప్రదర్శించడంపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్దిష్ట విధానం రూపొందించలేదని స్పష్టం చేశారు. చిత్రపటాల ప్రదర్శన విషయంలో ప్రభుత్వం నిర్దిష్ట విధానాన్ని తీసుకొచ్చేంత వరకు పవన్ కల్యాణ్ ఫోటోలను తొలగించేలా ఆదేశించాలని కోరారు. ఈ కేసులో సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి, సహాయ కార్యదర్శి, సమాచార, పౌరసంబంధాలశాఖ డైరెక్టర్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కూడా వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా పేర్కొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవి ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ పిల్‌పై బుధవారం విచారణ జరిపింది. ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సిఎం ఫొటో ఏర్పాటుపై నిషేధం ఎక్కడ ఉంది ? అని ఎపి హైకోర్టు ప్రశ్నించింది. ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోను ప్రభుత్వ కార్యాలయాల్లో ఉంచడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్ పై ఉన్నత న్యాయస్థానం బుధవారం విచారణ చేపట్టింది. వాదనల సందర్భంగా.. డిప్యూటీ ముఖ్యమంత్రి ఫొటో ఏర్పాటుపై నిషేధం ఎక్కడ ఉందని ధర్మాసనం ప్రశ్నించింది. రాజకీయ కారణాలతో పిటిషన్ వేశారని పేర్కొంటూ పిల్‌ను డిస్మిస్ చేసింది. సమాజానికి పనికొచ్చే ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలు చేయాలని కోర్టు సూచించింది.

### దగదర్తి విమానాశ్రయానికి

## సర్కార్ ఓకే

**- రూ.916కోట్లతో మొదటి దశ పనులకు టెండర్లు**

**విజయవాడ,సెప్టెంబరు10,ప్రభాతవార్తప్రతినిధి:** నెల్లూరులోని దగదర్తి విమానాశ్రయం మొదటి దశ పనులను రూ.916 కోట్లతో ప్రభుత్వం చేపట్టనుంది. పీపీపీ విధానంలో దీనిని చేపట్టాలని రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్) నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విమాన సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు దగదర్తి దగ్గర గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని నిర్మిస్తోంది. జిల్లాలో పారిశ్రామికంగా, పర్యాటకంగా జరిగే కార్యకలాపాలతో విమానాశ్రయం నుంచి ప్రయాణీకులు, సరకు రవాణా బాగా పెరుగుతుందని ఏపీఏడీసీఎల్ అంచనా వేసింది. దీనివల్ల కడప, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల ప్రజలు, పరిశ్రమలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంటుంది. విమానాశ్రయాన్ని నిర్మించే సంస్థతో 45 ఏళ్ల పాటు అమలులో ఉండేలా రాయితీ ఒప్పందాన్ని ప్రభుత్వం కుదుర్చుకోనుంది. ప్రతి 15 ఏళ్లను ఒక దశ కింద పరిగణించి విమానాశ్రయాన్ని నిర్మించేందుకు చేసిన మూలధన ఖర్చును భవిష్యత్తులో పెరిగే ప్రయాణికుల రద్దీ, కార్గోసేవలకు అనుగుణంగా సర్దుబాటు చేసేలా ప్రతిపాదించింది. మొదటి 15 ఏళ్లలో డిమాండ్ తక్కువగా ఉంటుందని రెండో దశలో డిమాండ్ పెరుగుతుందని, మూడో దశలో గరిష్ఠ స్థాయికి చేరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త విమానాశ్రయం నుంచి ప్రారంభంలో ఎయిర్‌బస్ ఎ320/ఎ321 రకం మీడియం సైజు విమానాలు నడపాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఒక రన్‌వేను నిర్మిస్తారు. రాష్ట్రంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మరో 7 కొత్త ఎయిర్ పోర్టులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, నాగార్జునసాగర్, తునిఅన్నవరం, ఒంగోలులో నూతన ఎయిర్‌పోర్టులను నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు ఎయిర్‌పోర్టుల విస్తరణ, నిర్మాణం, కొత్త విమానాశ్రయాల కట్టడంపై ఇప్పటికే సీఎం చంద్రబాబు ఇటీవల సమీక్ష నిర్వహించారు.

## విజయవాడ నగర కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల రవాణా కట్టడికి కఠిన చర్యలు

**- గంజాయి విక్రయ,రవాణాదారులు పట్టుబడితే యేడాది జైలు**

**విజయవాడ,సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగర కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల రవాణా కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల విక్రయదారులు పట్టుబడితే కనీసం ఏడాదిపాటు జైలుకు పరిమితమయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. గంజాయి, డ్రగ్స్ రవాణా చేస్తూ ఎక్కువ సార్లు పట్టుబడిన వారిని గుర్తించి పిట్ ఎన్డీపీఎస్ (ప్రివెన్షన్ ఆఫ్ ఇల్లిసిట్ ట్రాఫిక్ ఇన్ నార్కొటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్, 1988) ప్రయోగిస్తున్నారు. ఎన్డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసినా కొన్నాళ్లకే బయటకు వచ్చి మళ్లీ బరితెగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పిట్ ఎన్డీపీఎస్ అస్త్రాన్ని తెచ్చారు. తాజాగా మంగళవారం నలుగురు గంజాయి విక్రేతలను డిటెయిన్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికి 11 మందిని ఈ చట్టం కింద నిర్బంధించారు. ఏడాదిపాటు జైలులోనే: గంజాయి సాగు, మాదకద్రవ్యాల తయారీ, నిల్వ, క్రయవిక్రయాలు, రవాణాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొనే వారి కట్టడికి ఈ చట్టాన్ని ప్రయోగిస్తున్నారు. వీటిలో ప్రమేయం ఉన్న వారిని గుర్తించి విచారణ, శిక్షలతో సంబంధం లేకుండా ముందే నిర్బంధిస్తే వారిని కట్టడి చేయొచ్చనేది భావన అయితే ఉంది. ఈ మేరకు చట్టాన్ని ప్రయోగిస్తూ నిందితులను అదుపులోకి తీసుకుని ఏడాదిపాటు జైలులో ఉంచుతున్నారు. ఇప్పటికే దీని కింద నిర్బంధించిన ఐదుగురితో పాటు మరికొందరిని గుర్తించారు. వారందరి జాబితా సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే ప్రభుత్వానికి ప్రతిపాదించి, పిట్ ఎన్డీపీఎస్ చట్టాన్ని అమలు చేయనున్నారు. మరో రెడ్డిగూడెం మండలం ముచ్చినపల్లి చెందిన వ్యక్తి జీవన్ (22)పై గంజాయి కేసులు ఉన్నాయి. మాచవరం, విస్సన్నపేట ఠాణాల పరిధిలో, ఖమ్మం జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా గంజాయి తీసుకెళ్తూ దొరకగా కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ విచారణలోనే ఉన్నాయి. ఇవేకాక పోక్సో, చోరీ కేసులు అదనంగా నమోదయ్యాయి. కాకినాడ జిల్లా ఏలేశ్వరం వాసి కట్టా శ్రీనుపై రెండు ఎన్డీపీఎస్ కేసులు నమోదు అయ్యాయి. 2016లో రాజమహేంద్రవరంలో 3 కిలోల గంజాయి తరలిస్తూ దొరికాడు. 2017లో రంగారెడ్డి జిల్లాలో 70 కిలోలు తీసుకెళ్తూ దొరికాడు. హయత్‌నగర్ ఠాణాలో కేసు నమోదవగా దీని నుంచి విముక్తుడయ్యాడు. కోనసీమ జిల్లా రామచంద్రాపురం, సింగ్‌నగర్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి. ఇవేకాక సింగ్‌నగర్ స్టేషన్‌లో ద్విచక్ర వాహనాల చోరీ కేసులు మూడు ఉన్నాయి. జక్కంపూడి వైఎస్సార్ కాలనీవాసి పెంటుపోని దుర్గాప్రసాద్‌పై అనకాపల్లి జిల్లా నర్సీపట్నం స్టేషన్‌లో ఒకటి, విజయవాడ రెండో పట్టణ స్టేషన్‌లో రెండు గంజాయి కేసులు నమోదయ్యాయి.

## తురకపాలెంలో కార్యక్రమాలపై గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి సమీక్ష

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 10:** గుంటూరు గ్రామీణ మండలం తురకపాలెం గ్రామంలో బుధవారం జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం(ఎన్ సీ డీ సీ) ఎన్ సీ డీ సీ సంయుక్త సంచాలకులు డా. హేమలత, డా. ప్రవీణ్ నేతృత్వంలోని నిపుణుల బృందం సందర్శన కొనసాగుతుందని, వ్యాధి కారణాలపై విశ్లేషణ జరుగుందని, నివేదికను త్వరలో ప్రభుత్వానికి అందించనున్నారని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తెలిపారు. గుంటూరు మెడికల్ కళాశాలలోని ఎస్ పీ ఎం బృందం మరియు ప్రైవేటు ఆసుపత్రులలోని ఇన్ఫెక్షన్స్ వ్యాధుల నిపుణులు రోగుల కేస్ షీట్ లను పరిశీలిస్తున్నారని, మరణాలకారణాల పై నివేదిక 2 రోజుల్లో అందుబాటులోకి రానున్నందన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు పరీక్షించిన 84 రక్త సాంస్కృతిక (బ్లడ్ కల్చర్) నమూనాల్లో 64 (84 ) నెగటివ్‌గా తేలాయని, మిగిలినఫలితాలు 24 గంటల్లోవస్తాయన్నారు. గ్రామానికి సంబంధించిన డయాగ్నస్టిక్స్ పరీక్షా ఫలితాలను మెడికల్ కళాశాల బృందం సమీక్షిస్తోందని వివరాలు 24 గంటల్లో వెల్లడిస్తారన్నారు. గుంటూరు సమగ్ర ఆసుపత్రి నిపుణులు రక్తనమూనాల పరీక్షలలో అసాధారణ నివేదికలు ఉన్న రోగులకు వీశి సెషన్లు నిర్వహించి, మందులు సూచించటంతో పాటు మరింత స్కాన్లకు మార్గనిర్దేశం చేశారన్నారు. గ్రామంలో వైద్యారోగ్య శాఖ బృందాలు, 56 బలహీనగృహాలను (పడకగదిలో ఉన్నవారు, కదలలేనివారు, మార్జినల్వర్కర్స్, సంచార జీవులు) సందర్శించి ఆరోగ్య అవగాహన కల్పించి, అసరమైన మందులు అందిస్తునా న్నరన్నారు. గ్రామవీధుల్లో నిది కార్యక్రమాల ద్వారా వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత, సురక్షిత ఆహార అలవాట్లపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారన్నారు. వైద్యరోగ్య శాఖ రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ చైర్ పర్సన్ డా. ఎ. సిరి, ఆధ్వర్యంలో గ్రామ ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ అసాధారణ మరణాలపై విచారణ ఆరోగ్య పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు.

## నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ కోర్సు ఆధారంగా రూ.36,000 నుంచి రూ.64,000 వరకు వేతనం

**విజయవాడ,సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అందించి, వారికి ఉజ్వల భవిష్యత్తు చూపించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తొలిసారిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ), డీడీయూ జీకేవై (దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన) ద్వారా నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు.

ఇంటర్, డిగ్రీ, బీటెక్‌లో ఎన్ని మార్కులొచ్చినా ఉద్యోగం రావాలంటే ప్రతి విద్యార్థికి కనీస నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రైవేటు సంస్థల్లో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నా ఫీజు చెల్లించలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. ఏపీలో రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపకాభివృద్ధి (సీడాప్) విభాగం ఆధ్వర్యంలో ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తున్నారు. ప్రొడక్షన్ ఇంజినీర్ మల్టీ స్కిల్ టెక్నీషియన్ వేర్‌హౌస్ సూపర్‌వైజర్ కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ (నాన్ వాయిస్) రెస్టారెంట్ కెప్టెన్ ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్ స్పెషలిస్ట్ ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ అండ్ పెరిఫెరల్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. డొమైన్ కంప్యూటర్ ఇంటర్వ్యూ సాఫ్ట్ స్కిల్స్ స్పోకెన్ ఇంగ్లిష్‌లను నేర్పిస్తారు., ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో ఒప్పందం చేసుకున్నట్లు ఏపీ ఉపాధి కల్పన వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ (సీడాప్) ఛైర్మన్ దీపక్‌రెడ్డి తెలిపారు. యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. యువతకు ఉపాధిని కల్పించడమే తమ లక్ష్యంగా దాదాపు 24 సెక్టార్స్ లో శిక్షణ కోసం ఐఎస్ బీతో ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వన్ ఫ్యామిలీవన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదం సాకారం చేసేందుకు ఐఎస్ బీతో కొన్ని కోర్సులకు ఎంవోయూ చేసుకున్నామని అన్నారు. సెంచూరియన్ యూనివర్శిటీతోనూ గతంలో ఒప్పందం చేసుకున్నామనీ, శిక్షణలో 40 శాతం ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ లో రానున్న మూడు సంవత్సరాల్లో దాదాపు 22,000 ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. సీడాప్ ఒక నోడల్ ఏజెన్సీగా ఉండేలా సీఎం చంద్రబాబు దిశానిర్దేశంలో పని చేస్తుందని ఈ సందర్భంగా ఛైర్మన్ దీపక్‌రెడ్డి వివరించారు.

శిక్షణ పొందే యువతీ, యువకులకు ప్రత్యేక వసతి సదుపాయం ఉంది. రెండు జతల ఏకరూప దుస్తులు, బూట్లు, తదితరాలు అందిస్తారు. వివిధ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.



కళాశాల ఆవరణలో పరిశీలిస్తున్న జేయన్‌టియు ప్రతినిధి

## స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పరిశీలించిన జెఎన్‌టియు ప్రతినిధి

### ఈ యేడాది నుంచి తరగతులు ప్రారంభానికి సన్నాహాలు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** సుమారు 20 సంవత్సరాల పాటు దేవాదాయశాఖ అధ్వర్యంలో నిర్వహించిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల ఏడు సంవత్సరాల నుంచి మూత పడింది. ఈ కళాశాలను పునఃప్రారంభించటానికి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఉన్నత విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌తో పలు మార్లు చర్చించి అనుమతి సాధించారు. బుధవారం అనంతపురంనుంచి జేయన్‌టియు నుంచి ప్రతినిధి ఇక్కడి కళాశాలలో తరగతులు ప్రారంభించటానికి అనుకూల పరిస్థితులను పరిశీలించారు. రెండవ విడత కౌన్సెలింగ్‌లో చేరటానికి అవకాశం కల్పించారు. సోమవారం నుంచి మూడవ విడత కౌన్సెలింగ్ ప్రారంభం అయ్యాయి. ఈనేపథ్యంలో కొంత కాలంగా ప్రభుత్వం జేయన్‌టియుల మధ్య ప్రతిష్టంభన చోటు చేసుకుంది. ప్రభుత్వం మూడేళ్ళపాటు ఏడాదికి రూ.40కోట్లు చొప్పున రూ.120కోట్లు భరించుటకు నిర్ణయించింది. ఈ మేరకు ఒప్పందం కుదిరింది కానీ అధికారికంగా రాతమూలకంగా ఉత్తర్వులు వెలువడలేదని జేయన్‌టియు మౌనం వహించింది. దాంతో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రభుత్వంపై వత్తిడి తెచ్చారు. శ్రీకాళహస్తిలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో క్లాసులను ప్రారంభించుటకు ఉన్న సదుపాయాల్ని బుధవారం జేయన్‌టియు ప్రతినిధిగా కలికిరి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావును నియమించారు. ఆయన ఇక్కడ స్కిట్‌కళాశాలలో చేరే విద్యార్థులకు ఎలాంటి సదుపాయాలున్నాయి? ఎలాంటి ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉందో తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎంసెట్ మూడో కౌన్సెలింగ్ చేపట్టిందని జేయన్‌టియు పరిధిలోని నాలుగు కళాశాలల్లోనూ ఉన్నత విద్యాప్రమాణాలు, మెరుగైన ఉన్నత విద్యాప్రమాణాలు మెరుగైన వసతి సదుపాయాలుంటాయో ఇక్కడి కళాశాలలో కూడా అలాంటి ప్రమాణాలను పాటించటం జరుగుతుందని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి అపోహాలు వద్దన్నారు. అంతేకాక శ్రీకాళహస్తిలోని కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులకు ఎలాంటి సదుపాయాలు ఉన్నాయి? మొదటి సంవత్సరం విద్యాబోధనకు అవసరమైన కంప్యూటర్లు, ప్రయోగశాలలు, గ్రంధాలయం సదుపాయాలను పరిశీలించామన్నారు. అలాగే ఇక్కడ టీచింగ్‌కు సంబంధించి చర్చించారు. గతంలో ఇక్కడ జేయన్‌టియు రిజిస్ట్రార్ పర్యటించినపుడు సూచించిన మేరకు ఏర్పాట్లు జరిగాయా? లేదా? అని పరిశీలించినట్లు తెలిపారు. ఇక్కడ హాస్టల్స్‌ను బాలురు, బాలికలకు వేర్వేరుగా ఏర్పాట్లను పరిశీలించారు. మూడవ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు జేయన్‌టియు నాల్గవ కళాశాల స్కిట్‌లో వెబ్ ఆప్షన్లలో నమోదు చేసుకో వచ్చునని వివరించారు. ఆయనకు ఇక్కడ ఏర్పాట్లును పర్యవేక్షకులు సుధాకర్ వివరించారు. ట్యూషన్ ఫీజు రిఎంబర్స్‌మెంట్ పూర్తిగా ఉందన్నారు. ఇక్కడి కళాశాల జేయన్‌టి ఎస్‌కెఎసస్ ఎవ్‌కోడ్‌గా ఉందని వివరించారు.

## త్వరలో హుబ్లీ-గుంతకల్లు మధ్య మెమో రైలు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 10,ప్రభాతవార్త** అనంతపురం, కర్నూలు జిల్లాల మీదుగా గుంతకల్లు-హుబ్లీ-గుంతకల్లు మధ్య తిరిగే పాసింజర్ రైలు త్వరలో అత్యాధునిక యాంత్రిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెమో రైలు బోగీలతో నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం హుబ్లీ-గుంతకల్లు-హుబ్లీ మధ్య తిరిగే నెంబర్ 56911/12పాసింజర్ రైలు సర్వీసులకు రైల్వే శాఖ 18ఐసిఎఫ్ కన్వెన్షనల్ బోగీలతో కూడిన ఫార్మేషన్‌తో నడుపుతుంది. ఈ రైలుకు రానున్న రోజుల్లో విద్యుత్ ప్రధాన రైలు మార్గంలో నడిపేందుకు సౌకర్యంగా మల్టిపుల్ యూనిట్ రైలు సర్వీసులను అందుబాటులో తెచ్చారు. అత్యాధునిక యాంత్రిక, సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ మెమో రైలు బోగీలతో నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

### సత్యసాయి శతజయంతి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసిన రైల్వే

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 10,ప్రభాతవార్త** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు నవంబరు 23న జరుగనున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే యాత్రికుల సౌకర్యార్థం 9 రైలు సర్వీసులకు నవంబరు 17నుంచి 30వరకు సత్యసాయి ప్రశాంతి నిలయం(పుట్టపర్తి)లో తాత్కాలికంగా అదనపు హాల్టింగ్(స్టాపింగ్) సదుపాయం కల్పించడంతో పాటు మరో 25రైలు సర్వీసులకు నవంబరు 15నుంచి 30వరకు తాత్కాలికంగా పెనుకొండ, సత్యసాయి ప్రశాంతి నిలయం(పుట్టపర్తి), ధర్మవరంల మీదుగా మళ్లించారు.



## మియాపూర్‌లో సిఎంఆర్ షాపింగ్ మాల్ ఘనంగా ప్రారంభం

**హైదరాబాదు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలలో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ బుధవారం మియాపూర్‌లో అధునాతన షాపింగ్ మాల్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించింది. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చేతులుమీదుగా ఈ షాఫింగ్ మాల్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎంఆర్ వ్యవస్థాపకులు, చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ సంస్థను గత నాలుగు దశాబ్దాలుగా ఏపీ, తెలంగాణ ప్రజలు ఆదరిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలలో 40కు పైగా శాఖలను ప్రారంభించటం చాలా సంతోషంగా ఉందని ఆయన వివరించారు. సీఎంఆర్ షాపింగ్ అంటే ప్రపంచ స్థాయి అనుభూతి కలిగేలా వుంటుందన్నారు. ప్రజలు తమకు కావాల్సిన అన్నిరకాల వేడుకలకు సి.ఎం.ఆర్. తగు విధంగా అన్ని మోడల్స్‌ను కుటుంబమంతటికీ నచ్చే విధంగా వస్త్రాలు అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ధరలకే అందించటం సి.ఎం.ఆర్. ప్రత్యేకత అని వివరించారు. తమ సొంత మగ్గాలపై నేయించిన వస్త్రాలను మార్కెట్లో మరెవ్వరూ ఇవ్వని ధరలకు సీఎంఆర్ అందిస్తోందన్నారు. హైదరాబాద్లో మొట్టమొదటి సి.ఎం.ఆర్. జ్యూయలరీ సంస్థను మూడు అంతస్తులలో ఆరంభించి అత్యాధునిక డిజైన్లతో విస్తృతశ్రేణి బంగారు ఆభరణాలు అందిస్తున్నారు, ప్రారంభోత్సవ కానుకగా బంగారు ఆభరణాలపై ఫ్లాట్ 9 శాతం తరుగు, 1 కేజీ సిల్వర్ కొనుగోలుపై రూ.12,500 తగ్గింపు. ఇస్తున్నట్లు మావూరి వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీతార మృణాల్ ఠాకూర్, బుల్లిరాజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మృణాల్ ఠాకూర్ జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం అన్ని సెక్షన్లు తిరిగి అన్ని రకాల వస్త్రాలను పరిశీలించి, ఇక్కడ అన్ని రకాల వస్త్రాలు నాణ్యత చాలా బాగుందని, సరసమైన ధరలకు లభిస్తున్నాయన్నారు. రిటైర్డ్ ఐఎస్ అధికారులు దాసరి శ్రీనివాసులు, ఉమా మల్లేశ్వరరావు, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్.డి.పి.టి.) చైర్మన్ శ్రీకాంత్, కార్పొరేటర్ మాధవరం జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వేదోక్తంగా సంకటహర చతుర్థి వేడుకలు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారి ఆలయంలో వేంచేసియున్న శ్రీ గణేశునికి సంకటహర చతుర్థి వేడుకలను బుధవారం వేదోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూర్ణాహుతిలో ఇఓ వికె శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు. - దుర్గమ్మవారి సేవలో ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరి: దుర్గమ్మ వారిని బుధవారం రాష్ట్ర దేవదాయ శాఖ నూతన ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మ వారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను ఇఓ అందించారు. వేదపండితుల వేదాశీర్వచనాలు పలికారు. -దసరా ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరం: రాబోయే దసరా ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు. ఇఓ వికె శీనా నాయక్ పనులు వేగం గా నిర్వ హించి నటానికి గాను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ అక్కడే పలు సూచనలు ఆదేశాలు జారీ చేస్తూన్నారు.



హరిజవహర్‌లాల్ దంపతులకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న ఇఓ



సుజనాచౌదరికి దసరా ఆహ్వానం అందిస్తున్న ఇఓ

-సుజనా చౌదరికి ఆహ్వానం: రాబోయే దసరా ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను విజయవాడ ఎమ్మెల్యే సుజనా చౌదరికి ఇఓ వికె శీనా నాయక్, దేవాలయ అధికారులు, వేదపండితులు బుధవారం నాడు అందించారు.

## నేపాల్ జైళ్లనుంచి ఏడువేలమంది ఖైదీల పరార్



**ఖాట్మండు, సెప్టెంబరు 10:** దేశంలో వెల్లువెత్తిన హింసాత్మక సంఘటనలు రోజురోజుకూ తీవ్రతరం అవుతున్నాయి. మరోపక్క సంఘ విద్రోహశక్తులు కూడా పాలు పంచుకుంటున్నట్లు పాలకులు అనుమానిస్తున్నారు. ఈక్రమంలో నేపాల్‌లోని జైళ్లలో ఉన్న ఏడు వేల మంది ఖైదీలు పరారయ్యారు. నౌబస్తా లోని ఓ బాలసదనంలో భద్రతా బలగాలతో జరిగిన ఘర్షణల్లో ఐదుగురు మైనర్లు మృతిచెందారు. సిబ్బందినుంచి ఆయుధాల్లాక్కుని పరారయ్యే ప్రయత్నం చేసారని, ఈక్రమంలో సిబ్బంది కాల్పుల్లో ప్రాణాలు విడిచినట్లు తేలింది. జైళ్లలో నిప్పుపెట్టి భద్రతా సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసి దేశవ్యాప్తం గా జైళ్లనుంచి సుమారు 7వేల మందికిపైగా ఖైదీలు పరారయ్యారు. రాజ్‌బిరాజ్, ఝుంప్కా, ఢిల్లీ బజార్, చిట్వాన్, నక్కూ, కైలాలి, జాలేశ్వర్ తదితర జైళ్లనుంచి వేలమంది తప్పించుకున్నారు నౌబస్తా బాలసదనం నుంచి 76 మందిమైనర్లు పరారయ్యారు. ఖైదీలనుంచి ప్రాణభయంతో అనేకమందిబాధితులు ఇళ్లు వదిలి వెళ్లిపోతున్నారు. సింధూలిగడీ జైల్లోఖైదీలు నిప్పుపెట్టి అక్కడినుంచి 43 మంది మహిళలు సహా మొత్తం 471మంది పరారయ్యారని అధికారులు తెలిపారు. నవాల్ పరాసీ వెస్ట్‌జిల్లా జైలునుంచి 500 మందికిపైగా తప్పించుకున్నా రు.

ఢిల్లీబజార్ జైలునుంచి పరారయ్యేందుకు యత్నించిన ఖైదీని స్థానికులు పట్టుకుని సైనికులకు అప్పగించారు. ఉత్తరప్రదేశ్‌లోనిసిద్ధార్థనగర్‌జిల్లాలోకి చొరబడేందుకు యత్నించిన ఐదుగురు ఖైదీలను సశస్త్రసీమాబల్ అదుపులోకి తీసుకుంది. ఇదిలాఉంటే మూతపడిన త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అధికారులు తిరిగి పునరుద్ధరిం చారు.

## యూరియా సరఫరాలో కేంద్రం విఫలం: రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నర్సారెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రా నికి సరిపడా యూరియాను సకాలంలో అందించడంలో కేంద్రం విఫలమైందని తెలంగాణ రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు శేర్ నర్సా రెడ్డి విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతూ రైతులు ఆందోళనలు చేస్తున్నారన్నారు. అయినా కేంద్ర మంత్రులు పట్టించుకోవడం లేదని చెప్పారు. యూరియా సరఫరాపై కేంద్రం వివక్ష చూపుతోందన్నారు. తెలంగాణకు రావాల్సిన యూరియా వాటాను కేంద్రం విడుదల చేయాలన్నారు.

## నైతిక విజయం ఇండియా కూటమిదే

### తెలంగాణ ఎంపిల కన్వీనర్ మల్లురవి

### విజయాలు అంతిమ అజెండా కాదు: చామల

**హైదరాబాద్,సెప్టెంబరు10,ప్రభాతవార్త:** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సిద్ధాంతికంగా నైతికంగా ఇండియా కూటమికి విజయం లభించిందని తెలంగాణ ఎంపిల కన్వీనర్ మల్లురవి అన్నారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లౌకిక పార్టీలను కూడగట్టి సమన్వయంతో ఎన్నికల పోరాటం చేసిందని అన్నారు. ఓ ఆదర్శవంతమైన అంశాన్ని 'ఇండియా' కూటమి దేశ ప్రజల ముందుంచిందని ఆయన తెలిపారు. భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఉపరాష్ట్రపతి ఎన్నికల ఫలితాలపై మాట్లాడుతూ విజయాలు అంతిమ ఎజెండా కాదని అని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటం కోసం ప్రయత్నం మొదలైందని తెలిపారు. ఈ దేశ ప్రజలు వినడానికి ఒక స్వరం, ఓటు వేయడానికి ఒక స్వరం ఉండేలా చూసుకోవడం ఇండియా కూటమి ఎజెండా అవుతుందని ఆయన తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలతో ముఖ్యంగా బి. సుదర్శన్ రెడ్డితో చర్చలు జరపడానికి మేము మా వంతు ప్రయత్నం చేసాము, వారికి అపారమైన మద్దతు లభించింది.బహుశా నేడు కొంతమంది సభ్యులు ఓటువేసి ఉండకపోవచ్చు. కానీ ఆయన దేశ వ్యాప్తంగా పర్యటించినప్పుడు అఖండ స్పందన వచ్చిందని చామల అన్నారు. కొత్తగా ఎన్నికైన ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఇండియా కూటమి అభినందించిందని తెలిపారు.

## సిఎంతో నే తెలంగాణ యువతకు భరోసా

### రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

**హైదరాబాద్, సెప్టెంబరు 10,ప్రభాతవార్త:** రేవంత్‌రెడ్డితోనే తెలంగాణ యువతకు భరోసా ఉంటుందని,బిఆర్ఎస్ నాయకులు రెచ్చగొట్టేమాటలు నమ్మకండని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. గాంధీ భవన్‌లో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ మాట్లాడుతూ టిజిపిఎస్‌సిపై హైకోర్ట్ చెప్పిన తీర్పులో కాంగ్రెస్‌పార్టీని కానీ ప్రభుత్వాన్ని ఎక్కడ ఒక్క మాట అనలేదని ఆయన వివరించారు. ఏలాంటి అవకతవకలు జరగలేదు లక్ష మందికి ఉద్యోగాలు ఇస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు. పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరిస్తున్నాను అవాస్తవాలు రెచ్చగొట్టే మాటలు మానుకో లేదంటే మాటలు కాదు చేతలతో చూపించాల్సి వస్తది జాగ్రత్త అని ఆయన అన్నారు. యువత ఆందోళన చెందాల్సిన అవసరం లేదు ఏ నిరుద్యోగికి నష్టం జరగకుండా చూసుకుంటుందని అన్నారు. మా ప్రభుత్వం ఈ పార్టీలా కేసుపెడుతూ పోతేతోందని, పాడి కౌశిక్ మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని ఆయన సూచించారు.



స్వామి వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలలో ప్రసంగిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

## సంస్కారం లేని విద్య ఎందుకూ పనికిరాదు

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్ (ముషీరాబాద్), సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** విద్యతో పాటు ప్రతి ఒక్కరూ సంస్కారం అలవర్చుకోవాలని, సంస్కారం లేని విద్య ఎందుకూ పనికిరాదని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బుధవారం దోమలగూడలోని రామకృష్ణ మఠంలో స్వామి వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై వెంకయ్యనాయుడు మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను, కుటుంబ వ్యవస్థను కాపాడుకో వల్సిన అవసరం ఉందని, అందుకే తన వంతుగా వీటిని నేటి యువతకు తెలియచేయటం కోసం దేశవ్యాప్తంగా తిరుగుతున్నానని తెలిపారు. తాను పదవి నుంచి విరమణ పొందానని, పెదవి నుంచి కాదని, అందుకే నాకు తెలిసిన మంచి విషయాలను యువతకు తెలియచేయటం కోసం కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రామకృష్ణమఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద, స్వామి నిత్యాముక్తానందజీ, స్వామి జ్ఞాననందజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారి ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ సాయం

తెనాలి టౌన్ సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త): అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక చిన్నారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సాయం లభించింది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని గంగానమ్మపేటకు చెందిన శరత్ కుమార్ తేజస్విని దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్న తమ చిన్నారి వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవతో రు.2.50లక్షలు మంజూరు అయ్యాయి.ఈ చెక్కును,బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో,తెనాలి పట్టణ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ కుద్దూస్,పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి వసంత అశోక్, పట్టణ టీడీ సెల్ అధ్యక్షులు ఫణిదుర్గ,తెనాలి మండల పార్టీ మాజీ అధ్యక్షులు కేసన కోటేశ్వరరావు చేతుల మీదుగా చిన్నారి కుటుంబ సభ్యులకు అందజేశారు.



## వ్యాధులు వ్యాప్తిచేసే దోమలపట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎంహెచ్ఓ ఏసుబాబు

తెనాలి మున్సిపాలిటీ సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త): దోమలద్వారావ్యాపించు వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని,మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా ఏసుబాబు పట్టణ ప్రజలను సూచించారు. బుధవారం,పట్టణంలోని 17వ వార్డు అలీఖాన్ వీధి, కావేటివారి వీధి,మసీదువంటిచోట్ల సందు ప్రాంతాల్లో జరుగుతున్న ప్రత్యేకపారిశుద్ధ్య పనులను మరియు సిబ్బందితో కలిసి పరిశీలించారు. దోమల నిర్మూలనకు శానిటరీ సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో, అధికారులు, మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు జన్మదిన వేడుక

తెనాలి టౌన్ సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త):మాజీమంత్రి,వేమూరు శాసనసభ్యులు,తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు 60వ జన్మదిన వేడుకలను పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో,పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎండి. కుద్దూస్ మాట్లాడుతూ, నాయకత్వ లక్షణాలు కలిగి, తెలుగుదేశం పార్టీలో తెలుగు యువత విభాగం ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేసి,జిల్లా తెలుగు యువత అధ్యక్షులుగా,వేమూరు శాసనసభ్యులుగా, మంత్రిగాప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం తపించే వ్యక్తిగా, నిలిచారన్నారు. పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వసంత అశోక్, మాజీ పట్టణ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కేసన కోటేశ్వరరావు,రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్,పట్టణ టీడీ సెల్ అధ్యక్షులు పణిదుర్గ ఉపాధ్యక్షులు సుభాన్ బాబు,అలాగే కౌన్సిలర్ నాయకులు వంగాల సాంబిరెడ్డి,డాక్టర్ వేమూరి శేషగిరిరావు,డాక్టర్ ఆవుల వజ్రవల్లి, మహిళా నాయకురాళ్లు పరుచూరి రమ్య,కొండ రాజశేఖర్, సీనియర్ నాయకులు కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# వరదసహాయ చర్యలను ముమ్మరం చేయండి

### రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బుధవారం సచివాలయంలో వరదసాయక చర్యలపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** ఇటీవల రాష్ట్రంలో ప్రధానంగా కామారెడ్డి,మెదక్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.సిఎం రేవంత్ రెడ్డి సూచనలతో బుధవారం డాక్టర్‌బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో భారీ వర్షాలతో జరిగిన నష్టం,ఇప్పటివరకు తీసుకున్న సహాయక చర్యలపై ఆయా శాఖలవారీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు,రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణా విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సుల్తానియాతో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో చాలా వరకు ప్రాణ,ఆస్తి నష్టం తగ్గిందన్నారు.సహాయక పనులను మరింత వేగవంతం చేయాలని ఇప్పటివరకు పరిహారాలను విడుదల చేయక పోతే వాటిని వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు. ఏ ఒక్క బాధితుడు పరిహారం కోసం ఎదురుచూడాల్సి న పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలతో తీవ్రంగాదెబ్బతిన్న జిల్లాలకు రూ.10 కోట్లు,సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు రూ.5 కోట్లను విడుదల చేశామన్నారు.సహాయక చర్యలను ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని హైదరాబాద్‌నుంచి ఆయా విభాగాధిపతులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.వరద సహాయానికి సంబంధించి వినియోగించిన నిధులకు యూసీలను కేంద్రానికి అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమావేశంలో మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 13వ తేదీలోగా ఆయా విభాగాలు యూసీలను సమర్పించాలని ఆదేశించారు.అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ సమావేశంలో ఇరిగేషన్, పంచాయితీరాజ్, హెల్త్, మున్సిపల్, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**జర్నలిస్టుల సమస్యలపై మంత్రి పొంగులేటి సమీక్ష**

నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐ పిఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక, సీపీఆర్‌వో జి.మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వ హించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ,జర్నలిస్టుల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశాలపై కార్మిక, ఆరోగ్య, హోం, ఆర్థికశాఖ అధికా రులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

## ఎల్లంపల్లిని ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేసిన కెసిఆర్

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, సెప్టెంబరు 10,ప్రభాతవార్త:** ఎల్లంపల్లి ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించకుండా కెసిఆర్ నిర్లక్ష్యం చేశారని కాళేశ్వరం ప్రారంభత్సోవానికి మాత్రం ఇద్దరు ముఖ్యమంత్రులను తీసుకొచ్చారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం సిఎల్‌పి మీడియా సెంటర్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టును మేమే నిర్మించామన్నట్లుగా హరీష్ రావు తెగ ఊదరగొడుతున్నాడని ఎల్లంపల్లికి బిఆర్ఎస్‌కు ఏం సంబంధం? ఎల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక అని అన్నారు. 2004 జూలై28 అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎల్లంపల్లికి శంకుస్థాపన చేశారని, నిర్మాణం పూర్తి చేసింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అని చరిత్రను వివరించారు.ఎల్లంపల్లిని ప్రారంభిస్తే కాంగ్రెస్ కు పేరు వస్తుందన్న భయంతో ఇప్పటి వరకు అధికారికంగా ప్రారంభోత్సం లేకుండా చేశారని ఆవేదన చెందారు. బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎల్లంపల్లితో ఏలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు.ప్రాణహిత చేవేళ్ల ను రద్దు చేసి కెసిఆర్ కాళేశ్వరం తీసుకువచ్చాడని అన్నారు.. లక్షన్నర కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మిస్తే బ్యారేజీలు పనికి రాకుండా పోయాయని ఆవేదన చెందారు.తెలంగాణ ప్రజల సొమ్ముతో నిర్మించిన రిజర్వాయర్లు, కాలువలను కూడా ఉపయోగించుకోవద్దని హరీష్ రావు అంటున్నాడని ఆరోపించారు. మల్లన్న సాగర్ 50 టిఎంసిల సామర్థంతో నిర్మించడం వల్లే గోదావరి జలాలు ఫేజ్ 2 ను మల్లన్న సాగర్ నుంచి తీసుకుంటున్నామని ఆయన అన్నారు. కాళేశ్వరం నిర్మించింది తమరే,కూల్చింది కూడా తమరే ఈ విషయం తెలంగాణ ప్రజలకు తెలుసు నువ్వు కాళేశ్వరరావు కాదు నువ్వు కరప్షన్ రావు, కలెక్షన్ రావు అని కవితనే సర్టిఫికెట్ ఇచ్చిందని ఆయన అన్నారు.అయినా సిగ్గులేకుండా మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతున్నావు..కరప్షన్ రావు ముందు కవితారావు అడిగిన ప్రశ్నలకు ప్రెస్ మీట్ ప్రెస్‌మీట్ పెట్టి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కవిత చెప్పింది అబద్దమైతే ఆమె పైన పరువు నష్టందావా వేయ్యాలని సూచించారు. కోర్టుకు ఈడ్చుఆమె ఇంటి ధర్నా చేయి,క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయి అని అన్నారు. హరీష్ రావు నీకాళేశ్వరం కహానీలను సిబిఐ త్వరలోనే తేల్చుతుందని మీలాగాదోచుకుతినే బుద్ది మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేదని ఆయన అన్నారు.

## అమరవీరుల జ్ఞాపకార్ధం స్తూపం ఏర్పాటు: విహెచ్

**హైదరాబాద్ సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలోని 1948లో స్వాతంత్ర ఉద్యమంలో అసువలు బాసిన 10 మంది అమరవీరులు జ్ఞాపకార్థం స్తూపాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తెలిపారు. భారత దేశానికి 15 ఆగస్టు 1947 లో స్వాతంత్రం వచ్చిన ఆ నాడు ఇక్కడ నిజం సర్కారు రజాకర్ల పాలన కొనసాగించిన సమయంలో శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని ప్రస్తుతం ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 1948లో జాతీయ జండా ఎగురవేసినందుకు నిజం సర్కారు సైనికులు కాల్పులు జరపగా 10 మంది బలైన సంఘటన స్థలంలోనే, వారి జ్ఞాపకార్ధంగా ఈ స్థూపాన్ని ఏర్పాటు



అమరవీరుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేయబోయే స్థూపం

చేయడం జరిగిందని వి.హెచ్ తెలిపారు.భారతదేశ స్వాతంత్ర ఉద్యమ చరిత్రను వెలికి తీసి ఉల్లాల గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ స్థూపని ఈ శుక్రవారం 12 సెప్టెంబర్ రోజున 03:30 గంటలకు, టిపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇంచార్జి విశ్వనాథ్ తో పాటు నల్గొండ జిల్లాకు చెందిన మంత్రులు, ఇంచార్జి మంత్రి, జిల్లాకు సంబంధించిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు పాల్గొంటారు.కావున కాంగ్రెస్ నాయకులు, సేవాదళ్, మహిళా, యువజన కాంగ్రెస్, ఎన్.ఎస్.యు.ఐ, ఇతర అనుబంధ సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు నివాళాలు అర్పించాలని వి.హెచ్ కోరారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆధార్ కార్డులో తప్పులు సరి చేయండి

### కలెక్టర్లను ఆదేశించిన హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్

**హైదరాబాద్,సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లబ్ధిదారులకు నగదు చెల్లింపు అంశంలో అవకతవకలు జరగకుండా చూడటం కోసం ఆధార్ ఆధారిత పేమెంట్స్‌ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే ఈ విధానంలో కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. చాలా మంది లబ్ధిదారులు వివరాలు.. వారి ఆధార్ కార్డ్ వివరాలతో సరిపోలడం లేదు. దీంతో పేమెంట్స్ ఆగిపోయి.. లబ్ధిదారులు ఆందోళన పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ఇందిరమ్మ ఇళ్ళ పథకం అమలును.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. సొంతంగా ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థికంగా సాయం చేయడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు కూడా దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. తొలి విడతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ప్రస్తుతం ఇవన్ని నిర్మాణ దశల్లో ఉన్నాయి. కొన్ని పూర్తి కావొచ్చాయి కూడా. ఇక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర సర్కార్ రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కీలక అలర్ట్ జారీ చేసింది. మరీ ముఖ్యంగా ఆధార్ కార్డుల్లో తప్పులున్న వారి కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నగదు చెల్లింపుల కోసం రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. లబ్ధిదారులకు సంబంధించి నగదు చెల్లింపులను ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ ద్వారా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీని వల్ల పథకం అమలులో పారదర్శకతతో పాటు వేగంగా చెల్లింపులు చేసేందుకు వీలుగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చెల్లింపుల వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. అయితే ఇప్పుడు ఇదే పెద్ద తలనొప్పి వ్యవహారంగా మారింది. ఆధార్ ఆధారిత చెల్లింపుల నేపథ్యంలో చాలా వరకు లబ్ధిదారుల వివరాలు.. వారి ఆధార్ కార్డ్‌లో ఉన్న వివరాలతో సరిపోలడం లేదని తెలుస్తోంది. మొత్తం లబ్ధిదారుల్లో సుమారు 30 శాతంమంది ఇదే సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఆధార్ వివరాలు సరిపోకపోవడం వల్ల.. పేమెంట్స్ ఆగిపోతాయని అధికారులు చెప్పుకొస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వారికి ఊరట కలిగించే ప్రకటన చేసింది. లబ్ధిదారుల ఆధార్ వివరాల్లో ఏమైనా తప్పులు ఉంటే వెంటనే సరిదిద్దాలని హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లనిర్మాణం పనులు వేగం పుంజుకుంటున్నాయి. ఇప్పటికే కొందరు ఇంటి నిర్మాణం పూర్తి చేయగా.. మరికొన్ని ఇళ్ల విషయానికి వస్తే బేస్‌మెంట్,గోడలు,స్లాబ్ లెవల్‌లో నిర్మాణాలు ఉన్నాయి. త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు కోరుతున్నారు. ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నారు. ఈక్రమంలో అధికారులు ఇంటి నిర్మాణం త్వరగా పూర్తయ్యేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

## మానసిక సమస్యలకు టెక్నాలజీ పరిష్కారం చూపించగలదు: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** సమాజంలో వేగంగా పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన తదితర మానసిక సమస్యలకు పరిష్కారం చూపించగల సామర్థ్యం టెక్నాలజీకి ఉందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సైబర్ హోప్ హెల్ప్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఏఐ ఆధారిత మెంటల్ హెల్త్ సపోర్ట్ సిస్టం హోప్ ఐను ఆయన బుధవారం రాయదుర్గంలోని టి హబ్‌లో లాంఛనంగా ఆవిష్కరించారు. ఇన్నోవేషన్ హబ్‌గా తెలంగాణ తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఈ సందర్భంగా వివరించారు. ప్రజల




ప్రాణాలను కాపాడే ఆవిష్కరణలకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ఆ దిశగా దృష్టి సారించి ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవాలని యువ ఆవిష్కర్తలకు సూచించారు.

కార్యక్రమంలో టి హబ్ సిఈఓ కవి కృత్, సైబర్‌హోప్ హెల్ప్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ ఛైర్మన్ ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పెట్రోలియం, గ్యాస్ సరఫరా, రవాణా భద్రతపై సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్రోలియం, గ్యాస్ రవాణా, సరఫరాకు సంబంధించి డిజిపి జితేందర్ నేతృత్వంలో బుధవారం నాడు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, సిఐడి చీఫ్ చారు సిన్హా, గేల్ సెక్యూరిటీ సలహాదారుగా వున్న సీనియర్ ఐపిఎస్ అధికారి సౌరబ్ తొలుంబియా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ ఆన్‌షోర్‌గా పిలువబడే ఈ సమావేశం పోలీసు శాఖలో ఎంతో ముఖ్యమైనదని అన్నారు. పెట్రోలియం, గ్యాస్ సరఫరా, రవాణా భద్రతకు రాష్ట్రంలో ప్రాధాన్యత వుంటుందని ఆయన పేర్కొన్నారు. భౌతిక భద్రతతో పాటు సైబర్‌కు సంబంధించిన




ఆన్‌షోర్ సెక్యూరిటీ కో..ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి జితేందర్, చిత్రంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ తదితరులున్నారు

భద్రత కూడా పెట్రో లియం కంపెనీలకు ముఖ్యంగా మారిందని ఆయన తెలిపారు. పెట్రోలియం కంపెనీలకు తెలంగాణలో భద్రత విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని, అయితే సైబర్ నేరాల విషయంలో మరింత అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుందని డిజిపి తెలిపారు. పెట్రోలియం కంపెనీలు భద్రతకు సంబంధించి అత్యున్నత ప్రమాణాలను పాటించాలని ఆయన కోరారు. పెట్రోలియం, గ్యాస్ సరఫరా సమయం లో జరిగే చోరీల విషయంలో కంపెనీలు జాగ్రత్తగా వుండాలని ఆయన కోరారు. ఈ చోరీల వల్ల అనేక సార్లు ప్రమాదాలు జరిగి మర ణాలు సంభవిస్తున్నాయని, ఈ విషయంలో కఠినంగా వుండా లని డిజిపి పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాచ కొండ కమిషనర్ సుధీర్ బాబు, సైబరాబాద్ కమి షనర్ అవినాష్ మొహంతి, కో..ఆర్డినేషన్ ఐజి శ్రీనివాసులు. సిటీ పరిపాలనా విభాగంజాయింట్ పోలీసుకమిషనర్.

## తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించాలి

### రెవెన్యూ మంత్రి పొంగులేటిని కోరిన ట్రెసా

**హైదరాబాద్,సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖ పటిష్టతకు అనేక చర్యలు చేపట్టి 5,601 మంది జీపీవో నియామకం, సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చి 33 మందికి పదోన్నతి కల్పించటం పట్ల తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వంగ రవీందర్ రెడ్డి, కే గౌతమ్ కుమార్ లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.బుధవారం మంత్రిని సచివాలయంలో కలిశారు.ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు 45 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించారనికొనియాడారు.ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులపై ఉంచిన నమ్మకాన్ని నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసి నిలబెట్టుకుంటామన్నారు. 33 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ లకి సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు గా పదోన్నతితో ప్రారంభమైన ఈ ప్రమోషన్ల ప్రక్రియను కింది స్థాయి వరకు కొనసాగించినట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. వెంటనే తహశీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ప్రమోషన్ల ప్రక్రియను చేపట్టి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మంత్రిని కోరారు.కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్, డిప్యూటీ కలెక్టర్లు కె.చంద్రకళ, ఉపేందర్ రెడ్డి,రాజేశ్వరి, ట్రెసా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు అన్వర్, సెక్రటరీ వాణిరెడ్డి, మాజీ వీఆర్వోల సంఘం అధ్యక్షుడు గోల్కొండ సతీష్ ఉన్నారు.

## తలసరి ఆదాయంలో తెలంగాణను నంబర్1గా నిలిపిన సిఎం రేవంత్

### టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు10,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆర్థిక క్రమశిక్షణతో వ్యవహరించడంతో 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ తలసరి ఆదాయంలో దేశంలో నెంబర్1 నిలిపారని టిపిసిసి చీఫ్‌బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో అభినందించారు.తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.87లకు నమోదు కావడం హర్షణీమని అన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సామాజికన్యాయంతపాటు అభివృద్ధిఫలాలలో అందరికి సమాన అవకాశం కల్పించడానికి అనుగుణంగా పాలనముందుకు సాగుతోందని ఈ ప్రయత్నం విజయంసాధించబోతుందని మహేష్‌కుమార్ ఆశాభావం వ్యక్తంచేశారు.

## కాంగ్రెస్ సంస్థాగత అభివృద్ధికి మహేష్‌కుమార్ కృషి: కంది శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు 10,ప్రభాతవార్త:** ప్రభుత్వంను పార్టీని సమన్వయం చేస్తూ కాంగ్రెస్‌పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి గతసంవత్సరకాలంగా టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ ఎంతగానో కృషిచేస్తున్నారని ఆదిలాబాద్ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఏడాది పూర్తిచేసుకొన్న సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో "మహా అన్నదానం" నిర్వహించినారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ సంవత్సరకాలంగా మంత్రులతో ముఖాముఖి వంటి కార్యక్రమాలతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ గాంధీభవన్‌కు మంత్రులను తీసుకొచ్చి ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉంచారని అన్నారు. ఎఐసిసి ఇంచార్జితో కలిసి పాదయాత్రలు చేయడం రాత్రి గ్రామాలలో బసచేయడం తెల్లవారి శ్రమదానం చేయడం వంటికార్యక్రమాలు ఆయన పదవికి వన్నెతెచ్చాయని ఆయన కొనియాడారు.

## పనిచేసిన కార్యకర్తలకు చోటు

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్



**హైదరాబాద్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** స్వార్థం లేకుండా, నిబద్ధతతో పని చేసిన కార్యకర్తలకు చోటు కల్పించారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేము ల అశోక్‌అన్నారు. బుధవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సాధారణ కార్యకర్తగా ఉన్న నన్ను బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన సందర్భంలో, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావుకి, జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాకి, కేంద్రమంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గత 47 సంవత్సరాలుగా స్వయంసేవక్‌గా, 30ఏళ్లుగా బిజెపిలో వివిధ హోదా ల్లో సేవలందిస్తూ, వృత్తిరీత్యా న్యాయవాదిగా ఉన్న నన్ను, దేశం, రాష్ట్రం కోసం ప్రజల అవసరాలను తీర్చే ఆలోచన విధానంతో బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గొప్ప బాధ్యతలు అప్పగించడం గర్వకారణంగా ఉందన్నారు. కొంతమంది బిజెపిపై, నూతన కమిటీల విషయంలో తప్పుడు వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## ప్రజలను మోసం చేస్తున్న 'కూటమి' ప్రభుత్వం: సిపిఐ

తెనాలి టౌన్ సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త):రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ)నాయకులు విమర్శించారు. పట్టణంలోని గాంధీ నగర్ లో ఉన్న సిపిఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శులు మాల్యాద్రి,మేడ హనుమంత రావు లు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తమ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.దేశంలో ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఎలక్ట్రోరల్ బాండ్లు, ఓటు స్కామ్,ద్రవ్యోల్బణం, నిరుద్యోగం,వంటి సమస్యలు ఇంకా అపరిష్కృతం గానే మిగిలిపోయాయన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా మాటల్లోనే అభివృద్ధి చూపిస్తుందని,చేతల్లో ఎక్కడా అభివృద్ధి లేదని,అధికారంలోకి వచ్చిన సంవత్సరన్నర కాలంలోనే లక్షన్నర కోట్లు అప్పు చేసిందని,అలాగే భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి పంట నష్టం ఇంతతవరకు అందించలేదని, అలాగే రైతులకు యూరియా తగినంత సరఫరా లేదని వారు ఆరోపించారు. అలాగే సెప్టెంబర్ నెలలో ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో జరుగునున్న సిపిఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

11-09pg10exHMNWJQET 12 GNT_11-09pg10exHMNWJQET.qxd 9/11/2025 12:34 AM Page 1



# పాక్‌కు ఘోర అవమానాలు

## మూడింటిలో దారుణ ఓటమి

### భారత్, పాక్ మధ్య ఓల్టేజ్ మ్యాచ్‌లు

**న్యూఢిల్లీ:** ఈ నెల 14న 2025 ఆసియా కప్‌లో భారత్-పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి. భారత్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. క్రికెట్ చరిత్రలో భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్రమైన పోటీ కొన్ని ఉత్తేజకరమైన మ్యాచ్‌లను అందించింది. అయితే, కొన్నిసార్లు పాకిస్థాన్ తమ చిరకాల ప్రత్యర్థితో ఆడినప్పుడు దారుణమైన ఓటములను ఎదుర్కొంది. ఈ ఓటములు కేవలం మ్యాచ్‌లు ఓడిపోవడం మాత్రమే కాదు. అవి దేశానికి అవమానకరమైన సందర్భాలుగా మిగిలిపోయాయి. ఈ పరాజయాలు భారీ ఓటములుగా, ఊహించని షాక్‌లుగా గుర్తిండిపోయాయి. 1980లలో పాకిస్తాన్ జట్టు చాలా బలంగా ఉండేది. 1985లో షార్జాలో భారత్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో వారి బౌలింగ్ అద్భుతంగా కనిపించింది. రవి శాస్త్రి, సునీల్ గవాస్కర్ వంటి దిగ్గజాలు పెద్దగా రాణించకపోయినప్పటికీ, అప్పటి కెప్టెన్ కపిల్ దేవ్, మొహమ్మద్ అజారుద్దీన్ జట్టును 125 పరుగుల గౌరవప్రదమైన స్కోర్‌కు చేర్చారు. ఈ లక్ష్యం పాకిస్తాన్‌కు చాలా సులభం అని అందరూ అనుకున్నారు. కానీ, పాకిస్తాన్ బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. కేవలం 87 పరుగులకే ఆలౌట్ అయ్యి, భారీ ఓటమిని చవిచూశారు. అలాగే గత ఏషియా కప్‌లో కొలంబోలో జరిగిన ఈ మ్యాచ్ పాకిస్తాన్ అభిమానులకు పీడకలగా మిగిలిపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ అద్భుతమైన సెంచరీల సాయంతో 356 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఈ లక్ష్య ఛేదనలో పాకిస్తాన్ కేవలం 32 ఓవర్లలో 128 పరుగులకే ఆలౌట్ అయ్యింది. భారత్ చేతిలో 228 పరుగుల తేడాతో ఓటమి పాలయ్యారు. ఇది పాకిస్తాన్‌కు భారత్ చేతిలో ఎదురైన అతి పెద్ద పరాజయాల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఇక భారత్ చేతిలో పాకిస్తాన్‌కు ఎదురైన మరో అవమానకరమైన ఓటమి ఇది. కరాచీలో పాకిస్తాన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ ముందుగా బ్యాటింగ్ చేసి 286 పరుగుల గౌరవప్రదమైన స్కోర్ సాధించింది. సొంత గడ్డపై విజయం సాధిస్తారని ఆశించినా కానీ, భారత్ కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి, 46.5 ఓవర్లలో 287 పరుగులు చేసి సులభంగా విజయం సాధించింది. ఇది కూడా పాకిస్తాన్‌కు పెద్ద అవమానంగా మిగిలిపోయింది.







# సత్తా చాటిన భారత్

ఆట

## కొరియా 4-2 తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఆసియా కప్-2025, తొలి సూపర్ 4 పోరులో కొరియాను ఓడించి భారత్ సత్తా చాటింది. హాంగ్జౌలో బుధవారం జరిగిన తొలి సూపర్ 4 మ్యాచ్‌లో భారత మహిళల హాకీ జట్టు దక్షిణ కొరియాను 4-2 తేడాతో ఓడించింది. భారత్ తరపున వైష్ణవి ఫాల్కే, సంగీతా కుమారి, లాల్రెమ్సియామి, రుతుజా పిసల్ గోల్స్ చేయగా, కిమ్ యుజిన్ కొరియా తరపున రెండు గోల్స్ పెనాల్టీ కార్నర్ల ద్వారా సాధించారు. మ్యాచ్ ప్రారంభమైన రెండు నిమిషాల్లోనే పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుని భారత్ శుభారంభం చేసింది. ఉదిత కొట్టిన స్టింగ్ స్ట్రైక్‌ను కొరియా గోల్ కీపర్ సియోయోన్ లీ అడ్డుకున్న తర్వాత సెట్‌పీస్ నుండి ఇంజెక్టర్ వైష్ణవి విఠల్ ఫాల్కే (2వ నిముషం) రీబౌండ్‌లో బంతిని గోల్‌గా చేసి భారత్‌కు తొలి ఆధిక్యాన్ని అందించింది. రెండవ క్వార్టర్‌లో భారత్ తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. నాలుగు నిమిషాల కంటే తక్కువ సమయంలో పెనాల్టీ కార్నర్‌ను సంపాదించింది. కానీ భారత గోల్ కీపర్ బిచు దేవి ఖరీబమ్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సేవ్‌ను చేయడంతో మొదటి అర్ధభాగం ముగిసే సమయానికి 1-0 ఆధిక్యంలో ఉంది. రుతుజా దాదాసో పిసల్ దీ ఏరియా లోపల ముగ్గురు డిఫెండర్లను డ్రిబుల్ చేసి సంగీతా కుమారి (33)కి పాస్ ఇచ్చారు. అయితే, యుజిన్ కిమ్ (33) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడంతో కొరియా ఒకదాన్ని వెనక్కి తీసుకుంది. అయినా భారత్ దాడి కొనసాగించి 40వ నిమిషంలో లాల్రెమ్సియామి క్లినికల్ చేసిన ప్రయత్నంతో 3వ క్వార్టర్ ముగిసే సమయానికి భారత్3-1తో నియంత్రణలో ఉంది. నాల్గవ క్వార్టర్‌లో యుజిన్ కిమ్ (53) ఆటలో తనరెండవ గోల్‌ను కొట్టి, మరోసారి పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చింది. రుతుజా మొదటి సూపర్ 4పూల్ ఎన్‌కౌంటర్‌లో 4-2తేడాతో ఆధిక్య విజయాన్ని సాధించింది.

## వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్:

# కాంస్య పతక పోరులో భారత్ ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్-2025, మహిళల రికర్వ్ జట్టులో భారత్ ఓటమిని ఎదుర్కొంది. కాంస్య పతక పోరులో ఒలింపిక్ ఛాంపియన్ దక్షిణ కొరియాతో భారత్ పోరాడినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల రికర్వ్ జట్టు దీపికా కుమారి, అంకితా భకత్, గాథా ఖడ్కే దక్షిణ కొరియా చేతిలో 3-5 తేడాతో ఓడిపోయారు, చివరి సిరీస్‌లో షూటాఫ్‌కు 58 పరుగులు అవసరమైనప్పుడు 56 పరుగులు చేశారు. తన తొలి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో గాథా తన తొలి రెండు షాట్‌లలో 6, 8 పరుగులు చేయడంతో భారత్ మ్యాచ్‌ను పేలవంగా ప్రారంభించింది. ఈ స్కోర్‌లను కొరియా సద్వినియోగం చేసుకుని తొలి సెట్‌ను 54-51తో గెలుచుకుంది. కానీ, తరువాతి రెండు సెట్లలో భారత్ బలంగా పుంజుకుని వరుసగా రెండు సెట్లను 57 పరుగులు సాధించి, ఒక సెట్‌ను గెలిచి, మరొక సెట్‌ను సమం చేయడం ద్వారా మ్యాచ్ స్కోరును 3-3తో సమం చేసింది. చివరి సెట్‌లో, కొరియా తన ప్రతిభను ప్రదర్శించింది, మ్యాచ్‌లో అత్యధిక స్కోరు అయిన 58ని నమోదు చేసింది. చివరికి 2 పాయింట్ల తేడాతో భారత్ ఓడిపోయింది. దీనితో, భారత్ రికర్వ్ జట్టు 4వ స్థానంలో నిలిచింది. మరియు 2015 ఎడిషన్‌లో రజతం తర్వాత భారత్ ఆర్చర్ల తొలి రికర్వ్ మహిళల జట్టు పతకాన్ని జోడించడంలో విఫలమైంది.



## ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో

# భారత్ గెలుపు

### అర్హత రేసు నుంచి 6-0తో బ్రూనై నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి అండర్ 23 ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో 6-0 తేడాతో బ్రూనైను భారత్ ఓడించింది. తదుపరి అర్హత రేసు నుంచి నిష్క్రమించింది. ఖతార్‌లోని దోహాలోని సుహీమ్ బిన్ హమద్ స్టేడియంలో జరిగిన క్వాలిఫయర్స్‌లో గ్రూప్ బీలో భారత అండర్ 23 పురుషుల జాతీయ జట్టు తమ చివరి మ్యాచ్‌లో 6-0 తేడాతో బ్రూనై దారుస్సలామ్‌ను ఓడించింది. బ్లూ కోల్ట్స్ బహ్రెయిన్‌ను 2-0తో ఓడించి, ఆతిథ్య ఖతార్ చేతిలో 1-2తో ఓడిపోయి, బ్రూనై దారుస్సలాంపై విజయం సాధించింది. గ్రూప్ దశలో రెండవ స్థానాన్ని దక్కించుకున్నా కానీ తొలి ఎఎఫ్‌సి అండర్ 23 ఆసియా కప్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. మిడ్‌ఫీల్డర్ విబిన్ మోహనన్ (5వ నిముషం, 7, 62) హ్యాట్రిక్ సాధించగా, మహమ్మద్ ఐమెన్ (87, 90+7) రెండు గోల్స్, ఆయుష్ ఛెత్రి (41) ఒక గోల్ చేశాడు. భారత్ తన తొలి గోల్‌తో శుభారంభం చేసింది. ఐదవ నిమిషంలోనే విబిన్ టాకిల్ కొట్టి తన జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. రెండు నిమిషాల తర్వాత మిడ్‌ఫీల్డర్ మళ్ళీ గోల్ చేశాడు. మూసా 32వ నిమిషంలోనే సెంటర్ ఫార్వర్డ్ పార్థిబ్ గొగోయ్‌ను పోటీలోకి ప్రవేశపెట్టడంతో మరింత దాడి చేసే అవకాశం లభించింది. తొమ్మిది నిమిషాల తర్వాత, ఆయుష్ మూడవ గోల్ చేశాడు. నాల్గవ గోల్ చేయడానికి 15 నిమిషాల కంటే కొంచెం ఎక్కువ సమయం పట్టింది. ఐమెన్ కూడా బ్రూనై గోల్‌మోత్‌ను ఢీకొట్టి 83వ నిమిషంలో గోల్‌లోకి దూసుకెళ్లాడు. ఐమెన్ మరో రెండు అద్భుతమైన గోల్స్ చేసి జట్టును ఆరు గోల్స్‌గా మార్చాడు. ఈ రెండూ ఆటలో చివరి దశలో ఉన్న లాంగ్ రేంజర్లే, బ్లూ కోల్ట్స్ ఆధిక్యాన్ని 6-0 గా నిలిపాయి.



## హాంకాంగ్ ఓపెన్‌లో..

# లక్ష్యసేన్ ముందుకు

### పివి సింధు, ధ్రువ్-తనీషా ఓటమి



న్యూఢిల్లీ: హాంకాంగ్ ఓపెన్ 2025లో లక్ష్య సేన్ ముందుకు దూసుకుపోగా, పివి సింధు, ధ్రువ్‌తనీషా ఓటమితో ముందస్తుగానే టోరీనుండ్చి నిష్క్రమించారు. బుధవారం జరిగిన హాంకాంగ్ ఓపెన్‌లో భారత్‌కు చెందిన లక్ష్య సేన్ 22-20, 16-21, 21-15 తేడాతో వాంగ్ త్జు వీని ఓడించి ఆర్16 కి చేరుకున్నాడు. అయితే, పివి సింధు తొలి రౌండ్‌లోనే ఘోర పరాజయంతో నిష్క్రమించింది. డెన్మార్క్‌కు చెందిన లైన్ క్రిస్టోఫర్‌సన్ చేతిలో గట్టి పోటీని ఎదుర్కొని ఓడిపోయింది. సింధు తొలి గేమ్‌ను 21-15తో కైవసం చేసుకుని, తదుపరి గంటలోపు 16-21, 19-21 తేడాతో ఓడిపోయింది. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కు మరింత నిరాశ ఎదురైంది, ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో తొలి మ్యాచ్‌లో తైవాన్‌కు చెందిన చెన్ చెంగ్‌కువాన్-హ్సు యా చింగ్ చేతిలో 16-21, 11-21 తేడాతో ఓడిపోయారు. ఇక క్వాలిఫయర్స్‌లో కిరణ్ జార్జ్ 21-18, 21-14 తేడాతో ఎస్. శంకర్ ముత్తుసామి సుబ్రమణియన్‌ను ఓడించి ప్రధాన డ్రాలో స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఇక తరుణ్ మన్నెపల్లి తన తొలి క్వాలిఫయర్‌లో సంచలనం సృష్టించాడు, మాజీ ప్రపంచ నంబర్ 1 కిదాంబి శ్రీకాంత్‌ను 28-26, 21-13 తేడాతో ఓడించాడు, ఆ తర్వాత మూడు గేమ్‌లలో మలేషియాకు చెందిన జస్టిన్ హో చేతిలో ఓడిపోయాడు. దీంతో శ్రీకాంత్, మన్నెపల్లి క్వాలిఫయర్స్‌లో నిష్క్రమించారు.

# ఇక ఐఫోన్17 తయారీ భారత్‌లోనే!

**ముంబయి, సెప్టెంబరు 10:** టెక్ దిగ్గజం యాపిల్ ఐఫోన్ 17 సిరీస్‌ను పూర్తిగా భారత్‌లోనే తయారు చేయాలని నిర్ణయించింది. ఈ పరిణామం కేంద్ర ప్రభుత్వ మేక్ ఇన్ ఇండియాకు ఊతమివ్వడమే ప్రీమియం పరికరాల తయారీ కేంద్రంగా భారత్‌ను నిలబెడుతుంది. భారత్‌లో ఐఫోన్ల తయారీని విస్తరించడం ద్వారా యాపిల్ అనేక ప్రయోజనాలు పొందనుంది. పూర్తిగా తయారైన ఫోన్లను దిగుమతి చేసుకుంటే విధించే 20 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ భారం నుంచి కంపెనీ తప్పించుకోగలుగుతుంది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని తన భాగస్వాములైన ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ ద్వారా ఈ ఉత్పత్తి ప్రక్రియను చేపట్టనుంది. గ్రాంట్ థార్న్‌టన్ భరత్ సంస్థకు చెందిన నిపుణుడు క్రిషన్ అరోరా మాట్లాడుతూ భారత్‌లో ఉద్యోగ అవకాశాలు భారీగా పెరుగుతాయి. హైటెక్ తయారీ రంగంలో మన దేశ విశ్వసనీయత మరింత బలపడుతుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కూడా యాపిల్‌కు కలిసివస్తోంది. ఈ పథకం కింద, భారత్‌లో తయారు చేసి విక్రయించే ఫోన్లపై 5 ఏళ్లపాటు 4 నుంచి 6 శాతం నగదు ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఈ ప్రోత్సాహకాలతో యాపిల్ కాంట్రాక్ట్ తయారీదారులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో 10 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను ఎగుమతి చేశారు. 2025 ప్రథమార్థంలో ఎగుమతులు గత సంవత్సరంతో పోలిస్తే 53 శాతం పెరిగి 2.39 కోట్ల యూనిట్లకు చేరాయి. ఈ నిర్ణయం వల్ల భారతీయ వినియోగదారులకు ఐఫోన్ల ధరలు వెంటనే తగ్గే అవకాశం లేకపోవచ్చని క్రిషన్ అరోరా స్పష్టం చేశారు.

## వాణిజ్యం




# అనిల్ అంబానీపై మరో చీటింగ్‌కేసు

**ముంబయి, సెప్టెంబరు 10:** ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి మరో షాక్ తగిలింది. ఆయనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదు చేసింది. రూ.2,929 కోట్ల మోసం కేసులో అనిల్ అంబానీపై ఈడీ కొత్త మనీలాండరింగ్ కేసు దాఖలు చేసింది. రూ.2,929.05 కోట్ల రుణ మోసం కేసులో అనిల్ అంబానీపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ఇటీవలే చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అనిల్ అంబానీపై కేసు కూడా నమోదు చేసింది. ఈ కేసులో అంబానీకి చెందిన సంస్థలపై సీబీఐ ఇటీవలే సోదాలు చేపట్టిన విషయం తెలిసిందే. సీబీఐ దాఖలు చేసిన ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ ఆధారంగా తాజాగా ఈడీ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రూ.3 వేల కోట్ల రుణ మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అనిల్ అంబానీని ఇప్పటికే విచారించిన విషయం తెలిసిందే.



# సెన్సెక్స్, నిఫ్టీలకు ఐటి, ఆర్థికరంగ షేర్ల మద్దతు

### లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబయి, సెప్టెంబరు 10:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. ఐటీ, ఫైనాన్సియల్, రియాలిటీ షేర్లు రాణించాయి. ఆటో, మీడియా స్టాక్స్ లాభాల స్వీకరణకు దిగడంతో ఇంట్రాడేలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,504.36 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,235.42 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 81,643.88 పాయింట్ల వరకు చేరింది. చివరకు 323.83 పాయింట్ల లాభంతో 81,425.15 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 104.5 పాయింట్లు పెరిగి 24,973.10 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.7శాతం వరకు పెరిగాయి. నిఫ్టీలో భారత్ ఎలక్ట్రానిక్స్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్ లాభాలను ఆర్జించాయి. అయితే, ఎంఅండ్ఎం, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, మారుతి సుజుకీ, టాటా మోటార్స్ నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే ఆటో ఇండెక్స్ ఒకశాతం, ఐటీ ఇండెక్స్ 2.6శాతం వృద్ధిని నమోదు చేసింది. పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 2.2శాతం, రియాలిటీ ఇండెక్స్ ఒకశాతం దాకా పెరిగింది. అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ షేర్లు 16శాతం ర్యాలీ చేశాయి. అవంతి ఫీడ్స్ 15శాతం, కోస్టల్ కార్పొరేషన్ షేర్లు 20శాతం, గోకల్దాస్ ఎక్స్‌పోర్ట్స్ 4శాతం పెరిగాయి. వెల్స్పన్ లివింగ్ 8, అరవింద్ షేర్లు 4శాతం వృద్ధిని నమోదు చేశాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 88.10గా ఉంది. ఆసియా మార్కెట్లు లాభాల్లోనే ముగిస్తే యూరోపియన్ సూచీలుకూడా లాభాల్లోనే ట్రేడ్ అయ్యాయి.

# హుండై, ఫోర్డ్ వాహనాల భారీ రీకాల్

**ముంబయి, సెప్టెంబరు 10:** ప్రముఖ ఆటోమొబైల్ కంపె నీలు హ్యుందాయ్ మోటార్, ఫోర్డ్‌సహా మరో3 సంస్థ లు భారీ రీకాల్‌ను ప్రకటించాయి. వాహనాల్లో భద్రతా పరమైన లోపాలున్నట్లు గుర్తించిన కంపెనీలు, మొత్తం 40,000కు పైగా వాహనాలను వెనక్కి పిలిపిస్తున్నట్లు ప్రకటించాయి. ఈ రీకాల్‌లో హ్యుందాయ్, ఫోర్డ్, డీఎన్ఏ మోటార్స్, మెర్సిడెస్ బెంజ్ కొరియా, స్టెల్లాంటిస్ కొరియా (జీప్ మాతృ సంస్థ) కంపెనీలు ఉన్నాయి. ఈ ఐదు కంపెనీలకు చెందిన 16 వేర్వేరు మోడళ్లలో మొత్తం 40,380 యూనిట్లను రీకాల్ చేస్తున్నట్లు కంపెనీలు వెల్లడించాయి. యోన్‌హాప్ న్యూస్ ఏజెన్సీ నివేదిక ప్రకారం, వాహనాల్లో పలు కీలకమైన సమస్యలను అధికారులు గుర్తించారు. హ్యుందాయ్ వారి పాలిసేడ్ ఎస్‌యూవీలో హుడ్ లాచ్ బలహీనంగా ఉండటం, ఫోర్డ్ ఎక్స్‌ప్లోరర్ ఎస్‌యూవీలో సీట్ బెల్ట్ బకిల్ బోల్టులలో లోపం ప్రధాన కారణాలుగా ఉన్నాయి. అదేవిధంగా మెర్సిడెస్ బెంజ్ జీఎల్‌సీ 300 4మ్యాటిక్ మోడల్‌లో స్టీరిం గ్ సిస్టమ్‌కు సంబంధించిన భాగాలు వదులుగా ఉండటం, జీప్ వ్రాంగ్లర్ వాహనాల్లో యాంటెన్నా కేబుల్స్‌లో సమస్యలు ఉన్నట్లు తెలిపారు. డీఎన్ఏ మోటార్స్‌కు చెందిన యూహెచ్‌ఆర్125 మోటార్‌సైకిల్‌లో సెన్సార్ లోపం ఉన్నట్లు కూడా తమ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో వాహనాల్లో లోపాల కారణంగా రీకాల్స్ జరగడం ఇదే మొదటిసారి కాదు. జూన్‌లో జాగ్వార్ ల్యాండ్ రోవర్, జనరల్ మోటార్స్ వంటి సంస్థలు 14,000 లకు పైగా వాహనాలను భద్రతా కారణాలతో వెనక్కి పిలిపించాయి. అంతకుముందు మే నెలలో కూడా కియా, బీఎండబ్ల్యూ, హ్యుందాయ్ కంపెనీలు 16,000 లకు పైగా వాహనాలను రీకాల్ చేయడం గమనార్హం.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14